RNI NO.APTEL / 2013 /50370

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org
శనివారం 10.08.2024 | సంపుటి : 11 | సంచిక : 31 | పేజీలు : 12 | వెల: రూ. 4/-




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## రజత నీరజ్

బల్లెం వీరుడు, భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా పారిస్ ఒలింపిక్స్ లో సిల్వర్ మెడల్ సాధించాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన జావెలిన్ త్రో ఫైనల్‌లో నీరజ్ రెండో ప్రయత్నంలో ఈటెను 89.45 మీటర్లు విసిరాడు. దీంతో మొత్తం 12 మంది పోటీ పడ్డ ఫైనల్‌లో రెండో స్థానంలో నిలిచాడు. పాక్ అథ్లెట్ నదీమ్ అర్షద్ 92.97 మీటర్లు విసిరి స్వర్ణం సాధించాడు. గ్రెనడా అథ్లెట్ పీటర్స్ అండర్సన్ (88.54 మీటర్లు) కాంస్యం వచ్చింది.

వివరాలు స్పోర్ట్స్ పేజీలో..

నిజామాబాద్‌లో ఏసీబీ వలలో

## తిమింగలం



అక్రమ ఆస్తుల ఆరోపణలపై మున్సిపల్ కార్పోరేషన్ సూపరింటెండెంట్ ఇంటిపై ఏసీబీ దాడులు

12లో

# తరలివస్తున్న పెట్టుబడులు

## హైదరాబాద్‌లో ఆమ్‌జెన్ రీసెర్చ్ సెంటర్ • ఈ ఏడాది చివర్లో ప్రారంభం

- మూడు వేల మందికి ఉద్యోగాలు
- అడోబ్ సీఈవో శంతన్ నారాయణ్‌తోనూ సీఎం భేటి
- రాష్ట్రంలో ప్రాజెక్టులపై ఆసక్తి
- పెట్టుబడులకు ముందుకు రండి
- ఐటీ సర్వీసెస్ కంపెనీల ప్రతినిధులకు పిలుపు
- ఐటి సర్వ్ అలయన్స్ సమావేశంలో రేవంత్ రెడ్డి



న్యూయార్క్(జనంసాక్షి): అమెరికాలోనే అతి పెద్ద బయో టెక్నాలజీ కంపెనీ ఆమ్ జెన్ తెలంగాణలో కార్యకలాపాలను విస్తరించనుంది. హైదరాబాద్ లో కొత్తగా రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ విభాగం ప్రారంభించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. హైటెక్ సిటీలో ఆరు అంతస్తుల భవనంలో ఈ సెంటర్ ఉంటుంది. దాదాపు 3 వేల మందికి ఇక్కడ ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ఏడాది చివరి త్రైమాసికం నుంచే కంపెనీ తమ కార్యకలాపాలు ప్రారంభించనుంది. సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు శాన్ ఫ్రాన్సిస్కోలోని ఆమ్జెన్ ఆర్ అండ్ డీ కేంద్రంలో కంపెనీ ఎండీ డాక్టర్ డేవిడ్ రీస్, నేషనల్ ఎక్స్యూటివ్ మిస్టర్ సోమ్ చటోపాధ్యాయతో సమావేశమయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలో పేరొందిన బయోటెక్ సంస్థ హైదరాబాద్‌ను తమ కంపెనీ అభివృద్ధి కేంద్రంగా ఎంచుకోవటం మిగతా 2లో..

## హైదరాబాద్‌లో గ్రీన్ డేటా సెంటర్

- ఆరమ్ ఈక్విటీ పార్టనర్స్ రూ.3350 కోట్ల భారీ పెట్టుబడులు
- ఏఐ ఆధారిత నెక్స్ జెన్ సేవలను అందించే లక్ష్యం

2లో

## తెలంగాణ.. 'ఫ్యూచర్ స్టేట్'

### ఇకపై ఇదే ట్యాగ్‌లైన్‌తో పిలుద్దాం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):ఇకపై తెలంగాణను 'ఫ్యూచర్ స్టేట్' అనే ట్యాగ్ లైన్‌తో పిలుద్దామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ పునర్నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో ఫ్యూచర్ స్టేట్‌కు తెలంగాణ పర్యాయ పదంగా నిలుస్తుందని చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం.. కాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. టెక్ యూనికార్న్ సీఈవోలను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఐటీ యూనికార్న్ ప్రతినిధులను మిగతా 2లో..



## వాళ్ల దుస్తులు.. వాళ్ల ఇష్టం

- హిజబ్ ధరించడాన్ని ఎలా నిషేధిస్తారు?
- వారికిష్టమైన దుస్తుల్ని ఎంచుకునే స్వేచ్ఛవాళ్లకుంది
- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు
- మహారాష్ట్రలో హిజాబ్ నిషేధంపై ధర్మాసనం స్టే

దిల్లీ(జనంసాక్షి):క్యాంపస్‌లో హిజాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ మహారాష్ట్ర లోని ఓ కాలేజీ ఇచ్చిన సర్క్యులర్‌పై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. విద్యార్థుల పేర్లతో వారి మతపరమైన గుర్తింపు బయట పడట్లేదా? అని ప్రశ్నించింది. అమ్మాయిలకు తాము ధరించే దుస్తులను ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని అభిప్రాయపడింది. క్యాంపస్ లో హిజాబ్, బుర్కా, నిఖాబ్, క్యాప్ వంటివి ధరించకూడదంటూ ముంబయిలోని ఎన్‌జీ ఆచార్య అండ్ డీకే మరాఠీ కాలేజీ ఇటీవల ఓ సర్క్యులర్ జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ కొన్ని విద్యార్థి సంఘాలు బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. కళాశాల నిర్ణయాన్ని ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ వారు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. నిషేధంపై స్టే విధించింది. "అమ్మాయిలకు వారు ధరించే దుస్తులను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ మిగతా 2లో..

# సుంకిశాలపై పూర్తిస్థాయి విచారణ

### ఘటనపై ఆందోళన వద్దు.. కాంట్రాక్టరే భరిస్తారు • బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఘటన

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి • కాంగ్రెస్ సర్కారుపై విమర్శలు సరికాదు: గుత్తా



నల్లగొండ బ్యూరో(జనంసాక్షి): బీఆర్ఎస్ హయాంలోనే సుంకిశాల పంప్ హౌజ్ పనులు జరిగాయని భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కూలిపోయిన రిటైనింగ్ వాల్‌ను శుక్రవారం మంత్రులు పరిశీలించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి ఉత్తమ్ సుంకిశాల పంప్ హౌజ్ ను సందర్శిం చారు. అనంతరం మీడియాతో మాట్లా డుతూ.. ఈ ఘటన సోషల్ మీడియా ద్వారానే ప్రభుత్వానికి తెలిసింది.. వెంటనే ప్రభుత్వం స్పందించిందన్నారు. వాటర్ వర్క్స్ అధికారులు విచారణ చేస్తున్నారని చెప్పారు. సీఎం రేవంత్ అమెరికా నుంచి తిరిగి వచ్చిన తరువాత వారితో చర్చించి తీసుకోవాల్సిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో దక్షిణ తెలంగాణ నిర్లక్ష్యానికి గురైందన్నారు. సుంకిశాల ఘటనపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జరిగిన ఘటన చిన్నదేనని, నష్టం కూడా తక్కువేనని, దానిని కాంట్రాక్టరే భరిస్తారని ఉత్తమ్ చెప్పారు. ప్రజలకు, ప్రభుత్వానికి ఎలాంటి నష్టం లేదని మంత్రి పేర్కొన్నారు. నిర్మాణం పూర్తి కావడానికి ఒకటి, రెండు నెలలు ఆలస్యం అవుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఎస్ఎల్బీసీని తాము పూర్తి చేస్తామని చెప్పారు. డిండి ఎత్తిపోతల పనులు మిగతా 2లో..



## మీదే బాధ్యత

- సుంకిశాలపై అసత్య ప్రచారం సరికాదు
- రిటైనింగ్ వాల్ కూలినా ఎందుకు దాచి పెట్టారు?
- ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్‌దే బాధ్యత
- మంచి జరిగితే మీ ఖాతాలో..లేకపోతే మా ఖాతాలోనా?
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):సుంకిశాల ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నీటి అవసరాల కోసం సుంకిశాల ప్రాజెక్టు ప్రారంభించామని చెప్పారు. ప్రాజెక్టుకు మిగతా 2లో..

## కవిత ఆరోగ్యం క్షీణించింది

- 11 కేజీల బరువు తగ్గారు
- బీపీ, ఇతర సమస్యలతో బాధపడుతున్నారు
- బెయిల్ వస్తుందన్న ఆశతో ఉన్నాం: కేటీఆర్

2లో

## కాళేశ్వరంతో ప్రజల సొమ్ము లూటీ

- ప్రాజెక్టుల పేరుతో భారీగా దోపిడీ
- సీతారామ ప్రాజెక్టులోనూ రూ.8వేల కోట్లు కాజేశారు
- ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ఖమ్మం(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో దోచుకుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమారు ఆరోపించారు. కాళేశ్వరం, ఇరిగేషన్‌లో ప్రజల సొమ్ము లూటీ చేశారని ఆరోపణలు చేశారు. శుక్రవారం నాడు ఏన్కూర్ వద్ద సీతారామ ప్రాజెక్ట్ కాలువల నిర్మాణ పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... రీ డిజైన్ పేరుతో సీతారామ ప్రాజెక్టుకు రూ. 18వేల కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం పనులు చేపట్టి రూ.8 వేల కోట్ల ప్రజల సొమ్మును కాజేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రాజెక్టులు అన్ని సాగులోకి తెచ్చి రైతులకు ఉపయోగపడాలని శరవేగంగా పనులు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.సీతారామతో లక్షా 35 వేల ఎకరాలు వైరా, లంకా సాగర్ ప్రాజెక్టులు మైనర్ ఇరిగేషన్‌లో అనుసంధానం చేస్తున్నామని అన్నారు. ఈ నెల 15వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి సీతారామ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తారని వెల్లడించారు. రాబోయే కొద్ది రోజుల్లో సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అడ్డంకులు ఉన్నా అధిగమిస్తామని అన్నారు. లక్షా 75 వేల ఎకరాలు సాగులోకి మొదటి విడతలో తీసుకురాబోతున్నామని చెప్పారు. రైతుల రుణమాఫీ చేశామని తెలిపారు. రూ.లక్షా 50 వేల నుంచి 2లక్షల వరకు బ్యాంకులో రుణం ఉన్న అన్నదాతలకు మాఫీ చేస్తామని, రూ.31వేల కోట్లు రైతులకు ఇచ్చే పరిస్థితి లేదని.. అయినా రైతుల ప్రభుత్వం కాబట్టి రుణమాఫీ చేశామని మంత్రి పొంగులేట మిగతా 2లో..

## వరంగల్ ఎంజీఎంలో దారుణం

### పసి గుడ్డును తిన్న కుక్కలు

### ఆస్పత్రి క్యాజువాలిటీ ముందు ఘటన

వరంగల్ ఎంజీఎం (జనంసాక్షి): నాలుగు రోజుల పసికందును కుక్కలు పీక్కొని తిన్న సంఘటన వరంగల్ ఎంజీఎం క్యాజువాలిటీ వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది అయితే పసికందును కుక్కలు ఎక్కడ నుండో తిసుకోని వచ్చి క్యాజువాలిటీ పక్కన ఉన్న చెట్ల లో పడేశాయి అక్కడ దగ్గర్లో మిగతా 7లో..



## వక్ఫ్‌బిల్లు పరిశీలనకు జేపీసీ

- 31 ఎంపీలతో కమిటీ ఏర్పాటు
- తెలంగాణ నుంచి అసదుద్దీన్,డీకే అరుణలకు చోటు
- ఆంధ్రా నుంచి లావు శ్రీకృష్ణదేవరాయలు, విజయసాయిరెడ్డిలకు స్థానం

న్యూఢిల్లీ(జనంసాక్షి):వక్ఫ్ సవరణ చట్టం బిల్లుపై 21 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ ఎంపీలతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ జేపీసీని నియమించారు. ఇందులో నలుగురు తెలుగు ఎంపీలకు అవకాశం లభించింది. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ(హైదరాబాద్), భాజపా ఎంపీ డీకే అరుణ (మహబూబ్‌నగర్), తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు(నరసరావుపేట), వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి(రాజ్యసభ) మిగతా 2లో..



## సిసోడియాకు బెయిల్ మంజూరు

### 17 నెలల సుదీర్ఘ కాలం తరవాత జైలుజీవితం నుంచి విముక్తి

న్యూఢిల్లీ(జనంసాక్షి): సిసోడియాకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను సుప్రీం మంజూరు చేసింది. ఈ మేరకు ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం, ఆప్ నేత మనీష్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. ఎక్సైజ్ పాలసీ కేసులో 17 నెలల తర్వాత ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం తుది తీర్పును వెలువరించింది. ప్రతి సోమవారం దర్యాప్తు సంస్థ మిగతా 7లో..

## వైరా సభతో రైతులకు రుణవిముక్తి

- రైతులతో ఆనాడు భారీ బహిరంగ సభ
- ఆగష్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ
- ఇందిరమ్మ రాజ్యంతో రైతుల్లో ఆనందం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి



ఖమ్మం(జనంసాక్షి): రెండు లక్షల వరకు ఆగష్టు 15లోపు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో నిబద్ధతతో పని చేస్తున్నామన్నారు. ఆగస్ట్ 15లోపు రుణాలు వైరాలో భారీ రైతు బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గం, ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున పాల్గొంటారన్నారు. వైరా నుంచి ఆగష్టు 15న రాష్ట్రంలో రైతులకు రుణ విముక్తి చేస్తామని స్పష్టం చేశారు. రైతుల రుణమాఫీ చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చాలెంజ్ చేశారని.... కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టడం కోసం వైరా సభలో రైతులు పండుగ లాగా పాల్గొని మన రైతాంగ సోదరులు మంచి సందేశం ఇచ్చేలా సభ జరుపుతామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత 2 లక్షల రైతుల రుణ మాఫీ చేస్తాం అని హామీ ఇచ్చామని.. చేసి చూపిస్తున్నామని తెలిపారు. జూలై 15 న జీవో ఇచ్చామని.. 18 జూలైన ఒక లక్ష రూపాయల రుషమాఫీ 6,983 కోట్లు విడుదల చేశామని తెలిపారు. రెండవ సారీ రూ.6190.02 కోట్లతో జూలై మాసంలో మళ్ళీ విడుదల చేశామన్నారు. లక్షన్నర వరకు రుణం ఉన్న వాళ్ళందరికి నేరుగా 12289 కోట్లు 16.29 లక్షల కుటుంబాలకు నిధులు విడుదల చేశామని తెలిపారు. రాష్ట్ర బ్జడెట్‌లో రుణ మాఫీ ఒక్కటే కాదు... రైతు భీమాకి సంబంధించి ఒక వెయ్యి , 500 కోట్లు రైతుల తరుపున ప్రభుత్వం కడుతుందన్నారు. క్రాప్ట్ ఇన్సూరెన్స్ కూడా చేస్తున్నామన్నారు. రైతులు కట్టాల్సిన రూ. 1,350 కోట్లు కడుతున్నామని వెల్లడించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.72 వేల కోట్లు కేటాయించామన్నారు. పండే ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఉద్యానవన పంటలు, డ్రిప్, సింప్లన్‌కు ఆధునీకరణకు నిధులు మంజూరు చేశామన్నారు. మిగతా 2లో..

## నా పేరు తప్పు ఎలా పిలుస్తారు?

### • జయబచ్చన్ గుస్సా • ఆమెకు మద్దతుగా సోనియా, కాంగ్రెస్ వాకౌట్

దిల్లీ(జనంసాక్షి): రాజ్యసభ ఎంపీ, సమాజ్ వాదీ పార్టీ నాయకురాలు జయా బచ్చన్‌కు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ మద్దతుగా నిలిచారు.మరోసారి జయా బచ్చన్ పేరును జయా అమితాబ్ బచ్చన్‌గా రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్ ఖడ్ సంబోధించడంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనిపై దన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తంచేస్తూ.."నాకు పాఠాలు చెప్పొద్దు" అని తీవ్రంగా మిగతా 2లో..



## వైరాసభతో రైతులకు రుణవిముక్తి

రూ.1,450 కోట్లతో పూర్తి చేసే రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను రీ డిజైన్ చేసి సీతారామ పేరు పెట్టి కేసీఆర్ ప్రభుత్వం రూ.23 వేల కోట్లుకు పెంచి దోపిడీ చేసిందని ఆరోపించారు. ఆనాటి నుంచి కాంగ్రెస్ ఖండిస్తూ వస్తోందన్నారు. రూ.8 వేల కోట్లు ఖర్చు పెట్టినా ఒక ఎకరాకు నీరు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రుల సమక్షంలో రివ్యూ చేశామన్నారు. తక్కువ ఖర్చుతో నీళ్ళు పారించే విధానంతో అతి తక్కువ ఖర్చుతో కేవలం రూ.75 కోట్లతో లక్షన్నర ఎకరాలు పండించేలా సీతారామ ప్రాజెక్ట్ లింకు కెనాల్‌తో పనులు చేశామన్నారు. ఎన్ఎస్‌పీ లింకు , వైరా కెనాల్‌కు లింకు కలపటమే రేపటి కార్యక్రమమని... ఇదీ మా నిబద్ధతకు తార్కాణం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## కాళేశ్వరంతో ప్రజల సొమ్ము లూటీ

శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ. 2లక్షలకు పైగా రుణాలు దాటిన రైతులు నగదు చెల్లించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇస్తామని అన్నారు. మొదటి విడతగా 4లక్షల ఇళ్లు అందజేస్తామని ప్రకటించారు. కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని చెప్పారు. నిరుపయోగంగా ఉన్న ఇళ్లను పూర్తి చేస్తామని అన్నారు. తెల్ల రేషన్ కార్డుల కోసం పేదలు ఎదురు చూస్తున్నారన్నారు. హెల్త్ కార్డు... తెల్లరేషన్ కార్డులు త్వరలోనే ఇస్తామని ప్రకటించారు. ధరణీ అనే భూతంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని దానికి మోక్షం కల్పిస్తామని తెలిపారు. అద్భుతమైన రెవెన్యూ చట్టం తీసుకుని రాబోతున్నామని స్పష్టం చేశారు. 80 వేలు పుస్తకాలు చదివిన దొరవారు సూచనలు చేస్తే పరిశీలించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యం ప్రతి ఒక్కరి కలను నెరవేరుస్తుందని ఉద్ఘాటించారు. ప్రభుత్వ భూమి, నిధులు దుర్వినియోగం కాకుండా కాపాడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## వక్ఫ్‌బిల్లు పరిశీలనకు జేపీసీ

సభ్యులుగా ఉంటారు. వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు తెచ్చే దిశగా రూపొందించిన సవరణ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం కాస్త వెనక్కి తగ్గిన సంగతి తెలిసిందే. గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై విపక్షాల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో దీనిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపించనున్నట్లు కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు.

## నా పేరు తప్పు ఎలా పిలుస్తారు!

స్పందించారు. దాంతో ఛైర్మన్ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేయడంతో సభలో గందరగోళ వాతావరణం ఏర్పడింది. ఛైర్మన్ వైఖరిని నిరసిస్తూ విపక్షాలు వాకౌట్ చేశాయి.దీనిపై జయ మీడియాతో మాట్లాడారు. "ఛైర్మన్ ఉపయోగించిన స్వరాన్ని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా. మేం పాఠశాల విద్యార్థులం కాదు. మాలో కొందరు సీనియర్ సిటిజెన్లు కూడా ఉన్నారు. ప్రతిపక్ష నేత మాట్లాడేందుకు నిల్చున్న సమయంలో ఆయన మాట తీరు బాధించింది. మైక్ కట్ చేశారు. అలా ఎలా ప్రవర్తిస్తారు? మీరు సెలబ్రిటీ అయితే ఏంటి నేను పట్టించుకోనంటూ తీవ్ర పదజాలం వాడుతుంటారు. ఆయన పట్టించుకోవాలని నేను అడగడం లేదు. ఐదోసారి నేను రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నా. నాకు తెలీదా ఏం మాట్లాడాలో..? ఇలాంటి ప్రవర్తన గతంలో ఎన్నడూ చూడలేదు. దీనిపై క్షమాపణలు చెప్పాలి" అని ఆమె డిమాండ్ చేశారు. ఆ సమయంలో ఆమె వెంట సోనియా గాంధీ కూడా ఉన్నారు.ఇటీవల రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణసింగ్.. 'జయా అమితాబ్ బచ్చన్' మాట్లాడాలంటూ ఆహ్వానించారు. దీనిపై జయాబచ్చన్ అభ్యంతరం వ్యక్తంచేశారు. 'జయా బచ్చన్ అంటే సరిపోతుంది' అంటూ పేర్కొన్నారు. 'రికార్డుల్లో మీ పూర్తి పేరు ఇలానే ఉంది' అంటూ చెప్పగా.. 'మహిళలకు స్వతహాగా గుర్తింపు లేదా' అంటూ ఆ రోజు ఒకింత అసహనం వ్యక్తం చేశారు.

### బంగ్లా పరిణామాలపై
## ఉన్నత స్థాయి కమిటీ
### ఏర్పాటు చేసిన కేంద్రం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కల్లోలిత బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు జరుగుతుండంపై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో సరిహద్దులో నెలకొన్న పరిస్థితులను సమీక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. బంగ్లాదేశ్‌లో భారతీయులు, హిందువులు, ఇతర మైనారిటీల భద్రతను ఈ కమిటీ పర్యవేక్షించనుంది. బీఎస్ఎఫ్ తూర్పు కమాండ్ ఏడీజీ నేతృత్వంలో ఈ కమిటీ నియమించినట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. 'బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని.. భారత్ - బంగ్లాదేశ్ సరిహద్దుపై ప్రస్తుత పరిస్థితిని సమీక్షించడానికి మోదీ ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. బంగ్లాదేశ్‌లో ఉన్న భారతీయులు, హిందువులతోపాటు ఇతర మైనారిటీ వర్గాల భద్రతకు సంబంధించి అక్కడి ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేపడుతుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ తూర్పు కమాండ్ ఏడీజీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో దక్షిణ బెంగాల్, త్రిపుర విభాగాల బీఎస్ఎఫ్ ఐజీ స్థాయి అధికారులు, ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనలతో అట్టుడికిన బంగ్లాదేశ్‌లో ముహమ్మద్ యూనుస్ సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైన విషయం తెలిసిందే. ప్రధానమంత్రి హోదాకు సమానమైన ముఖ్య సలహాదారుగా వ్యవహరిస్తోన్న యూనుస్.. పౌరుల భద్రతకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందన్నారు. వారిపై దాడుల్ని ఆపడం ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. అయితే, కల్లోలిత దేశంలో హిందువులు సహా మైనారిటీ వర్గాలపై దాడులు జరుగుతుండటం భారత్ సహా పలు దేశాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

## సిరాజ్‌కు ఇంటి స్థలం
### జూబ్లీహిల్స్‌లో కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ

**హైదరాబాద్(జనంసాక్షి):** టీ20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టు సభ్యుడు, పేసర్ మహ్మద్ సిరాజ్‌కు ఇంటి స్థలం కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.జూబ్లీహిల్స్‌లో 600 చదరపు గజాల స్థలాన్ని కేటాయించింది. టీ20 ప్రపంచకప్ సాధించిన తర్వాత హైదరాబాద్ చేరుకున్న సిరాజ్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశాడు. ఆయనకు టీమ్ ఇండియా జెర్సీని కూడా బహూకరించాడు. సిరాజ్‌ను అభినందించిన సీఎం.. హైదరాబాద్‌లో ఇంట స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయిస్తూ జీవో జారీ చేసింది.

# తరలివస్తున్న పెట్టుబడులు

గర్వించదగ్గ విషయ మని అన్నారు. బయో టెక్నాలజీ రంగంలో హైదరాబాద్ ప్రాధాన్యం మరింత ఇనుమడిస్తుందని అభిప్రాయపడ్డారు.

**అడోబ్ సీఈవో శంతన్ నారాయణ్‌తో సిఎం రేవంత్ భేటి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రఖ్యాత అడోబ్ సిస్టమ్స్ సీఈవో శంతను నారాయణ్‌తో భేటీ అయ్యారు. ఫ్యూచర్ స్టేట్ తెలంగాణకు పెట్టుబడులు లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ప్రస్తుతం కాలిఫోర్నియాలోని పలువురు గ్లోబల్ బిజినెస్ లీడర్లతో సమావేశాలు, చర్చలు జరుపుతున్నారు. అడోబ్ సీఈవోతో సమావేశంలో సీఎం తోపాటు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. తెలంగాణలో ప్రజాప్రభుత్వం తలపెట్టిన హైదరాబాద్ 4.0 ఫ్యూచర్ సిటీ నిర్మాణం, యంగ్ ఇం డియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ ఏర్పాటు ప్రణాళికలపై శంతను నారాయణ్ ఆసక్తి కనబరిచారు. రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం పంచుకునేందుకు అంగీకరించారు. టెక్ విజనరీ శంతను నారాయణ్ ను కలుసుకోవటం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

### పెట్టుబడులకు ముందుకు రండి
**- ఐటీ సర్వ్ అలయన్స్ సమావేశంలో రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని ఐటీ సర్వీసెస్ కంపెనీల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఐటీ సంస్థల అసోసియేషన్ ఐటి సర్వ్ అలయన్స్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ప్రాజెక్టుల్లో ప్రవాసులు భాగస్వామ్యం పంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'ఎన్నో ఏళ్లుగా కష్టపడి చారిత్రాత్మకమైన హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లను నిర్మించుకున్నాం. ఇప్పుడు మనందరం కలిసి ప్రపంచ స్థాయి నాల్గవ నగరంగా ఫ్యూచర్ సిటీని తయారు చేసుకుంటున్నాం. హైదరాబాద్లో ఇప్పుడు మీరు పెట్టుబడి పెట్టే ప్రతి రూపాయి తప్పకుండా మీ భవిష్యత్తుకు పెట్టుబడిగా ఉపయోగపడుతుంది..' అని స్పష్టం చేశారు. ‡ూబోయే దశాబ్దంలో హైదరాబాద్‌ను పునర్నిర్మించే భారీ వ్యూహంతో తమ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ, మెట్రో విస్తరణ , మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులను చేపట్టిందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సభలో మాట్లాడారు. హైదరాబాద్ ను అర్టిఫిషియల్ ఇంటెలిజెన్సుక టెక్నాలజీ సెంటర్ గా అభివృద్ధి చెందుతుం దని, ప్రపంచ స్థాయి ప్రమాణాలున్న భవిష్యత్తు నగరంగా మారుతుందని అన్నారు.



### తెలంగాణ..ఇకపై 'ఫ్యూచర్ స్టేట్'
**- ఇదే ట్యాగ్‌లైన్‌తో పిలుద్దాం: సీఎం రేవంత్‌రెడ్డి**

తెలంగాణకు ఆహ్వానించారు. అందరం కలిసికట్టుగా సరి కొత్త భవిష్యత్తును తీర్చదిద్దుకుందామని సీఎం పిలుపు నిచ్చారు. ఈ క్రమంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి కొత్త బ్రాండ్ తీసుకొచ్చారు. ఇకపై తెలంగాణను తెలంగాణ..ది ఫ్యూచర్ స్టేట్‌గా పిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కొత్త నినాదాన్ని వీలైనంత త్వరగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇకపై రాష్ట్రానికి ఇదే ట్యాగ్‌లైన్‌గా నిలవనుందన్నారు.అమెరికాలో ఏ నగరానికి ఆనగరం ప్రత్యేకమేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమెరికా పర్యటనలో వివిధ రాష్ట్రాలకు వెళ్లినప్పుడు ప్రతి రాష్ట్రానికి దాని గుర్తింపు తెలియజేసేలా ఓ సరికొత్త ట్యాగ్‌లైన్ ఉండడాన్ని సీఎం రేవంత్ గమనించారు. అవుటాఫ్ మెనీ.. వన్ అనేది న్యూయార్క్ నినాదం కాగా... టెక్సాస్‌ను లోన్ స్టార్ స్టేట్ అని పిలుస్తారని తెలుసు కున్నారు. అలాగే కాలిఫోర్నియాకు యురేకా అనే ట్యాగ్‌లైన్ ఉండడాన్ని గమనించారు. ఇదంతా ఎందుకు అని అక్కడి వారిని సంప్రదించగా....ఇదే తమ బ్రాండ్ నినాదమని చెప్పారు. ప్రజలకు బాగా గుర్తుం డిపోవాలన్నా...నిత్యం తమలో స్ఫూర్తి నింపేలా ఆయా రాష్ట్రాలకు ట్యాగ్‌లైన్స్ పెట్టుకుంటారని తెలిసింది. అక్కడి ప్రజలకు ఎక్కువ ఆ రాష్ట్రం పేరు కన్నా...ట్యాగ్‌లైన్లే గుర్తుంటాయని చెప్పారు. దీంతో అప్పటికప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఓ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ...ది ఫ్యూచర్ స్టేట్ అంటూ నామకరణం చేశారు.ఇకపై రాష్ట్రాన్ని అందరూ ఇలాగే పిలవాలని పిలుపునిచ్చారు.

## హైదరాబాద్‌లో గ్రీన్ డేటా సెంటర్

**న్యూయార్క్(జనంసాక్షి):** ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు భారీగా స్పందన లభించింది. ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. ఇప్పటికే 11 కంపెనీలు పెట్టుబడులకు ముందుకొచ్చాయి. పలు సంస్థలు ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు, వివిధ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం పంచుకునేందుకు అంగీకరించాయి. తాజాగా ఆరమ్ ఈక్విటీ పార్ట్‌నర్స్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు ముందుకొచ్చింది. హైదరాబాద్లో 400 మిలియన్ డాలర్లు పెట్టుబడులకు సిద్ధపడింది. హైదరాబాద్‌లో నెక్ట్స్-జనరేషన్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్- పవర్డ్ గ్రీన్ డేటా సెంటర్ నిర్మించనున్నట్లు ప్రకటించింది. దశలవారీగా ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపింది. అమెరికా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో సంస్థ సీఈవో, ఛైర్మన్ వెంకట్ బుస్సా సమావేశమయ్యారు. అనంతరం తెలంగాణలో తమ విస్తరణ ప్రణాళికలతో పాటు భారీ పెట్టుబడులను కంపెనీ ప్రకటించింది. గత ఏడాది ఆరమ్ ఈక్విటీ పార్ట్‌నర్స్ దాదాపు రూ.400 కోట్ల పెట్టుబడులకు తమ వార్షిక ప్రణాళికను ప్రకటించింది. ఇప్పుడు తమ ప్రణాళికలను భారీగా విస్తరించింది. 100 మెగావాట్ల అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ను స్థాపించాలని నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఏఐ ఆధారిత గ్రీన్ డేటా సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవటం సంతోషంగా ఉందన్నారు. దీంతో భారీగా ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. అరమ్ ఈక్విటీ పార్ట్‌నర్స్ సంస్థ కొత్త డేటా సెంటర్ ఏర్పాటును మంత్రి స్వాగతించారు. ఇప్పటికే డేటా సెంటర్ హబ్‌గా ఎదుగుతున్న హైదరాబాద్ కు ఈ పెట్టుబడులు మరింత వృద్ధిని తెచ్చిపెడుతాయని అన్నారు. తమ సంస్థ నెలకొల్పే అధునాతన డేటా సెంటర్తో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య డిజిటల్ సేవల మధ్య అంతరం తగ్గుతుందని ఆరమ్ ఈక్విటీ పార్ట్‌నర్స్ సీఈవో, ఛైర్మన్ వెంకట్ బుస్సా అన్నారు.

## వాళ్ల దుస్తులు.. వాళ్ల ఇష్టం..

ఉండాలి. కాలేజీలు వారిని బలవంతం చేయకూడదు. దేశంలో అనేక మతాలు ఉన్నాయి. విద్యార్థుల పేర్లు వారి మతపరమైన గుర్తింపును బయటపెట్టట్లేదా? అలాగని ఇకనుంచి వారిని నంబర్లతో పిలుస్తారా?" అని ధర్మాసనం ప్రశ్నించింది.అయితే, తరగతి గదుల్లో ముఖం పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను అనుమతించకూడదని కోర్టు స్పష్టం చేసింది. క్యాంపస్‌లో ఎలాంటి మతపరమైన కార్యకలాపాలకు అనుమతి లేదని తెలిపింది. ఈ మధ్యంతర ఉత్తర్వులను ఎవరైనా ఉల్లంఘిస్తే.. సదరు విద్యా సంస్థ కోర్టుకు వెళ్లేందుకు స్వేచ్ఛ కల్పించింది. అనంతరం దీనిపై కాలేజీకి నోటీసులు జారీ చేసింది. నవంబరు 18లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## కవిత ఆరోగ్యం క్షీణించింది

**హైదరాబాద్(జనంసాక్షి):** ఢిల్లీ మద్యం కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియాకు బెయిల్ వచ్చిందని.. అరవింద్ కేజ్రీవాల్, కవితకు కూడా వస్తుందని భావిస్తున్నామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఛార్జ్‌షీట్ వేశాక జైల్లో ఉంచాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కవితకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశామన్నారు. త్వరలోనే బెయిల్ వస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. జైల్లో కవిత 11 కిలోల బరువు తగ్గారని.. బీపీ, ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ తెలిపారు.ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కూతురు కవిత అరెస్టయి తీహార్ జైలులో ఉన్నారు. కవితను బయటకు తీసుకొచ్చేందుకు తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఎలాంటి సానుకూల ఫలితం రాలేదు. తీహార్ జైలులో ఉన్న కవితతో మరోసారి భేటీ అయ్యారు కేటీఆర్. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చేస్తూ కవితకు వచ్చేవారం బెయిల్ వచ్చే అవకాశం ఉందన్నారు. కవిత జైల్లో చాలా ఇబ్బందులు పడుతుందన్న కేటీఆర్.... ఇప్పటికి 11 కిలోల బరువు తగ్గిందన్నారు. లిక్కర్ కేసులో అరెస్టైన అయిన బీపీతో బాధపడుతుందని... రోజుకు రెండు బీపీ టాబ్లెట్లు వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 11 వేలమంది ఖైదీల సామర్థ్యం ఉన్న జైలులో 30 వేలమంది ఖైదీలున్నారు. జైలు పరిశుభ్రంగా లేదు. జైలుకు వెళ్లి వచ్చిన వాళ్ళు భవిష్యత్‌లో పెద్ద లీడర్లు అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. దేశంలో రాజకీయకోణంలో కోట్లాదేవారికి ఇలాంటివి తప్పవు అంటూ... బెయిల్ కోసం మరోసారి అప్పీలు చేశామన్నారు.



## నీట్-పీజీ పరీక్ష వాయిదా కుదరదు

**వాయిదా పిటిషన్లను తిరస్కరించిన సుప్రీం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నీట్-పీజీ పరీక్షను వాయిదా వేసేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ పరీక్షను వాయిదా వేసి విద్యార్థుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టలేమని వ్యాఖ్యానించింది. దేశంలో వైద్య విద్య పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చేరేందుకు ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. ఈ తీర్పుతో షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 11న ఆదివారం ఈ పరీక్ష జరగనుంది. గత ఏడేళ్లుగా నీట్ పీజీ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ నిర్వహిస్తోంది. ఇప్పటివరకు పేపర్ లీకేజీ ఆరోపణలు రాలేదు. అయితే, నీట్-యూజీ 2024 పరీక్షపై దేశ వ్యాప్తంగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం కావడంతో, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నీట్ పీజీ పరీక్షను కేంద్రం వాయిదా వేసింది. దేశవ్యాప్తంగా 185 నగరాల్లో ఆగస్టు 11న కంప్యూటర్ ఆధారిత విధానంలో రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ఆధారంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

## కూర్చుని మాట్లాడుకోండి

**చర్చలకు రావాలని ఇజ్రాయెల్-హమాస్‌కు మధ్యవర్తిత్వ దేశాల పిలుపు**

**వాషింగ్టన్(జనంసాక్షి):** ఇజ్రాయెల్ - హమాస్ మధ్య పోరు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇటీవల హమాస్, హెజ్‌బొల్లా అగ్రనేతల హత్యలు మొత్తం ప్రపంచాన్నే కుదిపేశాయి.సయోధ్య కోసం ఇప్పటి వరకు ఆయా దేశాలు చేసిన యత్నాలు విఫలమయ్యాయి. దీంతో మధ్యవర్తిత్వానికి ముందుకు వచ్చిన దేశాలకు ఈ వ్యవహారం పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా ఆయా దేశాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. కాల్పుల విరమణ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేకపోవడంపై అసహనం ప్రదర్శించాయి. పైగా చర్చలకు రాకపోవడంపై ఇరు పక్షాలను హెచ్చ రించాయి. ఈసారి ఎలాంటి సాకులు చెప్పకుండా చర్చలకు రావాలని తేల్చి చెప్పాయి.అమెరికా, ఈజిప్టు, ఖతార్ చేసిన విజ్ఞప్తిని ఇజ్రాయెల్ అంగీకరించినట్లు ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం వెల్లడించింది. మధ్యవర్తిత్వ దేశాలు కోరినట్లుగా ఆగస్టు రెండో వారంలో చర్చలకు వస్తామని తెలిపారు. గాజాలో కాల్పుల విరమణ, హమాస్ చెరలోని బందీల విడుదల తప్ప మరే అంశాలు చర్చల్లో ఉండొద్దని మధ్యవర్తిత్వ దేశాలు ఇరు పక్షాలకు సూచించాయి. ఆగస్టు 15న కైరో, ఖతార్, దోహా నగరాల్లో ఎక్కడో ఒక చోట చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు నాలుగైదు అంశాల్లో ఇరు పక్షాల మధ్య సయోధ్య కుదరడం లేదని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న అధికారి వెల్లడించారు.

# సుంకిశాలపై పూర్తిస్థాయి విచారణ

కూడా పూర్తి చేస్తామన్నారు. బీఆర్ఎస్ ఎందుకు తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారో అర్థం కావడం లేద న్నారు. సుంకిశాల ప్రాజెక్టు కూలడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతే కారణం అని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఆరోపిం చారు. సుంకిశాలలో నిర్మించిన ప్రాజెక్టు కూలిన ప్రాంతాన్ని పరి శీలించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లా డుతూ.. గత ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించిందన్నారు. ప్రాజెక్టు కూలిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామ న్నారు. జరిగిన నష్టాన్ని నిర్మాణ సంస్థే భరిస్తుందన్నారు. ఘట నపై విచారం వ్యక్తం చేస్తున్నామని.. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పనులు పూర్తి చేయాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. సుంకిశాల పంప్ హౌస్ ను ఎందుకు ప్రారంభించారో కేసీఆర్, కేటీఆర్‌కే తెలియాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలియాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. జంట నగరాలకు తాగునీరు అందించేందుకు సుంకిశాల అవసరం లేదని అన్నారు. ఇది కేసీఆర్ మానస పుత్రికనో లేక కేటీఆర్



మానస పుత్రికనో అర్థం కావడం లేదని విమర్శించారు. కేటీఆర్ రాజకీయ విమర్శలు చేయడం సరికాదని.. కాంగ్రెస్ పార్టీ పై విమర్శలు చేయడం సరికాదని గుత్తా పేర్కొన్నారు. గోదావరి నదిపై ప్రాజెక్టుల నిర్మాణం జరిగినంత వేగంగా కృష్ణా నది ప్రాజెక్టుల పనులు జరగడం లేదని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.

## మీదే బాధ్యత

పునరుజ్జీవం తెచ్చిందే భారాస ప్రభుత్వమని పేర్కొన్నారు. నాగార్జునసాగర్‌లో డెడ్‌స్టోరేజ్ ఉన్నా హైదరాబాద్‌కు నీటి కొరత రాకూడదనే ఈ ప్రాజెక్టు చేపట్టామన్నారు. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు సాగు, తాగునీటి కోసం ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. కృష్ణా నదికి నాలుగేళ్లు నీరు రాకపోయినా సుంకిశాల ప్రాజెక్టుతో నీటి ఇబ్బందులు రావు. బెంగళూరు, ఢిల్లీ, చెన్నైలో నీటి ట్యాంకర్ల కోసం ప్రజలు పోరాడుతున్నారు. హైదరాబాద్‌లో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి లేదు. నగరంలో 50 ఏళ్ల తాగునీటి అవసరాలకు సరిపడేలా ప్రణాళికలు చేశాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సుంకిశాల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల హైదరాబాద్‌కు తీరని నష్టం. సుంకిశాల ప్రమాదం జరిగినప్పుడు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ ఘటన గురించి సభలో ఎందుకు ప్రకటన చేయలేదని అన్నారు. కావాలనే దీనిని దాచి పెట్టారని మండిపడ్డారు. విపత్తు జరిగిన విషయం ప్రభుత్వానికి తెలియదా? తెలిసి కూడా నొక్కి పెట్టారా? వద్దని వారించినా ఒత్తిడితో గేట్లు బిగించారని ఇంజినీర్లు చెబుతున్నారు. హడావుడి పనులతోనే సుంకిశాల ప్రమాదం జరిగింది. ఇంజినీర్ల పర్యవేక్షణ, పురపాలక శాఖ అజమాయిషీ లేకుండా పనులు చేపట్టారు. సుంకిశాల ఘటనకు ముఖ్యమంత్రిదే బాధ్యత అని ఆరోపించారు. మంచి అయితే వారి ఖాతా, చెడు అయితే మా ఖాతాలో వేస్తున్నారు. కాంగ్రెస్ నేతలకు పాలన చేతకాదు. సుంకిశాలను భారాస బృందం సందర్శిస్తుంది. విశ్రాంత ఇంజినీర్లను కూడా సుంకిశాలకు తీసుకెళ్తాం. కాంగ్రెస్ నేతల చిల్లర ప్రచారానికి ప్రకృతే సమాధానం చెబుతుందని కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్ నగర త్రాగునీటి అవసరాల కోసం సుంకిశాల ప్రాజెక్టును నిర్మించారని తెలిపారు. నల్గొండ రైతులు సాగునీటి అవసరాలు తీరకుండా హైదరాబాద్ నగరానికి సుంకిశాల నీళ్లను ఎట్లా తీసుకువెళ్తారని ఆందోళన చేశారన్నారు. రైతులను ఒప్పించి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 90 మిలియన్ గ్యాలన్ల నీళ్లను సుంకిశాల నుంచి నీళ్లను హైదరాబాద్ నగరానికి ఇచ్చారని గుర్తుచేశారు. వైఎస్ హయాంలో 108 మిలియన్ గ్యాలన్ల నీటిని హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల కోసం ఇచ్చారన్నారు. కేసీఆర్ వచ్చాక కాళేశ్వరం, సీతారామ లాంటి ప్రాజెక్టులు కట్టి రైతుల్లో సాగునీటికి ఢోకా లేకుండా చేశారని తెలిపారు. కేసీఆర్ సుంకిశాల విషయంలో నాగార్జున సాగర్‌లో డెడ్ స్టోరేజీ ఉన్నా హైదరాబాద్ నగరానికి త్రాగు నీళ్లను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. తాము సుంకిశాలకు వెళ్లి నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రజల త్రాగునీటి అవసరాలు తీర్చడానికి శంకుస్థాపన చేశామని చెప్పారు. సుంకిశాల నుంచి మూడు పైప్ లైన్ల ద్వారా నీళ్లను ఎత్తిపోసి హైదరాబాద్ నగరానికి నీళ్లను తీసుకువచ్చామన్నారు. ఎల్లంపల్లి నుంచి గోదావరి నీళ్ళు, సుంకిశాల నుంచి క్రిష్ణా నీళ్లు, మల్లన్న సాగర్ నుంచి నీళ్లను హైదరాబాద్ నగరానికి తేవడమే లక్ష్యంగా కేసీఆర్ పని చేశారని చెప్పుకొచ్చారు. ఢిల్లీలో నీటి కోసం యుద్ధాలను చూస్తున్నామని... కానీ హైదరాబాద్ నగరానికి అలాంటి పరిస్థితి రాలేదన్నారు. చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డితో పాటు కేసీఆర్ హైదరాబాద్ నగరానికి నీళ్లను తేవడంలో కృషి చేశారన్నారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. సీతారామను కాంగ్రెస్ ప్రభుత్వం కట్టినట్లు భట్టి విక్రమార్క గొప్పలు చెప్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం దిగిపోయాక ప్రభుత్వం సుంకిశాలను పట్టించుకోలేదని... అయితే హైదరాబాద్ నగరంలో త్రాగునీటికి ఇబ్బందులు వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వానికి సుంకిశాల గుర్తుకు వచ్చిందన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ శాఖ పాలన పడకేసిందన్నారు. సుంకిశాల రిటైనింగ్ గోడ కూలిన రోజు ఆగస్టు 2న అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని.. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం స్టేట్మెంట్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం దృష్టికి ఈ విషయం వచ్చిందా? లేదా? అనేది స్పష్టం చేయాలని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి రాకపోతే అంతకంటే సిగ్గుచేటు లేదని విమర్శించారు. ప్రభుత్వానికి తెలిసినా వారం రోజులు దాచిపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హడావిడిగా ప్రభుత్వం గేట్లు అమర్చడం వలన ప్రమాదం జరిగిందన్నారు. కూలీలు షిఫ్ట్ మారే సమయంలో రిటైనింగ్ వా ల్ కూలడంతో ప్రమాదం తప్పిందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖను తన వద్ద పెట్టుకుని పాలన గాలికి వదిలేశారని వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు మేడిగడ్డలో ప్రమాదం జరిగితే.. ప్రభుత్వం వెంటనే స్పందించిందన్నారు. ఆ సమయంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది కాబట్టి అధికారులు, ఏజెన్సీ వెంటనే స్పందించారని తెలిపారు. సుంకిశాల ప్రమాదం జరిగినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో ఉన్నారన్నారు. ప్రభుత్వం ఏ ఏజెన్సీకి అయితే సుంకిశాల ప్రాజెక్టు అప్పగించిందో ఆ ఏజెన్సీని వెంటనే బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డికి ఇప్పటి వరకు తెలియకపోతే పరిపాలన మీద పట్టు ఉన్నట్లా...? అని నిలదీశారు. బిఆర్ఎస్ పార్టీపైన చిల్లర దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మంచి జరిగితే వాళ్ళ ఖాతాలో చెడు జరిగితే బీఆర్ఎస్ ఖాతాలో వేసే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని విమర్శలు గుప్పించారు. ఏజెన్సీని బ్లాక్ లిస్ట్‌లో పెడుతున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డలో ప్రమాదం జరిగితే వెంటనే ఎన్.డి.ఎస్.ఏ వస్తుంది. మరి సుంకిశాలకు ఎందుకు ఎన్.డి.ఎస్.ఏ రాదా అన్నారు. బీజేపీ,కాంగ్రెస్ ఒక్కటే అని తాము అనకూడదా...? సుంకిశాల ప్రమాదంపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని అంటూ ప్రశ్నలు సంధించారు. భట్టి విక్రమార్క ఆలోచనా విధానం లోపభూయిష్టంగా ఉందన్నారు. సుంకిశాల ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందో ప్రభుత్వానికి తెలుసా అని అడిగారు. నిన్న హైదరాబాద్ నగరంలో మర్డర్ జరిగిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయన్నారు.

# మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

- వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి





**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 9(జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణ వాతావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వరంగల్ మహా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వన మహోత్సవంలో జిడబ్ల్యూఎంసి పరిధిలోని 15వ డివిజన్ రెడ్డిపాలెం రుద్రమదేవి కూడలి వద్ద సెంట్రల్ మీడియాలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూఎంసి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అటవీ శాఖ అధికారి అనూజ్ అగర్వాల్, ప్రజాప్రతినిధులు, ప్రజలు మహిళలు విద్యార్థులతో కలిసి మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిలు సామూహిక మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవు తుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకొని భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలన్నారు. వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు విరివిగా చెట్లను పెంచాలని అన్నారు. వరంగల్ మహా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ పరిధిలో 11 లక్షల మొక్కలు నాటేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని, ఈరోజు ఆరు ప్రదేశాలలో సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన్నట్లు తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా అలవాటు చేసుకుని ఇండ్లను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమల నివారణతో పాటుగా ఆరోగ్యవంతంగా ఉండాలని కోరారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ కూడా తప్పనిసరిగా కోవాలన్నారు. మొక్కలు కాపాడే బాధ్యత కేవలం అధికారులదే కాదని ప్రతి ఒక్కరూ తప్పనిసరి విధులలో మొక్కలు కాపాడడం కూడా ఒక భాగమని పేర్కొన్నారు. ఎక్కువ మొక్కలు ఉన్నచోట సమృద్ధిగా వర్షాపాత నమోదు అవుతుందని, వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందని, అన్నారు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటానికి ప్రధాన కారణం పచ్చదనమే అని, దానితోపాటు నివసించే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలు ఎలాంటి అనారోగ్యాలకు గురికారని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మనోహర్, బల్దియా హార్టికల్చర్ ఆఫీసర్ రమేష్, సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, సిటీ ప్లానర్ శైలజా, అదనపు కమిషనర్ కృష్ణారెడ్డి, జిల్లా విద్య శాఖ అధికారి వాసంతి, స్థానిక ప్రజా ప్రతినిధులు, మెప్మా సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, ప్రజలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 40 శాతం వాటా బోనస్ ఇవ్వండి!

(ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి )



సింగరేణి పరిశ్రమ సాధించిన వాస్తవ లాభాలపైన లాభాల వాటా 40% జాప్యం లేకుండా చెల్లించాలని డైరెక్టర్ (పా), ఎన్.వి.కే శ్రీనివాసు ని కలిసి బిఎమ్మెస్ నాయకులు యాదగిరి సత్తయ్య అధ్యక్షులు, యతిపతి సారంగపాణి ప్రధాన కార్యదర్శిలు శుక్రవారం కోరారు. సంస్థపరంగా 2023-2024 ఆర్థిక సంవత్సరం ముగిసి నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు ప్రకటించని లాభాల వాటా,జాప్యం లేకుండా వెంటనే ప్రకటించాలని సంస్థ డైరెక్టర్ (పా) కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో కలిసి చర్చించడం జరిగినది, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 67.13 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేస్తే 33 వేల కోట్ల బిజినెస్ జరిగి 2222 కోట్ల లాభాలు వచ్చాయని దానిలో 32% అంటే 711.18 కోట్ల రూపాయలను గత సంవత్సరం చెల్లించడం జరిగిందని.ఈ ఆర్థిక సంవత్సరం కార్మికులు కష్టపడి రికార్డ్ స్థాయిలో 70.12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించారని,రూ 37వేల కోట్ల వ్యాపారం జరిగిందని,గత సంవత్సరం పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రికార్డ్ స్థాయిలో ఉత్పత్తి సాధించిన కార్మికుల కోసం ఈ సారి లాభాల వాటా 40% ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఈ ఆగస్టు మాసంలో చెల్లించుటకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినారు పాల్గొన్న ఏరియా ఉపాధ్యక్షులు మొగిలిపాక రవి, తాండ్ర మొగిలి, బండారి శ్రీనివాస్, గోగుల రవి తదితరులు పాల్గొన్నారు. విషయం ను

డొనికెల రమేష్, గుర్రం ప్రదీప్ కుమార్, ఏరియా ఉపాధ్యక్షులు కార్యదర్శి సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ మందమర్రి ఏరియా నాయకులు పాత్రికేయులకు తెలిపారు.

**గతంలో ఇచ్చిన లాభాల వాటా**

| సంవత్సరం | వాటా శాతం |
|---|---|
| 2015-2016 | 23% |
| 2016-2017 | 25% |
| 2017-2018 | 27% |
| 2018-2019 | 28% |
| 2019-2020 | 28% |
| 2020-2021 | 29% |
| 2021-2022 | 30% |
| 2022-2023 | 32% |

# జీవో నెం 33ని ఉపసంహరించాలి

- స్థానికుల హక్కులు కాపాడాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

**హైదరాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** జీవో నెం.33ని ఉపసంహరించాలని, స్థానికుల హక్కులు కల్పించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ సవరణ ప్రకారం తెలంగాణ బిడ్డలనే స్థానికేతరులుగా పరిగణించే ప్రమాదం ఉన్నది. స్థానికతకు సంబంధించిన ఆదేశాలు స్థానికుల హక్కులు పరిరక్షించేవిగా ఉండాలి తప్ప స్థానికులకే నష్టం చేయకూడదు. జీవో నెం.33 ఫలితంగా స్థానికులు నష్టపోతున్నారని, ప్రస్తుతం వైద్య విద్యకు పరిమితం చేసినా తర్వాత కాలంలో అన్ని రంగాలకూ ఇవే నిబంధనలు వర్తింపజేయనున్నారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అమలులోకి వచ్చిన జీవో నెం 114 (తేది 5.7.2017)లో పొందుపరిచిన నిబంధనలను పునరుద్ధరిస్తూ తక్షణం ఆదేశాలు జారీ చేయాలని, వైద్య రంగంతో పాటు అన్ని రంగాలకూ అది వర్తించేవిధంగా ఉండాలని కోరారు.

# నాగుల పంచమి వేడుకల్లో పాల్గొన్న ఉప్పల



**హైదరాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** పెద్ద అంబర్ పేట లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త గోదాంలో వున్న పుట్ట వద్ద నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది అని రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. పరమేశ్వరుని మెడలో పాముని ధరించి తిరుగుతాడు అని శ్రీ మహా విష్ణువు శేషనాగుపై నిద్రిస్తారు. అందుకే నాగదేవత(పాము)లకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. స్కంద పురాణంలో నాగ పంచమి ప్రాధాన్యత గురించి సాక్షాత్తు ఆ పరమేశ్వరుడు వివరించినట్లు శాస్త్రాల ద్వారా తెలుస్తోంది. అందుకే పాములను పరమేశ్వరుని అంశంగా భావించి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. మరీ ముఖ్యంగా నాగపంచమి, నాగుల చవితి వంటి ప్రత్యేకమైన రోజుల్లో లేదా ఏదైనా శుభకార్యాలు నిర్వహించేటప్పుడు పుట్టకు వెళ్లి ప్రత్యేకమైన పూజలను చేస్తారు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న మరియు ఉప్పల సాయి కిరణ్ ఉప్పల సాయి తేజ, ఉప్పల శ్రీనివాస్ బంధువులు, ఉప్పలగోదాం వర్కర్స్ పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో దొంగల బీభత్సం

- 12 తులాల బంగారం, 16 తులాల వెండి చోరీ..
- రూ. 40 వేల నగదు కూడా అపహరణ..
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు..



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఇంట్లో ఎవరులేని సమయంలో ఇంట్లో చొరబడి బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. భూపాలపల్లి పట్టణంలోని బీసీకాలనీ వెంగళరావు వెంచర్ లో గురువారం బొమ్మకంటి పవన్ కుమార్ ఇంట్లో ఎవరు లేకపోవడంతో దొంగలు చొరబడి 12 తులాల బంగారం, 16 తులాల వెండి, రూ. 40 వేలు ఎత్తుకెళ్లారు. బాధితుడు శుక్రవారం చిందరవందరగా ఉన్న వస్తువులు చూసి ఖంగుతిన్నాడు. దొంగలు పడ్డారని గ్రహించి, ఇంట్లో వస్తువులన్నీ చెక్ చేయగా, బంగారం, వెండి, నగదు చోరీకి గురైందని గుర్తించాడు. ఈ మేరకు పోలీసులకు బాధితుడు పవన్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ముందుగా డయల్ 100కి సమాచారం ఇవ్వగా, క్లూస్ టీం, స్థానిక పోలీసులు ఘటనస్థలికి చేరుకుని దొంగతనంపై ఆరా తీస్తున్నారు.

# గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు యువకులు అరెస్టు



**కాటారం ఆగస్టు 9(జనంసాక్షి) :** గంజాయిని సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కాటారం ఎస్ ఐ అభినవ్ తెలిపారు. కాటారం పోలీస్ లకు వచ్చిన సమాచారం మేరకు కొందరు వ్యక్తులు అక్రమంగా నిషేధిత గంజాయి రవాణా చేస్తున్నట్టు సమాచారం అందడంతో కాటారం ఎస్ ఐ అభినవ్ చింతకాని క్రాస్ వద్ద సిబ్బందితో కలిసి మాట వేసి పట్టుకున్నట్లు ఎస్ఐ వివరించారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన బొంతల రమేష్, ద్విచక్ర వాహనంపై తెస్తున్న గంజాయిని భూపాలపల్లి కి చెందిన సాదు వినయ్, మలహర్ మండలం కొయ్యూరు కు చెందిన లకావత్ రాహుల్, కాటారం చెందిన జాడి గణేష్ లకు గంజాయిని అమ్ముతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల దగ్గర నుండి 1.4 కేజీల నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సదరు గంజాయిని మహారాష్ట్ర లోని గుర్తు తెలియని వ్యక్తి దగ్గర 28 వేలు చెల్లించి కొనుగోలు చేసినట్లు బొంతల రమేష్ ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుల నుండి రెండు బైకులు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ ఐ తెలిపారు. అనంతరం పైన తెలిపిన వారిని కస్టడీ లోకి తీసుకొని చట్ట ప్రకారం వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించడం జరిగింది . ఇట్టి కార్యక్రమం లో కాటారం కానిస్టేబుల్స్ హరి కుమార్,జంపన్న,సాంబశివరావు, శ్రీనివాస్, రఘు,లవన్, లక్మీరాజ్, హొంగార్డు తిరుపతి పాల్గొన్నారు. యువత గంజాయి భారిన పడి తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఐ సూచించారు. గంజాయి రవాణా, విక్రయాలపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుంది అని, స్మగ్లింగ్ చేస్తే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.. తల్లి దండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని వారి నడవడికపై దృష్టి పెట్టాలని ఎస్ఐ కోరారు. యువత సన్మార్గంలో వెళ్ళాలి అని గొడవల జోలికి వెళ్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని కేసుల పాలవుతే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఎస్ఐ తెలిపారు.

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాది, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హామీద్ షేక్




**హైదరాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** సేవా దృక్పథంతో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాది, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హామీద్ షేక్ కోరారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ (టీహెచ్ సీఏఏ) , గ్లెన్ ఫీల్డ్ మల్లారెడ్డి బ్రెయిన్ హార్ట్ హాస్పిటల్ - హైదారాబాద్ వారు సంయుక్తంగా హైకోరు ప్రాంగణంలో మెగా హెల్త్ క్యాంపు ను నిర్వహించారు. ఈ క్యాంపు లో హామీద్ షేక్ పాల్గొని మాట్లాడారు. న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అహర్నిశలు ఆలోచిస్తోందని, ఆ దిశగా కృషి చేస్తోందని కితాబిచ్చారు. నిత్యం పని ఒత్తిడిలోనే నిమగ్నమయ్యే న్యాయవాదులంతా వారి యొక్క ఆరోగ్య సంరక్షణపై ప్రతేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆహార నియమాలను తూచా తప్పకుండా పాటించడంతో పాటుగా కొంతసమయాన్ని వ్యాయామం కోసం కేటాయించాలని కోరారు. తెలంగాణ హైకోర్టులో ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన మెడికల్ ఫీల్డ్ మల్లారెడ్డి బ్రెయిన్ హార్ట్ హాస్పిటల్ యాజమాన్యానికి, హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసిన టీహెచ్ సీఏఏ అధ్యక్షుడు ఏ.రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు దీప్తి, కార్యదర్శులు శాంతి భూషణ్ రావు, సంజీవ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి నవీన్ కుమార్ రెడ్డి, కోశాధికారి కట్టా శ్రావ్య, ఇతర సభ్యులకు హామీద్ షేక్ ధన్యవాదములు తెలిపారు

### కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాడుదాం!

- కార్పొరేట్ లూటర్స్ క్విట్ ఇండియా కార్యక్రమంలో నాయకుల పిలుపు



**హైదరాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఐక్యంగా పోరాడుదామని కార్పొరేట్ లూటర్స్ క్విట్ ఇండియా కార్యక్రమంలో రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జాతీయ పిలుపులో భాగంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని నారాయణగూడ చౌరస్తాలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్న కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని ఉపాధిహామీ పథకానికి నిధులు పెంచాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని, ఎరువుల సబ్సిడీకి కోతలు నివారించి నిధులు పెంచాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26000లు నిర్ణయించాలని, కార్పొరేట్ విత్తన కంపెనీలకు ప్రభుత్వ నిధులు కేటాయించొద్దని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, పశ్య పద్మ, బి. రాము, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, ఆర్. వెంకట్రాములు, ప్రసాదన్న, శంకర్‌లు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విదేశీ కార్పొరేట్ సంస్థలకు 5% పన్ను రాయితీ ఇచ్చిందని, భడా కార్పొరేట్ కంపెనీలకు విత్తన పరిశోధన సంస్థ నుండి నిధులు కేటాయించేందుకు సిద్ధపడ్డారని అందులో భాగంగానే అమెజాన్, సిన్‌జెంటా, బేయర్ లాంటి కంపెనీలకు కేంద్ర వ్యవసాయ పరిశోధన సంస్థ ద్వారా నిధులు ఇచ్చేందుకు సిద్ధపడ్డారని అన్నారు. రైతు సంఘాలతో మాట్లాడకుండా విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టను అని హామీ ఇచ్చి ఇప్పుడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందని అన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధుల్లో కోత పెట్టిందని, ఎరువుల సబ్సిడీకి కూడా కోత పెట్టిందని అన్నారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన పోరాటం ఫలితంగా ఆయా రాష్ట్రాల్లో బిజెపికి గుణపాఠం చెప్పినా కూడా పాఠాలు నేర్చుకోవడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని తెలియజేశారు.

# ఆదివాసీ హక్కుల సంరక్షణకు సమరం చేద్దాం

- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం భారీ ర్యాలీ




**ఏటూరునాగారం, ఆగస్టు 09(జనంసాక్షి) :** పోడు భూములకు పట్టాలు, ఆదివాసీ హక్కులు సంరక్షణ కోసం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం స్ఫూర్తి తో ఆదివాసీలు సమరం సాగించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవి కుమార్, గొంది రాజేష్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకొని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఏటూరునాగారం బస్టాండ్ నుండి ఐ టి డి ఏ వరకు గిరిజన సంప్రదాయ డోలీ, నృత్యాలతో, లక్ష్మి దేవర డప్పు చప్పుళ్లతో కొలహాలంగా ర్యాలీ చేయడం జరిగింది. ఐటిడిఏ ఆవరణలో కొమురం భీం విగ్రహానికి నాయకులు పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దుగ్గి చిరంజీవి అధ్యక్షతన జరిగిన సభలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవి కుమార్, గిరిజన సంఘం జిల్లా గొంది రాజేష్ మాట్లాడుతు జిల్లాలో సాగులో ఉన్న ప్రతి ఎకరానికి అప్పు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వలస ఆదివాసి గుడాల ప్రజలను గిరిజనులుగా గుర్తించి గిరిజన కుల సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పరంగా గిరిజన గూడాలను అభివృద్ధి చేయాలని అన్నారు. వలస ఆదివాసి గుడాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. గిరిజన గూడాలలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి హెల్త్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాలు అన్నింటికీ రోడ్లు కరెంటు సౌకర్యం కల్పించాలని అన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో జీవో 3 ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖలలోని ఉద్యోగాలన్నింటినీ స్థానిక గిరిజన అభ్యర్థులతో నింపవలసి ఉన్నది అన్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించిపోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి టూరిజం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పాటించాలి. నేడు జరుగుతున్న ఉత్సవాలు పాలకవర్గాల అవసరాల కోసమే తప్ప ఆదివాసీలను కాపాడడానికి కాదు. నిజమైన ఆదివాసీ దినోత్సవం, ఆదివాసుల 'అవసరాలు-ఆకాంక్షలు' నెరవేర్చేదిగా ఉండాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జేజేర్ దామోదర్, తోలేం కిష్టయ్య, చిరంజీవి, వంక రాములు, కృష్ణ బాబు, సౌమ్య, శాంత కుమారి, ప్రవీణ్, కమల, వీరబాబు,రాజు, భద్రయ్య, సచిన్, దేవా, లోకేష్, నాగరాజు తదితరులు 700 మంది గిరిజనులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
10 ఆగస్టు 2024

# జీవ ఇంధనాల ఉత్పత్తిపై దృష్టిపెడితే అద్భుతాలే..



సాంప్రదాయ శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా సంప్రదాయేతర ఇంధన వనరుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టు 10న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ జీవఇంధన దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం 2023 డీజిల్ ఇంజిన్ సృష్టికర్త సర్ రుడాల్ఫ్ డీజిల్ గౌరవార్థం జరుపుతారు. జీవ ఇంధనం అనేది వాహనాలు, విద్యుత్తు, పరిశ్రమలకు శక్తినివ్వడానికి ఉపయోగపడే పునరుత్పాదక శక్తి వనరు. జీవ ఇంధనాలు మొక్కలు, జంతు కొవ్వులు, కూరగాయల నూనెలు వంటి జీవ మూలాల నుండి తయారవుతాయి. ఇప్పటికే కొన్ని కార్లు, ట్రక్కులు ఈ పునరుత్పాదక ఇంధనాన్ని ఉపయోగించి నడుస్తున్నాయి.

బయోడీజిల్ అనేది కూరగాయల నూనెలు, జంతువుల కొవ్వుల వంటి జీవసంబంధ మూలాల నుండి ఉత్పత్తి చేయబడిన పునరుత్పాద స్థిరమైన ఇంధనం. పునరుత్పాదక డీజిల్ సాధారణ వంట నూనె నుండి వచ్చే ఈ జీవ ఇంధనాన్ని సాంప్రదాయ ఇంధనానికి బదులుగా ఉపయోగించవచ్చు. బయోగ్యాస్ వ్యవసాయ వ్యర్థాలు, పేడ, ఆహార వ్యర్థాలు, మురుగు వంటి సేంద్రియ పదార్థాల వాయురహిత కుళ్ళిపోవడం ద్వారా ఏర్పడే పునరుత్పాదక వాయువు. బయోఇథనాల్ మొక్కజొన్న, చెరకు, చక్కెర దుంపలు లాంటి పిండి పదార్థాలు అధికంగా ఉండే పదార్థాల కిణ్వ ప్రక్రియ ద్వారా పొందిన జీవ ఇంధనం. బయోబ్యుటనాల్ పంటలు, వ్యవసాయ వ్యర్థాలు, అటవీ వ్యర్థాలు వంటి సేంద్రీయ పదార్థాల కిణ్వ ప్రక్రియ ద్వారా వచ్చే ఒక రకమైన జీవ ఇంధనం. ఇది ఇతర జీవ ఇంధనాలతో పోలిస్తే దీని అధిక శక్తి సాంద్రత కారణంగా సులభంగా నిల్వకు రవాణాకు అనుకూలంగా ఉంటుంది.

భారతదేశంలో శిలాజ ఇంధనాలతో పోలిస్తే తక్కువ ధర కారణంగా జీవ ఇంధనాల వినియోగం సంవత్సరాలుగా క్రమంగా పెరుగుతోంది. రవాణా, వ్యవసాయం విద్యుత్ ఉత్పత్తి వంటి వివిధ పరిశ్రమలు రంగాలలో జీవ ఇంధనాల వినియోగాన్ని ప్రభుత్వం చాలా కాలంగా ప్రోత్సహిస్తోంది. ప్రస్తుత పురోగతి ఆధారంగా 2025 సంవత్సరం నాటికి 20 శాతం బ్లెండింగ్ లక్ష్యం పూర్తవుతుంది. మే 2024లో దేశం 15 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని విజయవంతంగా సాధించింది. 2025 నాటికి 20 శాతం లక్ష్యాన్ని చేరుకునే దిశగా పయనిస్తుంది. బయో ఫ్యూయల్ ఇంటిగ్రేషన్‌తో పాటు, కార్బన్ ఉద్గారాలను తగ్గించే భారతదేశ వ్యూహంలో భాగంగా గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను ప్రారంభించబడింది. మొదటి గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ (10 మెగావాట్లు) 27 మే 2024న ప్రారంభించబడింది. 2018 లో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామిన్ పథకం కింద గోబార్ (గాల్వనైజింగ్ ఆర్గానిక్ బయో-అగ్రో రిసోర్సెస్) పథకం ప్రారంభించబడింది. ఉపయోగించిన వంట నూనెను సేకరించి బయోడీజిల్‌గా మార్చే పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి భారత ఆహార భద్రత మరియు ప్రమాణాల అథారిటీ ద్వారా రీపర్పస్ యూజ్డ్ కుకింగ్ ఆయిల్ కార్యక్రమం ప్రారంభించబడింది. బయోఇథనాల్‌ను ఉత్పత్తి చేయడానికి మిగులు ఆహార ధాన్యాలు మరియు బయోమాస్‌ను ఉపయోగించుకోవడానికి కూడా ప్రభుత్వం అనుమతించింది. 2013-14 ఇథనాల్ సరఫరా సంవత్సరంలో భారతదేశం యొక్క ఇథనాల్ సామర్థ్యం 1.53% నుండి 2020-21లో 7.93%కి పెరిగినట్లు నివేదించబడింది. 2013-14లో 38 కోట్ల లీటర్లు ఉన్న ఇథనాల్ సరఫరా 2020-21లో 322 కోట్ల లీటర్లకు పెరిగింది. డిమాండ్ పెరుగుదల కారణంగా, ఇథనాల్ స్వేదనం సామర్థ్యం కూడా 215 కోట్ల లీటర్ల నుండి ఏటా 427 కోట్ల లీటర్లకు రెట్టింపు అయింది. 2014-15లో 157 ఉన్న డిస్టిలరీల సంఖ్య 5 సంవత్సరాలలో 40% పెరిగి 2019-20లో 231కి చేరుకుంది. దేశంలో బయో-డీజిల్ మిశ్రమం 2001లో పైలట్ ప్రాతిపదికన ప్రారంభమైంది. ప్రభుత్వం జూన్ 2018లో జీవ ఇంధనాలపై జాతీయ విధానాన్ని ఆమోదించింది. ఈ పాలసీ లక్ష్యం 2030 నాటికి 20% ఇథనాల్ బ్లెండింగ్ 5% బయోడీజిల్ బ్లెండింగ్‌కు చేరుకోవాలని లక్ష్యంగా మన దేశం పెట్టుకుంది.

జనంసాక్షి

ఇతర విషయాలతోపాటు, ఈ విధానం ఇథనాల్ కోసం ఫీడ్‌స్టాక్ పరిధిని విస్తరిస్తుంది. ఉత్పత్తితోపాటు అధునాతన జీవ ఇంధనాల ఉత్పత్తికి ప్రోత్సాహకాలను అందించింది. జీవ ఇంధనాల రంగం పురోగతి కారణంగా ఈ విధానం మే 2022లో సవరించబడింది.

గ్లోబల్ వార్మింగ్‌కు గణనీయంగా దోహదపడే బొగ్గు వంటి శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. సాంప్రదాయ శిలాజ ఇంధనాలతో పోలిస్తే ఇవి తక్కువ కార్బన్ మోనాక్సైడ్, విషపూరిత ఉద్గారాలను విడుదల చేయడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడమేగాక ముడి చమురుపై దిగుమతి ఆధారపడటాన్ని తగ్గిస్తాయి. జీవ ఇంధనం పర్యావరణానికి అనుకూలమైనది. ఇవి ప్రస్తుతం వాడుతున్న ఇందనాల కంటే 86 శాతం వరకు తక్కువ గ్రీన్ హౌస్ వాయువులను 47 శాతం తక్కువ రేణువులను ఉత్పత్తి చేస్తాయి. ప్రస్తుతం ప్రపంచ రవాణాలో వీటి వాటా మూడు శాతంగా ఉంది. 2050 సంవత్సరం నాటికి వీటి వాటా 25 శాతంగా ఉండాలని పారిస్ లో ఉన్న అంతర్జాతీయ ఇంధన సంస్థ అన్ని దేశాలకు సూచించింది. శిలాజ ఇంధనాల మాదిరిగా కాకుండా జీవ ఇంధనాలు నిరంతరం ఉత్పత్తి చేయబడతాయి. శిలాజ ఇంధనాలతో పోలిస్తే ఇవి తక్కువ గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేస్తాయి. జీవ ఇంధనాల ఉత్పత్తి, వినియోగం వ్యవసాయం, ఇంజనీరింగ్ రవాణాతో సహ వివిధ పరిశ్రమలలో కొత్త ఉద్యోగాలను సృష్టించగలదు. ఇది సానుకూల ఆర్థిక ప్రయోజనాలను కలిగి ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.

(ఆగస్టు 10న ప్రపంచ జీవఇంధన దినోత్సవం)



డీజే మోహన్‌రావు
అధ్యాపకులు, శ్రీకాకుళం
8247045230

# బీజేపీలో బిఆర్ఎస్ విలీనం అబద్ధమే!

**బిఆర్ఎస్ ఒకప్పటి టీఆర్ఎస్ బీజేపీ లో విలీనం అనే ప్రచారం పక్కాగా అబద్ధమే! ప్రతి పాదనలు ఉండవచ్చు! కాని ఇది అబద్ధపు, బీజేపీ అనుకూల, మేలు చేసే గ్లోబల్స్ ప్రచారంగా కనిపిస్తున్నది. కేసీఆర్ బిడ్డ ఎమ్మెల్సీ కే.కవిత ను జైలు నుంచి విడిపించడం కోసం ఉద్యమ పార్టీ అయిన బిఆర్ఎస్ ను విలీనం చేస్తారు అనడం, అలా ఊహించడమే తప్పు అనిపిస్తుంది. ప్రతీ విషయం లో లేదు, లేదు, కాదు, కాదు అనుకుంటూనే అవును అనే బీజేపీ కి బిఆర్ఎస్ ను విలీనం చేసుకుంటే ఒనగూరె లాభం ఏమి ఉండదు. బీజేపీ కన్నా బిఆర్ఎస్ కు, దాని అధినేత మాజీ సీఎం కేసీఆర్ కె ఎక్కువ నష్టం ఉంటుంది.అంతా అడ్డిమార్ గుడ్డి దెబ్బ, రేటింగ్స్ కోసం మీడియా లోనూ ఇటీవల ఎక్కువ అయిపోయింది. అది లోకం చూస్తున్నది.**



రానున్న ఎన్నికల్లో పొత్తు ఉంటుందేమో కాని, బీజేపీ లో విలీనం వట్టి మాటే! అందులో ఇదేదో సంచలనం అయిపోతుంది అనే ప్రచారం కూడ కరెక్ట్ కాదు!కాంగ్రెస్ పార్టీ తెలంగాణ లో రోజు రోజుకు బలాన్ని పెంచుకుంటున్నది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు మొదలు అయిపోయింది. నిరుద్యోగులు, రైతుల మీద రాష్ట్ర ప్రభుత్వం కేంద్రికరిస్తున్నది. అధికార యంత్రాంగం కు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని మాజీ సీఎం వైఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో మాదిరి సీఎం రేవంత్ రెడ్డి వాళ్ళ పని వాళ్లకు పని చేసుకోడానికి స్వేచ్ఛ ఇచ్చారు.మాజీ సీఎం కెసిఆర్ ప్రభుత్వం లో మాదిరి పొలిటికల్ జోక్యం లేదు. బంధనాలు లేవు!

## మంత్రులు, ఎమ్మెల్యేలు స్వేచ్ఛగా!

మంత్రులు, ఎమ్మెల్యే లు ఎవరి పనిని వారు చేసుకుంటున్నారు.ప్రజలను ప్రజాప్రతినిధులు రెగ్యులర్ గా కలుస్తున్నారు. పాలనా వ్యవహారం గాడిన పడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బీజేపీ ఊహించినట్లు నెక్స్ట్ మేమే అనే పరిస్థితి లేదు!బిఆర్ఎస్ విపక్షంగా తన స్థానాన్ని గట్టి పర్చుకోవాలి.ఆ దిశనే వారు ఉన్నారు. ఏదో బిడ్డ కోసం పార్టీ ని అమ్ముకునే విధంగా బీజేపీ లో విలీనం చేసేస్తారు అనే విధంగా జరుగుతున్న ప్రచారం లో అసలు పస లేదు.

## పార్లమెంట్‌లో విపక్షం స్ట్రాంగే!

జనంసాక్షి

కాంగ్రెస్ పార్టీ కి పార్లమెంట్ లో రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత హోదా వచ్చిన నాటి నుంచి, ఇండియా కూటమి కూడ పెరిగిన బలం తో ఆయా పార్టీ ల ఎంపీలు, వారి జట్టు ఇప్పుడు చాలా స్ట్రాంగ్ అయిపోయింది. ఇండియా కూటమి కి చెందిన మాజీ సీఎం, ప్రస్తుత సమాజ్ వాది పార్టీ ఎంపీ అఖిలేష్ యాదవ్, అటు ఎన్సిపి ఎంపీ సుప్రియసులే, తృణముల్ కాంగ్రెస్ ఎంపీలు మోహువా మొయిత్ర,రచన బెనర్జీ,కాంగ్రెస్ ఎంపీ ప్రణిత షిండే, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే,ఎంఐఎం సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ,ఇలా ఎంతో మంది పార్లమెంట్ లో, రాజ్యసభ లో మాట్లాడుతున్న తీరు, నిలదీస్తున్న తీరు తో బీజేపీ సభ్యులు, ప్రభుత్వం ఆగం అయిపోతున్న పరిస్థితి ఉన్నది.ఇటు తెలంగాణ లోని అసెంబ్లీ లోనూ కాంగ్రెస్ సభ్యుల జట్టు బలంగా ఉన్నది.తెలంగాణ ఇచ్చిన తర్వాత కేసీఆర్ కుటుంబ సమేతంగా వెళ్లి ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ని కలిసి కృతజ్ఞతలు తెలుపడమే కాదు, తనకు సీఎం పదవి ఇస్తే టిఆర్ఎస్ ను కాంగ్రెస్ లో కలిపేస్తానన్నారు, అనేది మాత్రం వాస్తవం! అయితే అప్పుడు కాంగ్రెస్ లోని సీనియర్లు అడ్డుకోవడమే కాదు, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ కాబట్టి తామే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని సోనియా గాంధీ కి చెప్పారంటారు. అప్పుడు కేసీఆర్ ఏదైతే అది అయ్యిందనే ధైర్యంతో, ఒంటరిగా,రంగం లో దిగి ప్రభుత్వం ఏర్పాటు చేసి,కేసీఆర్ తెలంగాణకు మొట్ట మొదటి సీఎం అయ్యారు. 2018 లో రెండోసారి భారీ మెజారిటీ సాధించి, మళ్ళీ సీఎం అయ్యారు. ఇలా ఆయనలో రెండో సారి విజయం తర్వాత ఓవర్ కాన్ఫిడెన్స్ పెరిగింది. తానాషాహీగిరి పెరిగింది. తాను ఏది చేసినా చెల్లుతుంది, అనే అతి నమ్మకం, కనీసం మహిళల మీద లైంగిక ఆరోపణలు, అవినీతి, అక్రమాలు, మనుషులను లెక్క చేయని ఆరోపణలు ఉన్న వారు కూడ తన పేరు మీద గెలిచి పోతారని ఓవర్ కాన్ఫిడెన్స్ తో 30 నుంచి 40 మంది సిట్టింగ్స్ కు టికెట్ ఇచ్చారు. వారంతా ఓటమి పాలు అయిపోయారు. బిఆర్ఎస్ అధికారం కోల్పోయింది. 39 స్థానాలు వచ్చాయి. ఇందులో నుంచి పది మంది కాంగ్రెస్ లో చేరారు. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు రాలేదు. చాలా చోట్ల డిపాజిట్ లు రాలేదు. ఈ పరిస్థితి నుంచి బిఆర్ఎస్ తేరుకున్నది. అయితే కేసీఆర్ గతంలో ఆయన అధికారం లో ఉన్నపుడు విపక్షం కు విలువే ఇవ్వకుండా, కాంగ్రెస్, టిడిపి ఎమ్మెల్యే లను బిఆర్ఎస్ లో చేర్చుకున్నారో, అలాంటి పరిస్థితి, అంత స్పీడ్ గా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుత కాలంలో లేరు!ప్రచారం జరుగుతున్న స్థాయిలో బీజేపీ లో బిఆర్ఎస్ ను విలీనం చేయాల్సిన ఆగత్యం ఏమి కేసీఆర్ కు కనిపించడం లేదు! ఇది కేవలం చీల్ ఉడి అంటే నహీ నహీ భైన్స్ ఉడి!( గద్ద ఎగిరింది, అంటే!లేదు, లేదు,గేదె ఎగిరింది అన్నట్లు )లాంటి ప్రచారం లాగే కనిపిస్తున్నది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చెప్పినట్లు విలీనం ప్రచారం అబద్ధమే, అనిపిస్తుంది. పొత్తు మాట, అది కూడ ఫ్యూచర్ లో నిజం అవుతుంది ఏమో! గాని, విలీనం అబద్ధమే!అందులో ఏపీ లో మాదిరి ఎవరితో పొత్తు పెట్టు కున్నా కూడ బీజేపీ తెలంగాణాలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం అంటే ఆకాశానికి నిచ్చెన వేసినట్లే అవుతుంది! అది ఒక నైట్ మెయిర్ మాత్రమే, అంటే అతిషయోక్తి కాదు!సౌత్ ఇండియా అంటే అలాగే ఉంటుంది! ఇది పక్కా గ్రౌండ్ రిపోర్ట్!ఇక్కడ మతోన్మాదులకు అధికారం కల్ల!



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223



# ఆదర్శ కమ్యూనిస్ట్ బుద్ధదేవ్ భట్టాచార్య

**ఆదర్శాలు అందరూ నొక్కి వక్కాణిస్తారు. కాని కొందరు మాత్రమే ఆ ఆదర్శాలను కడదాకా ఆచరించి భావి సమాజానికి ఆదర్శప్రాయులుగా నిలుస్తారు. గత కొంత కాలంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతూ గురువారం దక్షిణ కోల్‌కతా లోని తన నివాసంలో మరణించిన భారత కమ్యూనిస్ట్ పార్టీ ( మార్క్సిస్ట్ ) సీనియర్ నాయకుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య తన చివరి క్షణం వరకు తాను నమ్మిన సిద్ధాంతాలు మరియు విశ్వాసాలకు అనుగుణంగా ముందుకు సాగి ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచారు. భారతదేశ కమ్యూనిస్ట్ ఉద్యమ చరిత్రలో అయన సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించుకున్నారు.**



బుద్ధదేవ్ భట్టాచార్య 1944 మార్చి 1 నాడు ఉత్తర కలకత్తా లోని బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. కలకత్తా లోని ప్రెసిడెన్సీ కళాశాల నుండి బి.ఏ డిగ్రీ ( అనర్స్)ని అభ్యసించిన ఆయన మొదటగా ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహించారు. బుద్ధదేవ్ భట్టాచార్య 1968 లో పశ్చిమ బెంగాల్ డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ప్రమోద్ దాస్ గుప్తా సహకారంతో రాజకీయ రంగంలోకి ప్రవేశించిన బుద్ధదేవ్ భట్టాచార్య 1971 లో సి.పి.ఎం బెంగాల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గాను ఎన్నికయ్యారు. 1985 లో నిర్వహించిన పార్టీ 12 వ మహా సభలో ఆయన కేంద్ర కమిటీ సభ్యుడు గాను ఎన్నికయ్యారు.

బుద్ధదేవ్ భట్టాచార్య 1996 లో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర హోమ్ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

జనంసాక్షి

1999 జనవరి నుండి 2000 నవంబర్ వరకు ఆయన బెంగాల్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గా బాధ్యతలు నిర్వహించారు. బుద్ధదేవ్ భట్టాచార్య 2000 లో జ్యోతిబసు వారసుడిగా ఎంపికయ్యారు. మార్క్సిస్ట్ పార్టీ కురువృద్ధుడు జ్యోతిబసు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశాకా 2000 నవంబర్ 6 నాడు బుద్ధదేవ్ భట్టాచార్య తొలిసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు. ఆ రకంగా ఆయన జ్యోతిబసు తర్వాత 2000 నుండి 2011 వరకు వరుసగా 11 ఏళ్ళ పాటు బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

2001 మరియు 2006 అసెంబ్లీ ఎన్నికల్లో సి.పి.ఎం పార్టీని అంతిమంగా లెఫ్ట్ ఫ్రంట్ ని విజయపథంలోకి తీసుకెళ్లడంలో బుద్ధదేవ్ భట్టాచార్య విశేష కృషి చేశారు. బుద్ధదేవ్ భట్టాచార్య అనుసరించిన భూసేకణ మరియు పారిశ్రామికీకరణ విధానాల మూలంగా 2011 నాటి ఎన్నికలలో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ఏకంగా 184 సీట్లు గెలుపొంది బెంగాల్ రాష్ట్రంలో 34 ఏళ్ల కమ్యూనిస్ట్ పాలనకు ముగింపు పలకడాన్ని విస్పష్టంగా గమనించవచ్చు. నాటి నుండి నేటి వరకు బెంగాల్ లో కమ్యూనిస్టులు కోలుకోలేని ఎదురుదెబ్బలు ఎదుర్కొంటూనే ఉన్నారు. విధి విధానాలను రూపొందించి పార్టీని బలోపేతం చేయడంలోనూ ఆయన విశేషమైన కృషి చేశారు.

బుద్ధదేవ్ భట్టాచార్య సాహిత్యంపై ప్రత్యేక అభిరుచిని కలిగి ఉండి కవి గాను మరియు రచయిత గానూ అనేక రచనలు చేశారు. కొలంబియన్ రచయిత గాబ్రియేల్ గార్సియా మార్క్వెజ్ మరియు రష్యన్ కవి వ్లాదిమిర్ మాయకోవ్స్కీ రచనల అనువాదాలతో సహా ఎనిమిది పుస్తకాలను బుద్ధదేవ్ భట్టాచార్య రచించాడు. ఆ రకంగా ఆయన అనేకంగా సాహిత్య రచనలను బెంగాలీ భాషలోకి ఆయన అనువదించడం అనన్య సామాన్యం. బుద్ధదేవ్ భట్టాచార్య ముఖ్యమంత్రిగా పనిచేసిననూ కూడా ఆయన అత్యంత సాధారణ జీవితాన్ని గడిపారు. దక్షిణ కోల్ కతా లోని పామ్ అవెన్యూ లోని రెండు గదుల ప్రభుత్వ ఫ్లాట్ లో ఆయన అతి సామాన్యంగా జీవించడం అరుదైన విషయం. 2022 లో బుద్ధదేవ్ భట్టాచార్యకి కేంద్రప్రభుత్వం 'పద్మభూషణ్ పురస్కారాన్ని' ప్రకటించిననూ ఆయన ఆ పురస్కారాన్ని సున్నితంగా తిరస్కరించడం గమనార్హం.

సాధారణ ఉపాధ్యాయుడుగా తన ప్రస్థానాన్ని సాగించిన బుద్ధదేవ్ భట్టాచార్య భారత కమ్యూనిస్ట్ పార్టీ ( మార్క్సిస్ట్ ) యువజన విభాగం నుండి అనేక సవాళ్ళను అధిగమించి అంచెలంచెలుగా పార్టీలో ఒదిగి ఎదిగారు. ఏకంగా 11 ఏళ్ల పాటు పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ముఖ్యమంత్రి గాను మరియు అత్యున్నత పొలిట్‌బ్యూరో సభ్యుడు గాను కొనసాగి సరికొత్త చరిత్రను సృష్టించారు. అంతిమంగా అతి సామాన్యమైన మరియు నిరాడంబరమైన జీవితాన్ని గడిపి కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయంగా నిలిచిన బుద్ధదేవ్ భట్టాచార్య మరణం భారత కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీరనిలోటు. ఆయన ఆదర్శాలను మరియు ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి కాగలదు.

జేజేసీపీ
బాబూరావు
రీసెర్చ్ స్కాలర్,
9493319690



# సైన్యం కనుసన్నల్లో బంగ్లాదేశ్ భవితవ్యం



బంగ్లాదేశ్ లో రాజకీయ అస్థిత్వం నెలకొన్నది. బంగ్లాదేశ్ ఇప్పుడు సైన్యం కనుసన్నల్లోకి జారిపోయింది. త్రివిధ దళాలు రంగ ప్రవేశం చేసి, అధ్యక్ష భవనాన్ని ఆక్రమించడం,ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేసి, భారత్ లో ఆశ్రయం పొందడం, ఖలిదా జియా జైలు నుండి విడుదల కావడం వంటి సంఘటనలు చకచకా జరిగిపోయాయి. భారత్ లో ఆశ్రయం పొందుతున్న హసీనా కు అమెరికా వీసా రద్దు చేసింది. లండన్ లో స్థిరపడాలన్న ఆమె ఆశ నెరవేరలేదు. ఉద్యమం చేసిన విద్యార్థుల కోసం పని చేస్తానని తాత్కాలిక ప్రభుత్వ నేత చెబుతున్నారు. ఆర్మీ చీఫ్ పైకి ఎన్ని కబుర్లు చెబుతున్నా, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధానిగా మహ్మద్ యూనస్ ను నియమించినా, సైనిక పాలన వైపే ఆర్మీ మొగ్గు చూపుతున్నదనే నిజాన్ని ఏమార్చలేరు. బంగ్లాదేశ్ లో సైనిక జోక్యం ప్రజాస్వామ్యాన్ని పాతరేసి, మరో పాకిస్తాన్ లా మార్చడమే అవుతుంది. అవినీతి కేసులో 13 సంవత్సరాల జైలు శిక్ష పడి,గత రెండేళ్ల గా జైలు జీవితం గడుపుతున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నాయకురాలు, మాజీ ప్రధాని ఖలీదా జియా విడుదల వెనుక ఆంతర్య మేమిటి? ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన హసీనా గద్దె దిగడం వెనుక రిజర్వేషన్ల ఉద్యమమే కారణమా? లేక విదేశీ హస్తమున్నదా? హసీనాకు వీసా నిరాకరించిన అమెరికాకు ఈ కుట్రలో భాగస్వామ్య మున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బంగ్లాదేశ్ లో మైనారిటీల ఇళ్లను తగల బెట్టడం, దుకాణాలను ధ్వంసం చేయడం, పోలీసు స్టేషన్ల ను ముట్టడించి తుపాకులను ఎత్తుకు పోవడం, వాహనాలను దొంగిలించడం అమాయకులను హత్య చేయడం, కొందరిని సజీవ దహనం చేయడం మానవత్వానికి మాయని మచ్చ. విద్యార్థులు ఏ లక్ష్యంతో హసీనా ప్రభుత్వాన్ని గద్దె దించారో, అదే విద్యార్థులపై మతం పేరుతో దౌర్జన్యాలు చేయడం దారుణం. ప్రస్తుతం బంగ్లాదేశ్ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యి లోకి పడినట్లయింది. బంగ్లాదేశ్ లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినా అది త్వరలో సైనికుల చేతుల్లోకి వెళ్ళక తప్పదు. ఒక్కసారి ప్రభుత్వం సైనిక పాలకుల చేతికి చిక్కితే ఇక బంగ్లాదేశ్ లో నియంతృత్వం ఏర్పడుతుంది. ఇదే గనుక జరిగితే ఇది విద్యార్థులు కావాలని కొని తెచ్చుకున్న సంకట పరిస్థితిగా మారుతుంది. ఈ సందర్భంలో షేక్ హసీనా గురించి,ఆమె రాజకీయ నేపథ్యాన్ని,పరిపాలనను విశ్లేషించడం సముచితం,సందర్భోచితం.

రాజకీయ కక్షలతో అల్లకల్లోల మైన బంగ్లాదేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ధీరవనిత, అత్యధిక కాలం బంగ్లాదేశ్ ను పాలించిన అవామీ లీగ్ నాయకురాలు షేక్ హసీనా. అభివృద్ధికి అర్థం తెలియని బంగ్లా దేశ్ ను ప్రగతి పథంలో ముందుకు నడిపారు. జి.డి.పి లో భారత్ ను అధిగమించారు. అక్షరాస్యతా శాతం పెంచారు. హసీనా జీవితం పూల పాన్పు కాదు. తండ్రి షేక్ ముజిబర్ రహమాన్ బంగ్లా జాతి పితగా, బంగ్లా దేశ్ ప్రభుత్వ నేతగా పని చేస్తూ ఆర్మీ చేతిలో దారుణంగా హతుడైనాడు. తండ్రి మరణం హసీనాలో పట్టుదల పెంచింది. పోరాట పటిమ చూపింది. కష్టకాలంలో హసీనాకు అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం ఆశ్రయమిచ్చింది. అలుపెరుగని పోరాట పటిమతో బంగ్లాదేశ్ కు ఐదు పర్యాయాలు ప్రధానిగా పని చేసి, ప్రజాస్వామ్య వ్యవస్థలో మిలటరీ ప్రమేయం తగదని చాటి చెప్పిన హసీనాను గద్దె దించి,తరిమేయడం తాత్కాలిక ఆవేశం నుండి పుట్టిన ఆగ్రహమే. హసీనా బంగ్లాదేశ్ ప్రజా జీవితాలను మెరుగు పరిచారు. ఏ ప్రజల కోసమైతే పోరాడారో, ఏ గద్ద కోసమైతే శ్రమించారో ఆ గద్ద పైనే అవమాన పడి, ఇండియాకు శరణార్థిగా వచ్చారు. తండ్రి ముజిబర్ రహమాన్ కూడా ప్రజలకోసం పని చేసి ఆత్మబలిదానం చేసారు. ఇప్పుడు కుమార్తె కూడా రిజర్వేషన్ల ఉద్యమానికి పదవి కోల్పోయి, దేశం విడిచి పెట్టారు. ఈ సందర్భంగా హసీనా తండ్రి ముజిబుర్ రహ్మాన్ గురించి సంక్షిప్త విశ్లేషణ అవసరం. భారతదేశం ఆగష్టు 15 వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు జరుపుకుంటున్న తరుణంలో అదే రోజు 1975 వ సంవత్సరంలో షేక్ ముజిబర్ రహమాన్ ను ఆయన నివాసంలో బంగ్లా సైన్యం కాల్చి చంపడం జరిగింది. తిరిగి ఇదే ఆగష్టు నెలలో షేక్ హసీనా గద్దెదిగి, భారత్ ను ఆశ్రయించడం యాదృచ్ఛికమే కావచ్చు. కాని ఆలోచించదగ్గ విషయం. ఏది ఏమైనప్పటికీ బంగ్లాదేశ్ లో ఏర్పడిన రాజకీయ అస్థిరత్వం భారత్ కు ముప్పుగా మారే అవకాశముంది. భారత్ కు చుట్టూ ఉన్న దేశాలన్నీ శత్రుదేశాలుగా మారడం ఆందోళనకరం. బంగ్లా దేశ్ లో ఎవరు అధికారం లోకి వచ్చినా భారత్తో స్నేహ సంబంధాలు కొనసాగించడం అవసరం.

జనంసాక్షి

బంగ్లా విమోచనలో భారత్ నిర్వహించిన పాత్ర మరువలేము. బంగ్లాదేశ్ కు స్వాతంత్ర్యం భారత్ వలనే సిద్ధించింది. జాతి ప్రయోజనాల కంటే మత ప్రయోజనాలే ముఖ్యం కావడం వలన బంగ్లాదేశ్ ఏనాడూ పూర్తి స్థాయిలో భారత్ కు స్నేహ హస్తం అందించ లేదు. ఏది ఏమైనప్పటికీ బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధానిగా నోబెల్ బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్ నియమితులు కావడం, ఆయన శాంతికాముకుడు కావడం విశేషం. అయితే బంగ్లాదేశ్ సైనికాధికారుల కనుసన్నల్లో ఆయన ఎంత కాలం అధికారంలో ఉంటారో తెలియదు. ఎన్నికలు జరిగినా, ఇక మీదట బంగ్లా దేశ్ లో ప్రజాస్వామ్య బద్ధమైన పాలన కొనసాగుతుందని ఆశించలేం.హసీనా

బంగ్లాదేశ్ లో లౌకిక వాదానికి కట్టుబడి మైనారిటీ సోదరుల అభిమానాన్ని సైతం చూరగొన్నారు. హసీనా త్యాగాలను సాంఘిక మాధ్యమాలు మసకబార్చాయి. విద్యార్థుల ఆవేశం బంగ్లా దేశ్ భవితవ్యాన్ని వెనక్కునెట్టింది. బంగ్లాదేశ్ కు మొదటి ప్రధానిగా పనిచేసిన ఖలీదా జియా తిరిగి రాజకీయ రంగ ప్రవేశం చేయవచ్చు. ఖలీదా జియా బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు దివంగత జియావుర్ రహ్మాన్ సతీమణి. ఖలీదా జియా హసీనాకు ఆమె చిరకాల రాజకీయ బద్ధ శత్రువు. హసీనా మాదిరి ఉదార స్వభావం ఖలీదా లో లేదు. భారత్ పట్ల కూడా ఆమె విశ్వసనీయత అంతంత మాత్రమే. బంగ్లాదేశ్ లో ఎన్నికలు జరిగి, ఖలీదా జియా కనుక ప్రధానిగా మరో సారి పగ్గాలు చేపడితే భారత్ తో ఆమె సత్సంబంధాలు కొనసాగిస్తుందా? పాక్ తో అంట కాగుతుందా? కాలమే సమాధానం చెప్పాలి. ఏది ఏమైనప్పటికీ బంగ్లా దేశ్ లో సైనిక జోక్యానికి స్వస్తి చెప్పి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే సత్వరమే ఎన్నికలు జరపాలి. హసీనాను దేశానికి రప్పించి, ఎన్నికల్లో ఆమె పాల్గొనేటట్లు చేయాలి. హసీనా లేని ఎన్నికలు బంగ్లా దేశ్ నేషలిస్ట్ పార్టీకి ఆయాచిత వరంగా మారతాయి.



- సుంకవల్లి సత్తిరాజు.
(సామాజిక విశ్లేషకులు)
సంగాయగూడెం,
తూ.గో.జిల్లా
9704903463

# ఆదివాసీ హెచ్చరిక

జనంసాక్షి

అడవితల్లి ముద్దుబిడ్డలం
వన సంపదకు వారసుల
చెట్టూపుట్టా ఇలవెల్పులు
కొండాకోనా తోబుట్టువులు
పోడు ఎవుసం జేసుకొని
పొట్టపోసుకునే జీవులం
అన్నెం పున్నెము ఎరుగని
అమాయక ఆదివాసులం
చరిత్ర గతి ఎంత మారినా
మా బతుకులు మారలేదు
ప్రగతి ఫలాలు దరిచేరలేదు
తరాలుగా రాక్షస రాజ్యం
ఆదివాసీల హక్కుల మీద
ఉక్కు పాదం మోపుతుంది
అటవీ సంపదను కొల్లగొట్టి
కార్పొరేట్లకు కట్టబెడ్తుంది



అరణ్యాన్ని దురాక్రమించి
గెంటివేయ తెగబడుతుంది
ఇకనైనా వన విధ్వంసాలు
దోపిడి చర్యలు ఆపకుంటే
చిగురుడాకులు
చురకత్తులై మెరుస్తాయ్
గడ్డి పరకలు
గండ్ర గొడ్డల్లే గర్జిస్తాయ్
చలి చీమలు..
దండయాత్ర
జేస్తాయ్
తెల్ల పావురాలు..
ఎర్ర మార్గం పడతాయ్
ఆదివాసులు అగ్రహోగ్నులై
మీ రాజ్యాన్ని దహిస్తాయ్
ఓ నియంత పాలకులారా
దోపిడి దొంగ ముఠాల్లారా!
ఇదే ఆదివాసుల హెచ్చరిక

**(ఆగష్టు 9 న అంతర్జాతీయ ఆదివాసుల దినోత్సవం సందర్భంగా..)**

కోడిగూటి తిరుపతి
9574929493

# విశ్వ విజేత

జనంసాక్షి

ఆమె ఓడి పోలేదు
తాను బరిలో నిలిచి
గెలిచింది
వంద గ్రాముల బరువును బూచిగా
చూపి
క్రీడనుండి తప్పించడం
కుట్రగా భావించ బడుతున్నది
ఆమె గుండె చెరువయినది
మా గుండెలు చితికిపోయిన వి
ఎన్నో అవరోధాలు,అవమానాలు,
చీత్కారాలను
అధిగమించిన స్త్రీ మూర్తి
ఆనాడు నిరసన దీక్ష శిబిరాలను
ఉండి ఈడ్చుకు వెళ్ళిన దృశ్యాలకు
జంకక ,కృంగక...
అవార్డులను- రివార్డులను
తృణీకరించి
గంగలో నిమజ్జనం చేయడానికి
సిద్ధమైన సివంగి..,..
ఢిల్లీ గద్దెలకే దడ పుట్టించిన
వీరవనిత
కుస్తీ లో విశ్వాన్నే
మట్టి కురిపించిన నారీమణి
140 కోట్ల భారతీయుల ఆరాధ్య
ఆమె వేదన విశ్వరోదన
రెజ్లర్ వినేష్ పోగట్ మా
విజయేందిర
అసలు సిసలైన విశ్వ విజేత

నమిలకొండ నాగేశ్వర్ రావు
8688553470 మేడ్చల్

# అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

## కోటి 26 లక్షల విలువ చేసే నగలు స్వాధీనం

- ట్రావెల్స్ బస్సులే టార్గెట్
- ఒకరు అరెస్ట్ పరారీలో ఇద్దరు
- రాచకొండ సిపి సుధీర్ బాబు




**మల్కాజిగిరి,ఆగస్టు9(జనంసాక్షి)**
ట్రావెల్స్ బస్సులను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ఒక వ్యక్తిని చౌటుప్పల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు నేరెడ్ మెట్‌లోని రాచకొండ కమిషనర్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ముంబాయికి చెందిన ఏడి జువెలర్స్‌లో సేల్స్ మెన్‌గా పనిచేస్తున్న కునాల్ కొఠారి (35) జూలై 26న ముంబై నుండి ఆంధ్రప్రదేశ్ కు ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులో బంగారం తీసుకు వెళ్తుండగా చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక హోటల్లో భోజనానికి ఆపిన వెంటనే గుర్తు తెలియని వ్యక్తులు బంగారం బ్యాగు ఎత్తుకు వెళ్లారని బాధితుడు చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రత్యేక టెక్నాలజీ ని ఉపయోగించి ఒక వ్యక్తిని పట్టుకొని విచారించగా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అఖిల్, అస్లాం, సోనీ ఠాకూర్, ముగ్గురు కలిసి ముంబై నుండి వివిధ ప్రాంతాలకు బంగారం తీసుకు వెళుతున్న వారి వివరాలు తెలుసుకొని క్రెటా కారులో బస్సులను వెంబడిస్తూ ఆగిన వెంటనే దొంగతనాలకు పాల్పడుతున్నామని, జూలై 26న ముంబై నుండి ఓ వ్యక్తి బంగారు ఆభరణాలు తీసుకొని ఆరెంజ్ ట్రావెల్స్ లో ఆంధ్రప్రదేశ్ వెళుతున్నాడని సమాచారం తెలుసుకున్న ముగ్గురు నిందితులు బస్సును వెంబడిస్తూ చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భోజనానికి బస్సు ఆగిన వెంటనే అందరూ దిగిన తర్వాత బస్సులో బ్యాగులను చూసి బంగారం ఉన్న బ్యాగును ఎత్తుకు వెళ్ళినట్లు నిందితుడు విచారణలో తెలిపాడు. అఖిల్, అస్లాం, పరారీలో ఉన్నారని సోనీ ఠాకూర్ నుండి 1833 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ 1,26,88,432 ఉంటుందని తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కొరకు గాలిస్తున్నామని అన్నారు.

# నిమ్స్‌లో చక్రం తిప్పుతున్న అధికారి

- లీజుల్లోనూ చేతివాటం
- నిబంధనలకు విరుద్ధంగా విజయ డైరీ ఏర్పాటు

**ఖైరతాబాద్, ఆగస్టు 09 (జనం సాక్షి) :**
పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఏర్పాటుచేసిన నిమ్స్ ఆసుపత్రిలో అవినీతి రాజ్యమేలుతుంది. పేద ప్రజలు వైద్యం కోసం నిమ్స్ ఆసుపత్రికి వస్తే నిలువు దోపిడికి గురవుతున్నారు. మంచినీళ్ల నుంచి మొదలుపెడితే ప్రతి దాంట్లో దోపిడి జరుగు తుంది. వీటి అన్నిటి వెనక నిమ్స్‌లో రెండు దశాబ్దాల పాటు చక్రం తిప్పుతున్న సదరి అధికారి కనసన్నల్లోనే జరుగుతున్నట్లు తెలుస్తుంది. నిమ్స్ ఆసుపత్రిలో ఏది అనుమతులు కావాలన్నా సదరు అధికారి కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా నిమ్స్ ఆసుపత్రిని ప్రభుత్వాలు తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తుంటే కొంతమంది




అధికారులు తమ అవినీతి కోసం పేద ప్రజల రక్తాన్ని పీలుస్తున్నారు. నిమ్స్‌లో ఏదైనా కేటాయించాలంటే నియమ నిబంధనల ప్రకారం టెండర్ పిలిచి సంవత్సరం పాటు లీజుకు ఇస్తారు. అయితే ఈ పెద్ద సారు తనకు అనుకూలంగా ఉన్నవారికి నిబంధనలు వర్తించవు, నిమ్స్ ఆసుపత్రిలో పేద రోగుల కోసం విజయ డైరీని ఏర్పాటు చేశారు. దీనికి నిమ్స్ యాజమాన్యం సంవత్సరం పాటు లీజుకు ఇవ్వాల్సి ఉండగా అవి ఏమి పట్టించకుండా సదరు అధికారి రెండు సంవత్సరాలపాటు లీజు కేటాయించారు. లీజు తీసుకున్న సదరు నిర్వాకులు నిబంధనలకు విరుద్ధంగా విజయ డైరీ ప్రోడక్ట్‌తో పాటు వాటర్ క్యాన్లను సరఫరా చేస్తున్నారు. సదరు నిర్వాకుడు వాటర్ క్యాన్‌లో ఫిల్టర్ వాటర్ కాకుండా నిమ్స్‌లో వచ్చే మంజీరా వాటర్ ను నింపుకుంటూ తన వ్యాపారని కొనసాగిస్తున్నాడు. ఇక్కడ రోగులతో పాటు బంధువులు నీళ్లు తాగడానికి, వాడుకోవ డానికి సదరు నిర్వాహకులు అమ్మే వాటర్‌ని కొనుగోలు చేస్తున్నారు. ఫిల్టర్ వాటర్‌ను విక్రయించకుండా నిమ్స్ ఆస్పత్రిలో సరఫరా అయ్యే మంజీరా నీరుని అమ్మడం గమనార్హం ఇదేమిటి అని ఎవరైనా అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నట్లు తెలుస్తుంది. నిమ్స్‌లో అవినీతికి పాల్పడుతున్న సదరు అధికారి అండతో విజయ డైరీ నిర్వాహకులు చెలరేగిపోతున్నారు. ఇప్పటికైనా నిమ్స్ డైరెక్టర్ చర్యలు తీసుకోవాలని పలువురు రోగులు కోరుతున్నారు.

# ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు

- ఛాలెంజ్‌గా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలి
- పెండింగ్ కేసులపై నెల వారి సమీక్ష సమావేశం
- ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి
- జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

**మెదక్ ప్రతినిధి, ఆగస్టు 9 (జనంసాక్షి) :**
ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి సూచించారు. జిల్లా సిబ్బందితో నేర సమీక్షా సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పెండింగ్లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి డి. ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా నేరాలు జరిగే ప్రాంతాల్లో హాట్ స్పాట్ లను ఏర్పాటు చేసి అదునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్రైమ్ మ్యాపింగ్ తయారు చేసి అక్కడ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి తెలియజేశారు. అలాగే గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి, ఏ ఏ అంశాలు కోడికరించాలి తదితర అంశాల గురించి వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్ తో పని చేసి జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలని కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు . ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించాలని తెలిపారు. కేసుల చేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలని, పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి ఛాలెంజ్ గా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని, క్రైమ్ అగెనెస్ట్ ఉమెన్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలను సూచించారు. రిసెప్షన్, క్రైమ్ వర్టికల్, టెక్ టీమ్, స్టేషన్ రైటర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్, తదితర వర్టికల్, విధులు నిర్వహించే అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేస్తూ వారి



పనితనాన్ని మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి. సైబర్ నేరాల నియంత్రణ గురించి సిసి కెమెరాల ఆవశ్యకత గురించి గ్రామాలలో పట్టణాలలోఆయా గ్రామాల పోలీస్ అధికారులు సిబ్బంది ప్రోయాక్టివ్ పోలీస్ సింగ్ విధులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, తూప్రాన్ డిఎస్పి వెంకట రెడ్డి ,సైబర్ క్రైమ్ డిఎస్పి సుభాష్ చంద్ర బోస్, జిల్లాలోని సిఐలు ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడటానికి చెట్లు నాటండి

- అటవీ వనరులు భవిష్యత్ తరానికి ఎంతో అవసరం
- ప్రొహిబిషన్ ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్

**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 9 (జనం సాక్షి):**
చెట్లను నాటినట్లయితే ప్రకృతిని కాపాడిన వారమవుతామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ ఇ. శ్రీధర్ అన్నారు. శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా వికారాబాద్ మండలం ఘట్ కొండాపూర్, అనంతగిరి అటవీ పరిసరాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్, వికారాబాద్ జిల్లా స్వచ్ఛదనం-పచ్చదనం ప్రత్యేక అధికారి ఇ.శ్రీదర్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌లు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పెద్ద మొత్తంలో చెట్లు నాటడం వల్ల భవిష్యత్ తరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉధృతంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జైదుపల్లి పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులతో ముచ్చటిస్తూ..తమ భవిష్యత్తులో ఏ రంగాన్ని ఎంచుకుంటారని అడిగి తెలుసుకున్నారు.



పర్యటనలో భాగంగా కమిషనర్, కలెక్టర్‌లు అధికారులతో కలిసి అటవీ ప్రాంతంలోని హిల్ వ్యూ పాయింట్ నుండి అటవీ అందాలను తిలకించారు. వన మహోత్సవ కార్యక్రమంలో ఇన్చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డివైఎస్ఓ హనుమంతరావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ, జిల్లా సూపరింటెండెంట్ విజయ భాస్కర్, అబ్కారీ, అటవీ శాఖ అధికారులు, జైదుపల్లి పాఠశాల బాల, బాలికలు వున్నారు.



## నామ నిత్య శ్రీ మెదక్ జిల్లాకే గర్వకారణం

### జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు

**మెదక్ ప్రతినిధి, ఆగస్టు 9(జనంసాక్షి):**
మార్షియల్స్ ఆర్ట్స్ కరాటే ఛాంపియన్షిప్ 2024 పోటీలో బంగారు పథకాన్ని నామ నిత్య శ్రీ సాధించడం మన మెదక్ జిల్లాకే గర్వకారణం అని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. 'మార్టియల్స్ ఆర్ట్స్ కరటి ఛాంపియన్షిప్ 2024"ను హైదరాబాదులోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలలో 30 దేశాల నుంచి 3,000 మంది బ్లాక్ బెల్ట్ సాధించిన వారు పాల్గొనగా మన మెదక్ జిల్లా నుంచి నామ నిత్యశ్రీ పాల్గొని ఛాంపియన్షిప్ 2024తో పాటు బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తన చాంబర్లో ఆమెను అభినందించారు. నిత్యశ్రీ మాట్లాడుతూ నగేష్ మల్లూరి ,దినకర్ మాస్టర్ల సారథ్యంలో కోచింగ్ తీసుకొని, నిత్యం వారి సూచనలు సలహాలు పాటిస్తూ విజయం సాధించాలని తెలిపారు. నిత్యశ్రీ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ కారణశీల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



### జిల్లా కలెక్టర్ విజయందిర బోయి

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం పాలమూరు యూనివర్సిటీలో పరిపాలన భవనం ఆవరణంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరై రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, పీయూ అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని, మొక్కలను కాపాడితే వాతావరణ సమ తుల్యత కాపాడిన వాళ్ళం అవుతామని అన్నారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ ఎన్ని పీజీ కోర్స్ ఉన్నాయని, పీజీ తరువాత మీ లక్ష్యాలు ఏమిటి అని, చదువు కునేటప్పుడే ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకొని, అది సాధించే విధంగా కష్టపడాలని, మరోసారి యూనివర్సిటీకి వస్తానని అన్నారు. రిజిస్ట్రార్ డా. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ వైస్ ఛాన్సెలర్ అహ్మద్ నదీమ్ సూచన మేరకు పీ యూ లో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించమని, యేటా ప్రభుత్వం ప్రకటించే బడ్జెట్ కేటాయింపులో యూనివర్సిటీ కి మరిన్ని నిధులు మరియు మొక్కల సంరక్షణ కొరకు పది లక్షల నిధులు మంజూరు అయ్యేటట్టు కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి నర్సింహులు, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, జిల్లా ఫారెస్ట్ అధికారి సత్యనారాయణ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రయ్య, పరీక్షల నియంత్రణ అధికారి డా. రాజ్ కుమార్, ప్రిన్సిపాల్ డా. చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డా. కృష్ణయ్య, అధ్యాపకులు డా. కుమార స్వామి, డా. కిషోర్, డా. అర్జున్ కుమార్, డా. రాజశేఖర్, గాలేన్న, డా. చిన్నాదేవి పిఆర్ఓ రవికుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



# వీధి కుక్కల దాడిలో మరో బాలుడు మృతి

**ఇబ్రహీంపట్నం,ఆగస్టు 8(జనం సాక్షి):**
రాష్ట్రంలో వరుసగా కుక్కల దాడుల్లో చిన్నారులు ప్రాణాలు విడుస్తున్నారు. ఇవి ఎక్కువగా హైదరాబాద్ లోనే జరుగుతున్నా యనుకుంటే.. ఇప్పుడు ఇతర పట్టణాల్లో కూడా హడలెత్తిస్తున్నాయి. తాజాగా కుక్కల దాడిలో మూడేండ్ల బాలుడు మృతి చెందిన ఘటన ఇబ్రహీంపట్నంలో చోటుచేసుకుంది. మండలంలోని రాయపోల్ గ్రామంలో 20 రోజుల క్రితం వీధి కుక్కల దాడిలో మూడేళ్ల బాలుడు క్రియాన్ మీద వీధి కుక్కలు దాడి చేశాయి. దాంతో తల్లిదండ్రులు వెంటనే బాలుడిని నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.



## పర్యావరణాన్ని కాపాడుకుందాం

### ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

**కీసర, ఆగస్టు 09 (జనంసాక్షి)**
చెట్లే మానవునికి జీవానాధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కోరారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో "స్వచ్ఛదనం - పచ్చదనం" కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుకుందామని, చెట్లే మానవునికి జీవానాధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఎ.నాగమణి, జిల్లా విద్యా శాఖ అధికారి ఐ.విజయ కుమారి, కౌన్సిలర్లు కొత్త సురేఖ భాస్కర్ గౌడ్, వసుపతి రమేష్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు కౌకుట్ల తిరుపతి రెడ్డి, హరిగౌడ్, శ్రీకాంత్ గౌడ్, కీసరగుట్ట ట్రస్ట్ బోర్డ్ సభ్యులు మణికంఠ ముదిరాజ్, బోడ నరేష్, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రభు, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, మహిళా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, కాలని ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ రంగానికి దీటుగా బిఎస్ఎన్ఎల్ సేవలు

- ఏజీఎం ఎ.బాలకృష్ణ
- బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల అవగాహన ర్యాలీ

**కాప్రా, ఆగస్టు 09 (జనంసాక్షి)**
ప్రతి ఒక్కరు బిఎస్ఎన్ఎల్ సేవలను ఆదరించాలని అతి తక్కువ ధరలతో బిఎస్ఎన్ఎల్ సేవలు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని హైదరాబాద్ హెడ్ క్వార్టర్స్ ఏరియా-1 ఏజీఎం ఎ.బాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ సంచార నిగం లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్)ను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఉద్యోగులు, సిబ్బంది ప్లే కార్డ్స్ చేత పట్టుకొని ర్యాలీని నిర్వహించి వినియోగదా రులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ హెడ్ క్వార్టర్స్ ఏరియా-1 ఏజీఎం ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ..దేశంలో ప్రభుత్వ




రంగ సంస్థల్లో ఒక వెలుగు వెలిగి మొదటిస్థానంలో ఉన్న బిఎస్ఎన్ఎల్ తిరిగి పూర్వవైభవం సంతరించుకుంటుదని ఆశాభావం వ్యక్తం చేశారు. టెలికాం రంగంలోనే రారాజుగా కొనసాగి, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రైవేట్ రంగానికి ధీటుగా వినియోగదారులకు సేవలు అందిస్తుందన్నారు. ఇటీవల ప్రైవేట్ సంస్థలు ప్లాన్ రేట్లను భారీగా పెంచినప్పటికీ, బిఎస్ఎన్ఎల్ పాత రేట్లని కొనసాగిస్తుందన్నారు. నెల రోజుల్లో 2.31 లక్షల మంది బిఎస్ఎన్ఎల్ సేవలను కొత్తగా పొందారని, దీంతో మొబైల్ సేవలతో పాటు, ఫైబర్ నెట్వర్క్ లో బిఎస్ఎన్ఎల్ సేవలను మరింత విస్తృతపరిచామన్నారు. ఇక ఇంటింటికి ఫైబర్ నెట్ వర్క్‌లో 20 ప్లాన్ లతో ఇంటర్నెట్ సౌకర్యాలను కల్పిస్తున్నా మన్నారు. ప్రతి గ్రామంలో బిఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆత్మ నిర్బంధ్ భారత్‌లో భాగంగా బిఎస్ ఎన్ఎల్ సరికొత్త పరిజ్ఞానంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతుందన్నారు. ఈ సందర్భంగా ఈసీఐఎల్‌లోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి రాధిక చౌరస్తా, ఏ.ఎస్.రావు నగర్ మీదుగా తిరిగి ఈసీఐఎల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి ఏజీఎం ఏఎన్ విఏ ప్రభాకర్ రావు, ఎస్‌డి ఈ శ్రీకృష్ణ, బిఎస్ఎన్ఎల్ అధికారులు కె.రాజేశ్వరరావు, చంద్రశేఖర్, రఘునందన్, సంతోష్ బాబు, రాకేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**చేవెళ్ల, ఆగస్టు 09 (జనంసాక్షి)**
మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు నాశనమవుతాయని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చేవెళ్ల సిఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం సాగర్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్, చేవెళ్ల వారి ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు డ్రగ్స్ కు నో అనే కార్యమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ..విద్యార్దులు, యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. మాదకద్రవ్యాలు వల్ల యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. యువత చెడు వ్యసనాల పట్ల ఆకర్శితులు కాకుండా ఆరోగ్యవంతమైన జీవితంపై ఆశలు పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ప్రదీప్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థులు, సిబ్బంది, నాన్-టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.





# నిమ్స్‌ను సందర్శించిన తమిళనాడు హెల్త్ సెక్రటరీ

## నిమ్స్‌లో సేవలను వివరించిన డైరెక్టర్ నగరి భీరప్ప

**ఖైరతాబాద్, ఆగస్ట్ 09 (జనం సాక్షి)**
తమిళనాడు హెల్త్ సెక్రటరీ సుప్రియ సాహు నిమ్స్‌లోని వివిధ విభాగాలను శుక్రవారం సందర్శించి నిమ్స్‌లో అందుతున్న సేవలను డైరెక్టర్ నగరి భీరప్పను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా మెట్టు రంగారెడ్డి స్పెషల్ రూమ్స్, దయాలసిస్ విభాగంలో టెలి దయాలసిస్ విధానం ద్వారా దూర ప్రాంత గ్రామీణ కిడ్నీ రోగులకు నిమ్స్ డాక్టర్ల పర్యవేక్షణాలో అందుతున్న సేవల గురించి డా.గంగాధర్ వివరించారు. తరువాత వెల్నెస్ సెంటర్‌లో సివిల్ సర్వెంట్స్‌కు అందిస్తున్న సేవల గురించి భీరప్ప వివరించారు. తదుపరి డిఎస్ఏ ల్యాబ్‌ను సందర్శించి నిమ్స్‌లో అన్ని వర్గాల వారికీ అందుతున్న సేవలకు సంతృప్తిని వ్యక్తం చేసారు. వీరితో పాటు డైరెక్టర్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఆర్‌వి.కర్ణన్, ప్రొ.రామ్ మూర్తి, ప్రొ.స్వర్ణలత, సీనియర్ వైద్యులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- కోహెడ మండలంలో పర్యటించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- రైతు వేదికలలో రైతు అవగాహన కార్యక్రమం
- స్టీల్ బ్యాంకు ప్రారంభించిన మంత్రి




**కోహెడ ఆగష్టు 09:(జనంసాక్షి):**
మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్టీల్ బ్యాంక్ ను రాష్ట్ర రవాణ, బి సీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రజలందరూ స్టీల్ పాత్రలను వాడాలని మంత్రి అన్నారు. భవిష్యత్‌లో ప్లాస్టిక్‌ని వాడకుండా ఉండి ఆరోగ్య వంతమైన జీవితం గడపాలన్నారు. అనంతరం కోహెడ, బస్వాపూర్ రైతు వేదికలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి వ్యవసాయ శాఖ, ఆరోగ్య శాఖలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం రెండు విడుతలుగా రైతులకు లక్ష యాభై వేల రూపాయల వరకు ఉన్న రుణమాఫీ చేసింది అన్నారు. ఇంకా రుణమాఫీ కానివారు ఉంటే వ్యవసాయ శాఖ అధికారిని కలవాలని అన్నారు. అలాగే రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ రాకుంటే ప్రజాపాలన సేవ కేంద్రాల వద్ద ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తెలిపారు.అలాగే రైతులు వాణిజ్య పంటలు అయిన డ్రాగన్ ఫ్రూట్, మల్బరి తోటలను పెంచి పట్టుపురుగుల పెంపకం చేపట్టాలన్నారు. వీటికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ తోటలు ఒకసారి నాటితే సంవత్సరాల తరబడి మీ జీవితాల్లో మార్పు వస్తుందన్నారు. అలాగే పెరటి కోళ్ళ పెంపకానికి ప్రభుత్వం యాభై లక్షల వరకు ఋణం యాభై శాతం సబ్సిడీ తో అందచేస్తాం అని మంత్రి అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ముప్పయ్ శాతం సబ్సిడీ తో ఏర్పాటు, అలాగే సోలార్ విద్యుత్ కేంద్రం ఎనిమిది కోట్ల నలభై లక్షల రూపాయల నిధులతో ఉంటుందని వీటిని సద్వినయోగం చేసుకొని భవిష్యత్ కు బంగారు బాటలు వేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి రాంమూర్తి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్య ,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రభాకర్, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ హరీష్, పశువైద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ సురేఖ, ఎంపీడీఓ, జిల్లా నాయకులు బస్వరాజు శంకర్, ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంద ధర్మయ్య, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల వెంకటస్వామి, మండల నాయకులు బందెల బాలకిషన్, గోరిట్యాల లక్ష్మణ్, మహిళ నాయకురాలు మంజుల రెడ్డి,మండల యువత అధ్యక్షులు దూలం శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ రఫీ, ఎస్సి సెల్ అధ్యక్షులు చింతకింది శంకర్, ఉపాధ్యక్షులు గూడ స్వామి వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నాయకులు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

## వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి, ఆగష్టు 09 (జనంసాక్షి):**
అన్నదాతల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని వారి అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నూతన చైర్మెన్ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మార్కెట్ యార్డ్ కమిటీ ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వం ప్రతిష్ఠాకరంగా భావించి మాట్లాడుతూ రూ. 2 లక్షల లోపు రుణాలను మాఫీ చేసిందని, సాంకేతిక కారణాల వలన ఎవరికైనా రాకుంటే వాటిని వెంటనే సవరించే ఏర్పాట్లు చేశామన్నారు. త్వరలోనే రైతు భరోసా కింద పంట పెట్టుబడుల కొరకు ఆర్థిక సహాయాన్ని అందించే ప్రక్రియ కొనసాగుతున్నదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతి కొరకు ప్రజా పాలన అందిస్తున్నదని అన్నారు. మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసు కోవాలన్నారు. మార్కెట్ యార్డ్ ఆదాయ, వ్యయా లపై ఆయన అధికారులతో చర్చించి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. గేట్ ఎంట్రీ, మార్కెట్ యార్డులో ఉద్యోగస్తుల వివరాలు, ప్రతినిత్యం మార్కెట్ కు వచ్చే దాన్యం వివరాలు ,రైతుల విశ్రాంతి కోసం ఏర్పాటు చేసే విశ్రాంతి గదుల సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు సేకరించిన భూ సంబంధిత వివరాల అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించిన ఫైలు వెంటనే తన వద్దకు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వనపర్తి పట్టణ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేట జిల్లాలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

## మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ




**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని నారాయణపేట జిల్లాలో సైనిక్ స్కూల్ ఏర్పాటు ఆవశ్యకతను శుక్రవారం జీరో అవర్‌లో మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తొలి పార్లమెంట్ సమావేశాల్లోనే తమకు మాట్లాడే అవకాశం కల్పించిన డిప్యూటీ స్పీకర్ కు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే నారాయణపేట జిల్లాలోని ఎక్లాస్పూర్ సమీపంలో 50 ఎకరాల్లో ఈ సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం సర్వే ప్రక్రియ పూర్తయిందని, కావున కేంద్ర ప్రభుత్వం సైనిక్ స్కూల్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్‌ను ఆమె కోరారు. సైనిక్ స్కూల్ ఏర్పాటుకు సర్వే ప్రక్రియ పూర్తయిన గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం భూ సేకరణ చేయకుండా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. ఇప్పటివరకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో సైనిక్ స్కూల్ లేదని సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత అవసరం ఎంతైనా ఉందని సభ ద్వారా కేంద్ర రక్షణ శాఖ మంత్రిని ఆమె కోరారు. 2047 వరకు ప్రధాని మోదీ వికసిత్ భరత్ సంకల్పం నెరవేతుందన్న నమ్మకం ఉందనిన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో మహబూబ్ నగర్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మహబూబ్ నగర్ ఎంపీగా నన్ను గెలిపించిన నా పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు, ఎంపీ డీకే అరుణ ధన్యవాదాలు తెలిపారు.

# మెరుగైన వైద్యసేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు
- పటాన్చెరు ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ




**పటాన్చెరు ఆగస్టు9 (జనంసాక్షి)**
పచ్చదనం,పరిశుభ్రత, పారిశుద్ధ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములేనని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు.జీవకోటి మనుగడకు మొక్కలే ఆధారమని, పర్యావరణ సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. సకాలంలో వర్షాలు కురిసేందుకు చెట్లు దోహదపడతాయని, స్వచ్ఛమైన గాలి అందుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని రక్షించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రులను ప్రజలు మన ఆసుపత్రి అని భావించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శుక్రవారం నాడు పటాన్చెరువు ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను మందుల నిలువ గది, రోగుల ఇన్ పేషంట్ వార్డు, ల్యాబ్ తదితర విభగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని వైద్యాధికారికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే కాన్పులు ఎక్కువగా జరిగేటట్లు చూడాలని అన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు అధికంగా వ్యాపించే అవకాశం ఉంది.కాబట్టి వైద్యులు వైద్య సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రజలు రోగాల బారిన పడకుండా ముందస్తుగా వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.

### స్వచ్ఛధనం పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

పారిశుధ్య నిర్వహణ, గ్రీనరీ పెంపు లక్ష్యాలుగా స్వచ్ఛదనం, పచ్చదనం. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డుల పరిధిలో ప్రత్యేక బృందాల ఏర్పాటు చేసి ఆగస్టు 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పటాన్చెరువు మండలం 112,113, డివిజన్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి దేవుజా, తహసీల్దార్ రంగారావు, ఎంపీడీఓ యాదగిరి, జిహెచ్ఎంసి కమిషనర్ సురేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్రీనివాస్, అనిల్ కుమార్, పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# అదివాసుల సంప్రదాయాలను కొనసాగించాలి



## జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**
అదివాసుల సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం ధన్వాడ మండలం కొండాపూర్ గ్రామంలో గల ట్రైబల్ వెల్ఫేర్ అప్ గ్రెడెడ్ పాఠశాల,జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీల దినోత్సవ వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆమెకు ఆ కళాశాల విద్యార్థులు సంప్రదాయ వేషధారణతో, డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భం గా కళాశాలలో ఏర్పాటుచేసిన ఆర్ట్ గ్యాలరీ, మినీ నెట్ బాల్ అకాడమీ ద్వారా విద్యార్థులు సాధించిన విజయాల పట్టికను, గతేడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాల వివరాల జాబితాను కలెక్టర్ పరిశీలించి అభినందించారు. అనంతరం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆదివాసుల దినోత్సవ వేడుకల్లో భాగంగా ముందుగా కొమరం భీం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాను అదిలాబాద్‌లో కలెక్టర్‌గా ఉన్న సమయంలో అదివాసుల దినోత్సవ వేడుకలలో తప్పనిసరిగా పాల్గొని ఘనంగా జరుపుకున్న సందర్భాన్ని గుర్తు చేశారు.చాలా దేశాల్లో ఆదివాసుల సంప్రదాయం కొనసాగుతోందని ఆమె చెప్పారు. ఆదివాసుల సంప్రదాయ నృత్యం,సాంస్కృతిక కార్యక్రమాలను రాబోయే తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఆదివాసులు ఆర్గానిక్ ఉత్పత్తు లను పండిస్తారని, మెడిసినల్ వాల్యూ ఉండే ఉత్పత్తులన్నీ అడవుల్లోనే దొరుకుతాయని తెలిపారు. మనకు నాణ్యమైన తేనె కూడా అడవుల్లోనే దొరుకుతుందని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం,గిరిజన సంక్షేమ శాఖ తరపున ఆదివాసుల సంక్షేమానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందన్నారు. అనంతరం ఆ పాఠశాల కళాశాల విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఆదివాసుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ కళాశాల విద్యార్థులు ఆదివాసుల వేషధరణలతో చేసిన కాంతారా సినిమా నృత్యం కలెక్టర్ తో పాటు అక్కడున్నవారందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ గరీమా నరులతో కలిసి ఆ కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు.ఈ కార్యక్రమం లో ఆ కళాశాల ప్రిన్సిపల్ రాజారాం,మిషన్ భగీరథ ఈ ఈ వెంకటరెడ్డి, ఎంపీడీవో సాయి ప్రకాష్, తహసిల్దార్ సునీత, పంచాయతీ కార్యదర్శి, ఆ పాఠశాల, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్న కాంగ్రెస్



## బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**
ప్రజా పాలన పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీఎస్పీ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం మరికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ,ఎన్నికల సమయంలో తప్పుడు వాగ్దానాలు చేసి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేటికీ కనీస హామీలైన గృహజ్యోతి పథకం ఇండ్లు,ఒంటరి మహిళలకు రెండు వేల రూపాయలు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వకుండా మోసం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా పేదలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సొంత కాంట్రాక్టుల మీద ఉన్న ధ్యాస ప్రజా సమస్యలపై లేదన్నారు. ప్రజా పాలన పేరుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పాలన అత్యంత అధ్వాన్నంగా తయారయి ంది, తక్షణమే ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే కేసిఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మక్తల్ నియోజకవర్గ అధ్యక్షులు పాలెం వెంకటయ్య, బీఎస్పీ నాయకులు కృష్ణ, అజయ్ కుమార్, వెంకటేష్ తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు




# స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ ప్రతినిధి, ఆగష్టు 9 (జనం సాక్షి):**
స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లా యంత్రాంగానికి సూచనలు ఇచ్చారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం స్థానిక ఎన్నికల సన్నద్ధంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం నిబంధనలను తప్పకుండా పాటిస్తూ సన్నద్ధం కావాలన్నారు. నూతన వార్డుల ఏర్పాటు, వార్డుల విభజన, జనాభా, లింగ నిష్పత్తి ప్రాతిపదికన రికార్డు చేయాలన్నారు. రిజర్వేషన్ల అంశం ప్రభుత్వ పరిధిలో ఉన్నందున తదుపరి ప్రభుత్వ ఆదేశాలు వచ్చేంతవరకు గ్రామా, మండల స్థాయిలో సమాచారాన్ని క్రోడీకరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లాలోని అన్ని మండలాల ఎంపీఓలు, ఎంపీడీవోలు, ఆపరేటర్లు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మానవాళి మనుగడకు చెట్లు ఎంతో అవసరం

**జోన్-7 జోగులాంబ డిఐజి ఎల్ఎస్. చౌహాన్**

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
భవిష్యత్‌లో మానవాళి మనుగకు చెట్లు ఎంతో అవసరమని జోన్-7 జోగులాంబ డిఐజి ఎల్ఎస్.చౌహాన్ అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జడ్చర్లలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం ఆవరణలో జిల్లా ఎస్పీ డి. జానకితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ భవిష్యత్తులో మానవాళి మనుగడకు చెట్లు ఎంతో దోహదపడతాయని చెట్లు అంతరించిపోతే భవిష్యత్తు తరాల మనుగడ చాలా కష్టంగా ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని నాటిన ప్రతి మొక్కని సంరక్షించాలని ఆయన సూచించారు. అనంతరం మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ చెట్లు ఉంటే వర్షాలతో పాటు మానవాళికి కావాల్సిన ప్రాణ వాయువును అందజేస్తాయన్నారు. ఈ కార్య క్రమంలో అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డిఎస్‌పి వెంకటేశ్వర్లు, డిసిర్బ్ డీఎస్పీ రమణా రెడ్డి, పాల్గొన్నారు.

# తండావాసుల రక్షణకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు

- ప్రతి ఒక్కరూ చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్ బాబు



**బిజినపల్లి ఆగస్టు 9 (జనం సాక్షి)**
తండాలలో మార్మూల గ్రామాలలో నివసించే ప్రజల రక్షణ కొరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా అటవీ సమీపంలో నివసించే గిరిజనుల పైన అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్ బాబు అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ సంస్థ అధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని గంగారం పెద్దతండలో చట్టాల పైన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా చెంచులకు సంబంధించిన వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ తాండ చుట్టుపక్కల అటవీ ప్రాంతాలు ఉండటం వల్ల చిరుతపులులు సంచరించి పశువులను గొర్రెలను చాలాసార్లు చిరుతలు దాడి చేశాయని దానికి సంబంధించి సంరక్షణ చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వపరంగా వారికి నష్టపరిహారం ఇప్పించాలని తండాలలో నివసించేవారు పూర్తిగా నిరుపేదలేనని వారికి ఇండ్ల స్థలాలు ఇప్పించాలని అదేవిధంగా వారి ఆరోగ్యం పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజలు చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలని చిన్నచిన్న కేసు తగాదాలు ఏమైనా ఉంటే కోర్టు ఆధీనంలో రాజీ కుదుర్చుకోవాలని కోరారు. తండాలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అంతకముందు పచ్చదనం స్వచ్ఛందనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జడ్జి సబితా. డిప్యూటీ డీఎంహెచ్వో వెంకట దాస్, సర్కిల్ ఇన్స్పెక్టర్ కనకయ్య గౌడ్, తాసిల్దార్ శ్రీరాములు, న్యాయవాదులు మధుసూదన్ రావు, శ్యాం ప్రసాద్ రావు, రామచందర్, శ్రీరామ్ ఆర్య, ఎస్సై నాగ శేఖర రెడ్డి, వైద్య బృందం, తాండావాసులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 34 లక్షల మొక్కలు నాటుతాం

**తూప్రాన్ ఆగస్టు 9( జనం సాక్షి):**
ఈ సంవత్సరంజిల్లాలో 34 లక్షల మొక్కలు నాటే లక్ష్యం ఉండగా ఇప్పటికే 80 శాతం మొక్కలు నాటడం పూర్తయిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. వన మహోత్సవంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రజలే తీసుకోవాలని ఇది నిరంతర ప్రక్రియ అని ఆయన అన్నారు. శుక్రవారం తూప్రాన్ మండలంలోని ఇస్లాంపూర్, మల్కాపూర్ తూప్రాన్ మున్సిపల్ పరిధిలో నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో అయనపాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రజలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాలమేరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో నేడు వన మహోత్సవం నిర్వహిస్తున్నందున జిల్లా వ్యాప్తంగా ఈరోజు రెండు లక్షలు మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. జిల్లా లోని అన్ని గ్రామాలలో, మున్సిపాలిటీలలో




స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం పై ప్రజలకు అవగాహనా కల్పించడం జరిగిందని తెలిపారు. అదేవిదంగా గ్రామాలలో ప్రజలు మొక్కలు నాటడమే కాకుండా పరిరక్షణ చేపట్టాలని కోరారు. అదే విదంగా స్వచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ ఏడాది వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 34లక్షలు మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ తమ ఇంటి దగ్గర పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని అన్నారు. నీరు నిల్వవుంచే ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుద్ధి చేసి దోమలు ఈగలు రాకుండా చూడాలన్నారు. వర్షాకాలంలో అనేక రకాల వ్యాధులు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, వంటి విష జ్వరాలు రాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఆర్డిఏ అధికారి శ్రీనివాసరావు ,జిల్లా అటవీ అధికారి జాజి డిఇఓ రాధా కిషన్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డివిజనల్ ఫారెస్ట్ అధికారి మోహన్ అడివి జయచంద్ర రెడ్డి తాసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో శేషాద్రి, ఇస్లాంపూర్ గ్రామ సెక్రెటరీ కల్పన, ఫారెస్ట్ అధికారులు చంద్రశేఖర్, ఓం ప్రకాష్, విజయ్ కుమార్, చిరంజీవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తూప్రాన్ మున్సిపల్ అధికారులు కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## పచ్చదనం పరిశుభ్రత పాటించండి

**పెబ్బేరు ఆగస్టు 9 (జనం సాక్షి)**
పెబ్బేరు మున్సిపల్ పరిధిలో పచ్చదనం పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణ శ్రీ సాయినాథ్ కోరారు. శుక్రవారం స్వచ్ఛదనం పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం మొదటగా వనమహొత్సవంలో భాగంగా 12వ వార్డు



జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. వాటిని సంరక్షించే బాధ్యత విద్యార్థులు ఉపద్యాయులు తీసుకోవాలన్నారు విద్యార్థులతో కలిసి పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి మున్సిపల్ కమిషనర్ కె ఆదిశేషు, వార్డు కౌన్సిలర్స్ మేకల సుమతి ఎల్లయ్య, పార్వతి మహేందర్ గౌడ్ మున్సిపల్ , మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ మీరాజ్ అహ్మద్ , జయరాములు వర్డ్ ఆఫీసర్లు శిరీష, రాములమ్మ, రుక్మిణీ, బాలీశ్వరమ్మ, ఉమావతి, సునీత, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యోగేష్ కుమార్ పాల్గొన్నారు.





# వర్షాకాలం!



– అపర్ణ తోట

కాలమ్ రాయాలి! రాద్దామని కూర్చుంటే అన్ని పెద్ద పెద్ద ఆలోచనలు. ఏం రాయాలా అని ఆలోచిస్తూ స్నేహితురాళ్ళ గుంపులో సలహాలు అడిగాను. వర్షం గురించి రాయమని రెస్పాన్స్. మొదలు పెట్టేశా. మిగిలిన వారు మాట్లాడేలోగా లాప్టాప్ కీబోర్డ్ మీద నా వేళ్ళు చకచకలాడాయి.వర్షాకాలం! బద్ధకపు నిద్ర, దుప్పటిలోకి దూరి వర్షపు చప్పుడు వినడం ఎంత బావుంటుంది!. పక్కనే ఇష్టమైన వెచ్చనైన తను. అప్పుడప్పుడు తగులుతూ, మన అదృష్టానికి మనమే అసూయపడుతూ? వర్షం. పిల్లల కేరింతలు, గ్రౌండ్ ఫ్లోర్ నుండి వినబడే అర్ధం లేని కేకలు. అక్కడక్కడా కాగితపు పడవలు. ఎదురొచ్చే బాల్యం. చల్లటి గాలి. వేడి వేడి కాఫీ. కొన్ని కబుర్లు. బేకరీ నుండి ఆహ్లాదపరిచే వాసనలు. వర్షం పడగానే మీకు ఏం గుర్తుకు వస్తుంది అని అడిగాను ఒక ట్రైనింగ్ సెషన్ లో. మగవారు, అల్లం చాయ్, బజ్జీలు, వేడి బ్రాందీ అని చెప్పారు. ఆడవారంతా ఒకే మాట చెప్పారు– బయట ఆరుతున్న బట్టలు. సఫాయి కర్మచారుల నుండి కార్పొరేట్ వనితల వరకు ఒకటే సమాధానం. వర్షం. తడారని బట్టలు, పనికి రాలేని పనిమనుషులు. ఇల్లంతా రొచ్చు, బాత్రూం తడి ఆరదు. కానీ బజ్జీలు తినొచ్చు. మరి బజ్జీలు చేసేది ఎవరు? తడి ఆరని బట్టలు. ఒకానొక ఇంట్లో అందరు టీవీ చూస్తున్నారు. ఉన్నట్టుండి వర్షం మొదలైంది. పెద్దావిడ హడావిడిగా లేచి పరిగెత్తింది. అవును, బట్టలు తీద్దామని. కాలు జారి పడిరది. తుంటి ఎముక విరిగింది. హాస్పిటల్, ఖర్చులు పోగా మిగిలినవి తిట్లు. ఎందుకా తాపత్రయం. ఎండిన బట్టలు తడిస్తే ఏమి అని. శతాబ్దాలు నాయనా! శతాబ్దాలుగా వర్షం పడగానే బట్టల గురించి ఆలోచించే జీవులం. ఎలా పోతుంది తాపత్రయం. మాకు ఆస్తులా, అవసరాలా? ఇటువంటి తాపత్రయాలు పై బతికిన ప్రజలం కదా. వదిలించుకోవడం కష్టం.ఇదంతా రాసి మళ్లీ ఫోన్ తెరచి చూస్తే బోల్డన్ని మాటలున్నాయి మా స్నేహితురాళ్ళ సమూహంలో. ముందు వాటినన్నిటిని పొందుపరచి వ్యాసంగా రాద్దామనుకున్నాను. కానీ వారి గొంతుకలతోటే చెప్పడం సమంజసమనిపించింది.“ఈ సన్నివేశం నా మనసులో ముద్రించుకు పోయింది. ఒక మనిషి తన భార్యను చాచి పెట్టి చెంప మీద ఒక్కటి కొట్టాడు తన చొక్కా ఆరలేదని. వారి దగ్గర ఇస్త్రీ పెట్టె లేదు. అతను చొక్కా వేసుకునే సమయానికి ఆ చొక్కా ఆరలేదు. వర్షం తెరిపి లేకుండా పడుతోంది.”“పెళ్లికి ముందు వరకు వర్షంలో కావాలని తడిచి డాన్స్ చేస్తూ ఎంజాయ్ చేసేదాన్ని. ఇంటిలో ఉన్నా సరే, బయటకు రావలసిందే. ఇంటికి రాగానే వేడి వేడి నీళ్లతో తల స్నానం చేసేదాన్ని. కానీ వీడు పుట్టాక తడవడం మానేశా. జలుబు, జ్వరం రాకూడదని. కానీ ఇప్పటికీ బాల్కనీలో నుంచుని చేతులు బయటకు పెట్టి, చినుకులతో ఆడుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ ఉంటా.” “వర్షం వలన ఎంత లాభం ఉంటుందో అంత కష్టం ఉంటుంది. పట్టణ, నగరాల్లో మహిళలకు ఒక రకమైన కష్టాలు ఉంటే, గ్రామీణ మహిళలకు వేరే కష్టాలు ఉంటాయి. నగర మహిళలు ఆఫీసుకు సమయానికి చేరలేక పోవడం, బాస్‌లతో లేదా హయ్యర్ అఫీషియల్స్‌తో తిట్లు తినడం, లేదా రకరకాల ఇన్ఫెక్షన్స్‌కి గురై ఆరోగ్యం పాడవడం, ఇంట్లో బట్టలారక పోవడం, పదేపదే కరెంటు పోవడం వలన వంట సరిగ్గా కాకపోవడము? ఇవి! ఇక వలస వచ్చిన మహిళలకు చెప్పలేనంత కష్టం. బస్తీల్లో బతకడమే కష్టం. పైగా వర్షం పడినా పడక పోయినా మొగుడెప్పుడూ తాగే ఉంటాడు. కాకపోతే వర్షం లేనప్పుడు కూలి చేసుకుని వచ్చిన డబ్బుతో తాగేవాడు, వర్షం పడ్డప్పుడు కూలి పని దొరకక పెళ్ళాం దాచుకున్న పదో పరకో ఇవ్వమని కొడతాడు. తిండి దొరకని పరిస్థితి. పిల్లలకు పెట్టుకోలేని పరిస్థితి. బస్తీల్లో మామూలుగా ఉండడానికి చోటు కూడా సరిగ్గా ఉండదు. మురుగు నీరు నిలచిపోవడమో, వరదలు రావడమో, పని లేక తిండి దొరకకపోవడమో’.’ “వర్షం వస్తే చిన్నప్పటి స్నేహితురాలు కలిసిన ఫీలింగ్ ఉంటుంది. ఇప్పటికి వాన వస్తే బీచ్‌ని మిస్ అవుతా. వర్షంలో తడిచే సముద్రం అందం ఒక అద్భుతం. మాటలకు, ఏ రంగులకు అందని చిత్రపటం అది.” “డ్రైనేజీ ప్రాబ్లమ్ వలన బస్తీల్లో టాయిలెట్లలో చెత్త చేరి మూసుకుపోతాయి. ఆడవారు చాలా ఇబ్బంది పడతారు, ముఖ్యంగా పీరియడ్స్ లో ఉన్న ఆడవారు. బట్టలు ఆరకపోవడమే కాదు, ఇల్లు కురుస్తుంది. ఆ కురిసే కంతాల కింద గిన్నెలు పెట్టడం, అందులో నీళ్లు నిండగానే పడేయడము, అది కూడా ఆడోళ్ళ పనే. వర్షానికి వాన వాన వెల్లువాయే పాడడము, ఇవన్నీ ఎలైట్ సంతోషాలు, ఎందుకంటే వర్షం వలన వచ్చే ఇబ్బందులు వారు అనుభవించరు, కాబట్టి, వారికి వర్షం బావుంటుంది. దిగువ మధ్యతరగతి, దిగువ తరగతి వాళ్ళ అనుభవాలు పూర్తిగా వేరే.” “ఇది నేను కూడా ఫేస్ చేశా. పెంకుటిల్లు వానాకాలం కురిసేది. మగ్గులు, గిన్నెలు పట్టుకొచ్చి, అమ్మా, నేను ఇంట్లో పెట్టేవాళ్ళం. ఒక్కోసారి మంచాలు, సామాను కూడా జరపవలసి వచ్చేది.”“మా పనమ్మాయి పోయిన రెండు రోజులు రాలేదు. గొడుగు వాళ్ళ ఆయన తీసుకెళ్తున్నాడట. ఈ రోజు కాస్త వర్షం తగ్గిందని వచ్చింది. నా దగ్గర ఉన్న గొడుగు ఇచ్చాను. తనకి నాలాగా వర్క్ ఫ్రమ్ హోమ్ ఫెసిలిటీ లేదు కదా. మనమే చూసుకోవాలి.” “వర్షాకాలంలో పిల్లలకి చాలా ఇన్ఫెక్షన్స్, జ్వరాలు వస్తుంటాయి. ముఖ్యంగా బస్తీలలో పరిస్థితుల వలన. ఈ పిల్లలను చూసుకునేది అమ్మలే. వారి సంపాదనకు గండి పడడమే కాదు, ఖర్చులు పెరుగుతాయి, శ్రమ ఒత్తిడి కూడా పెరుగుతుంది.” “స్కూళ్లలో అంతంత మాత్రంగా ఉన్న టాయిలెట్లు వర్షం పడినప్పుడు ఘోరంగా మారతాయి. కొన్ని టాయిలెట్లలో పైకప్పులు ఉండవు. కౌమార దశలో ఉన్న అమ్మాయిలు, ముఖ్యంగా మెన్సస్‌లో ఉన్న అమ్మాయిలైతే వర్షం పడినప్పుడు అసలు స్కూళ్లకే రారు. ఇవన్నీ లేని సమయాలు కూడా ఉంటాయి. అప్పుడు వర్షాన్ని వాళ్ళు భలే ఎంజాయ్ చేస్తారు..”“వర్షం! వర్షంతో నాకు భలే మంచి జ్ఞాపకాలు ఉన్నాయి. స్కూల్ నుండి ఇంటికి వచ్చేటప్పుడు ఒక కిలోమీటర్ నడిచే వాళ్ళం. ఒకరోజు సాయంత్రం స్కూల్ నుండి వెనకకి వస్తుంటే సగం దారిలో ఏవో తెల్లని రాళ్లు మా మీద పడుతున్నాయి. అవి తెల్లగా ఉన్నాయి. గుండ్రంగా లేవు ? ఏంటో ముదుతలుగా కనబడ్డాయి. అవి మా మీద పడుతున్న కొద్దీ దెబ్బలు తగుల్తున్నాయి. నేను, మా చెల్లి, ఇంకొందరం కలిసి ఒక కొట్టంలోకి పరిగెత్తాము. చెట్ల నుండి రాళ్ళో, కాయలో పడుతున్నాయి అనుకున్నాం. చెట్ల నుండి ఇంత ఘోరంగా రాళ్లు పడుతున్నాయేమిటా అని చూస్తున్నాము. అయితే అవి కాయలు కాదు, వడగళ్ళు అని అర్థం అయింది.”“వర్షాకాలంలో అన్నిటి కన్నా పెద్ద కష్టం ఏంటంటే కట్టెలు దొరకవు. దొరికినా అవి పచ్చిగానే ఉండేవి. గ్యాస్ నూనె పోసి మండిద్దామన్నా వెలగవు. వర్షపు గాలి, పై నుండి కారే వర్షపు నీరు, పచ్చి కట్టలు! వంట చేయడం ఎంత కష్టమయ్యేదో? మళ్ళీ ఈ కట్టెలు కూడా ఆడవాళ్లమే తెచ్చుకోవాలి. అప్పట్లో ఎనిమిదేళ్లు కూడా లేవు నాకు, అంత చిన్న పిల్లని అయినా నేనే తెచ్చేదాన్ని. కొంతకాలానికి అప్డేట్ అయ్యాము. మా నాన్న పొట్టు పొయ్యి తెచ్చాడు. ఇది కాస్త నయం అనిపించినా, పొట్టు పొయ్యిలో పొట్టు తడిస్తే అంటుకోవడానికి చాలా టైం పడుతుంది.”“వర్షాకాలంలో పల్లెటూరిలో మనమేం నాటకపోయినా బోల్డన్ని మొక్కలు, పాదులు మొలుస్తాయి. సొరకాయ, బీరకాయ, చిక్కుడుకాయ, గోంగూర ఎక్కడపడితే అక్కడ దొరికేవి. ఆనపకాయ కాసింది, కూరొండుకుంటావా పిల్లలకి అని వేరేవాళ్లు మాకిస్తే, మేము కూడా మాకు ఏమన్నా కాస్తే వాళ్ళకి ఇచ్చేది. వర్షాకాలంలో పుష్కలంగా కూరగాయలు ఇచ్చిపుచ్చుకోవడం ఉండేది. పెంట కుప్పల మీద కూడా మొక్కలు మొలిచేవి. చిన్న చిన్న ఇళ్లైనా ఇంటి చుట్టూ చాలా జాగా ఉండేది. చాలా మంది మొక్కలు నాటే వాళ్ళు. సీసనల్ ఫుడ్ బాగా తినేవాళ్ళం. పాడి కూడా ఆరోగ్యంగా ఉండేవి. పాలు పెరుగు తక్కువ ఖరీదుకే దొరికేవి. చాలా మంచి తిండి తినేవాళ్ళం.”“ఇప్పుడిదంతా ఎక్కడలే! రియల్ ఎస్టేట్ వాళ్ళు రావడం, భూమిలో సారం ఇగిరిపోవడం. నదులు చిన్నవైపోయాయి, తవ్వకాలు పెరుగుతున్నాయి, కెమికల్స్ లేకుండా కూరగాయలు పండడం కష్టం. ఆహారధాన్యాల కన్నా కమర్షియల్ పంటల మీదే ధ్యాసంతా. అప్పులైనా పర్లేదు. ఆడవారికి సరైన పోషణ లేకపోయినా పర్లేదు. “ఏంటోనమ్మ, వర్షానికి కూడా ఫెమినిజంతో సంబంధం కలుపుతారు!!

# సీజనల్ వ్యాధుల నియంత్రణకే స్వచ్ఛదనం..పచ్చదనం

- ప్రతి ఇంటి పరిసరాలు స్వచ్ఛంగా..పచ్చగా ఉండాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 9 (జనంసాక్షి):** ప్రతి ఇంటి పరిసరాలు స్వచ్ఛంగా.. పచ్చగా ఉండాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకే స్వచ్ఛదనం..పచ్చదన మనీ ,ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు నిచ్చారు.స్వచదనం.. పచ్చదనంలో భాగంగా శుక్రవారం చివరి రోజు వన మహోత్సవాన్ని వేములవాడ అర్బన్ మండలంలోని మారుపాకలో నిర్వహించగా, ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,డీఎఫ్ఓ బాలమణి హాజరై మొక్కలు నాటారు.అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు, స్వచదనం.. పచ్చదనం పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని మొదలు పెట్టిందని అయన గుర్తు చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని మొత్తం 255 గ్రామాలు, 2 మున్సిపాలిటీల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. గ్రామాలు, పట్టణాల్లో నాటిన మొక్కలు సంరక్షించాలని, పచ్చదనం తోనే ఆక్సిజన్ స్థాయి పెరుగుతుంద న్నారు. స్వచదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లాలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నేతృత్వంలో విజయవంతంగా పూర్తి చేశారన్నారు.దీనికి సహకరించిన అన్ని శాఖల అధికారులకు అభినందనలు తెలియజేశారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 2750 మొక్కలు నాటారన్నారు.ఈ కార్యక్రమాల్లో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, డీఎంహెచ్ఓ వసంతరావు,అర్బన్ మహేష్ కుమార్,ఎంపీడీఓ రాజీవ్ మల్హోత్రా, స్థానిక ప్రజా ప్రతినిధులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# యువతకువెన్నెముకగా యూత్‌కాంగ్రెస్

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి
- ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 09 (జనంసాక్షి):** యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... యూత్ కాంగ్రెస్ 1968లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు అనుబంధంగా ఆవిర్భవించిందని కాంగ్రెస్ పార్టీకి యువత వెన్నెముకగా యూత్ కాంగ్రెస్ ద్వారా ఎల్లప్పుడూ ఉంటారని అన్నారు. నాకు కూడా యూత్ కాంగ్రెస్ ద్వారానే గుర్తింపు వచ్చిందని యూత్ కాంగ్రెస్ లో దశాబ్ద కాలంపాటు వివిధ హోదాలలో పని చేశానని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగర కాంగ్రెస్ ఆవరణలో చెట్టు నాటారు. ఈ కార్యక్రమంలో కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, సందీప్, జాఫర్, కృపాసాగర్, శరణ్య గౌడ్, పూర్ణ చందర్, నజీర్, సుమంత్, షబానా మహమ్మద్, జీడి రమేష్, కీర్తి కుమార్, మీరాజ్, షేహెన్షా, అష్రఫ్, మాసుం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

పరారీలో ఒకరు:ఎస్పీ అఖిల్ మహాజన్.



**రాజన్నసిరిసిల్లబ్యూరో(జనంసాక్షి):** గంజాయి విక్రయించేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నామని మరొకరు పరారీలో ఉన్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వారినుంచి 3 కిలోల గంజాయి 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అఖిల్ మహాజన్ వివరాలను వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలానికి చెందిన క్రాంతి అనే వ్యక్తి వివిధ ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించుకుని తాగడానికి అలవాటు పడ్డాడు. తాగడం అమ్మడం చేస్తున్నాడు. ఆదిలాబాద్ జిల్లా రూపవాడ మండలం, గాయిదిగూడ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మాడవి దిగంబర్, తుమ్రం అమృతరావు గంజాయిని అక్రమంగా తీసుకొచ్చి శుక్రవారం రోజున క్రాంతికి అమ్మడానికి తంగళ్ళపల్లి లోని అంబా బాయి టెంపుల్ కు వస్తున్నారన్న సమాచారంతో తంగళ్ళపల్లి పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. అనుమానాస్పదంగా కనిపిస్తున్న వారిని తనిఖీ చేయగా 3 కిలోల గంజాయి దొరకడంతో గంజాయి,2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. క్రాంతి పరారీలో ఉన్నాడని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టుకున్న తంగళ్ళపల్లి ఎస్సై సుధాకర్, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. గంజాయి సేవించినా విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మీడియా సమావేశంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి సంరక్షించడం సామాజిక బాధ్యత

- స్పెషల్ ఆఫీసర్ ఆర్డీవో రమేష్



**తంగళ్ళపల్లి (జనంసాక్షి):**స్వచ్ఛధనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వన మహోత్సవానికి ముఖ్యఅతిథిగా మండల స్పెషల్ ఆఫీసర్, ఆర్డీవో ఎల్. రమేష్ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజల సహకారంతో సుమారు మూడు వందల మొక్కలను నాటడం జరిగిందన్నారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంపై పూర్తిగా అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు, అలాగే గ్రామాలలో జ్వర సర్వే, దోమల నివారణ చర్యలు, గ్రామాల పరిశుభ్రత పై మహిళా సంఘాలను ఈ కార్యక్రమంలో భాగం చేశామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించినప్పుడే మ నుషుల మనుగడకు ముఖ్యమైన ప్రాణవాయువు అందించగలుగుతామని తెలిపారు. స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమం ద్వారా తక్కువ రోజుల్లోనే గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే విధంగా పనులు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీ ఓ మీర్జా అఫ్జల్ అహ్మద్ బేగ్, సూపరండెంటెంట్ రమేష్, ఇన్చార్జి ఏపివో రాజనర్సయ్య, సాంకేతిక సహాయకులు బండి లక్ష్మణ్, సుష్మ, జ్యోతి, దేవి, కవిత మధు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



# బావిలోపడ్డ జాతీయ పక్షి..

**కాపాడిన అటవిశాఖ అధికారి అంజలి**

**ముస్తాబాద్ ఆగస్టు 9 (జనంసాక్షి):** పంట పొలంలో కాలికి దెబ్బతగిలి గాయపడిన జాతీయపక్షి నెమలి బంధనకల్ గ్రామంలోని తుపాకుల రామచంద్రంగౌడ్ రైతు పొలంవద్ద ఉన్న బావిలో నీళ్లల్లో కొట్టుమిట్టాడుతుండడంతో రైతు మనసు చలించి ముస్తాబాద్ జనం సాక్షి రిపోర్టర్ సంప్రదించారు. వెంటనే ఫారెస్ట్ అధికారి ఫోన్ చేయగానే వెంటనే అటవిశాఖ అధికారి అంజలికి సంఘటన స్థలానికి చేరుకొని. స్పందించిన అధికారి హుటాహుటిన బంధనకల్ గ్రామానికి చేరుకొని నెమలి ప్రాణాలు కాపాడారు. ఆజాతీయ పక్షి నెమలి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చిప్పలపెల్లి గ్రామ శివారులోని ఏపుగాఉన్న ఆటవి ప్రాంతంలో వదిలామని మండల అట విశాఖ అధికారి అంజలి తెలిపారు. ఫోన్ చేసి సమాచారం అందించిన రైతును అభినందించిన ఆటవిశాఖ అధికారులు. సమయానికి స్పందించి జాతీయ పక్షిని కాపాడిన అధికారులను స్థానికులు ప్రశంసించారు.

# వరంగల్ ఎంజీఎంలో దారుణం

ఉన్న వ్యక్తులు గమనించి సమాచారాన్ని పోలీసులకు అందజేశారు. అయితే ఆ పసి గుడ్డు ఆడ మగ అని గుర్తుపట్టే స్థితిలో లేదు. అయితే ఈ పసి గుడ్డును కుక్కలు ఎక్కడ నుంచి తీసుకువచ్చాయి అనే వివరాలు పోలీసు లు ఎంజియం అధికారులు సేకరిస్తున్నారు వివిధ సీసీటీవీ ల ద్వారా పరిశీలిస్తున్నారు.. పసి గుడ్డును ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# పార్లమెంటు సమావేశాలప్పుడు అభివృద్ధి కార్యక్రమలా?

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 9 (జనంసాక్షి):** ఒకపక్క పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న క్రమంలో పార్లమెంట్ సభ్యుడికి సమాచారం లేకుండానే వేములవాడ మున్సిపల్ పరిదిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం సరైన పద్ధతి కాదని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఇటీవల కాలంలో జరిగిన పలు అభివృద్ధి కొన్ని కార్యక్రమాలతో పాటు శుక్రవారం జరిగిన కార్యక్రమలలో ప్రోటోకాల్ ప్రకారం పార్లమెంట్ సభ్యునికి సమాచారం ఇవ్వకపోవడం ఈ రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. గత ప్రభుత్వం లాగానే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఒక పక్క పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో స్థానిక ఎంపీ పార్లమెంటులో ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేపడం సరైన పద్ధతి కాదన్నారు.గతంలో వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకోసం అసెంబ్లీ సమావేశాలను సాకుగా చూపి ఎన్నికలను వాయిదా వేయించిన ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో ఇలా పలు కార్యక్రమాలు చేపట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ నిధులతో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీ హాజరైతే రాష్ట్ర,కేంద్ర భాగస్వామ్యంతో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, ఈ రాష్ట్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తున్నామన్నారు.ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వ తీరు మార్చుకుని పార్లమెంట్ పరిధిలో మరియు దక్షిణ కాశి ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ ని ఆహ్వానించి ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పవలసిందిగా ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామనీ ఆయన ప్రకటనలో తెలిపారు.

# ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలి

- అటెండర్ నుండి ఐఎఎస్ వరకు ఆదివాసీలను నియమించాలి
- పోడు భూములకు పట్టాలి ఇవ్వాలి
- ఆదివాసీ నాయకపోడ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్



**ఇబ్రహీంపట్నం(జనంసాక్షి):**ఆదివాసులు అడవితల్లి ముద్దుబిడ్డలు. పచ్చని చెట్లలో జీవిస్తూ , వన్యప్రాణులతో చెలిమి చేస్తూ , అడవుల్లో జీవిస్తారు. ఆదివాసీలు ఈ సమాజానికి మూలవారసులు. భారతదేశానికి అసలు వారసులు. నీతి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం. ప్రాచీన చరిత్రకు, సంస్కృతికి, సాంప్రదాయాలకు, నిరాడంబరతకు నిలువుటద్దం ఈ ఆదివాసీలు.శుక్రవారం ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండి గ్రామంలో కొమురం భీమ్ విగ్రహం వద్ద ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆదివాసీల జిల్లా ఉపాధ్యక్షులు బంక శ్రీనివాస్ పాల్గొని , కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి ఆదివాసీల హక్కుల గురించి మాట్లాడారు. భారతదేశంలో అతి ప్రాచీనమైన మరియు వెనుకబడిన తెగ ఆదివాసీయులు అని , ఏజెన్సీలో ఆదివాసీలను దోపిడీ చేస్తూ ఆదివాసీలపై పెత్తనం చెలాయిస్తున్న గిరిజనేతరులు నేడు ఆదివాసీల రిజర్వేషన్స్ కబ్జా చేయాలని కుట్రలు పన్నుతున్నారని లంబాడీలను తమ జాబితాను చేర్చడం వల్ల ఆదివాసీలకు పెద్ద ఎత్తున నష్టం కలుగుతుందని , ఉద్యోగ నియామకాల్లో తమకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఆదివాసీలు కోరేది ఏమిటి అంటే ఏజెన్సీలో గిరిజనేత రుల ఓటుహక్కు రద్దుచేయాలి.ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలని. ఐటిడిఎలో జరుగు తున్న అవినీతిని అరికట్టాలని, ఐటిడిఎలో అటెండరు నుండి ఐఎయస్ వరకు ఆదివాసీలనే నియమించాలని , ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలు కాపాడి , ఏజెన్సీలో ఆదివాసీలు సాగు చేస్తున్న పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని , అలాగే ఏజెన్సీలో గిరిజనేతరుల పట్టాలు రద్దు చేయాలని డిమాండు చేశారు.ఐక్యరాజ్యసమితి ఆదివాసీల కోసం అంత ర్జాతీయ ఆదివాసీ దినోత్సవం నాడు తీర్మానించిన విధానాలు, లక్ష్యాలు, అభివృద్ధి ఆశయాలు నేడు కాలరాయబడుతున్నాయని ,ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఆదివాసుల సంక్షేమం కొరకు వివిధ పథకాలు ప్రవేశపెట్టాలని , సామాజికంగా రాజకీయ ఎదుగుదలకు అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో కార్యదర్శి మనోజ్ కుమార్ , మాజీ ప్రజా ప్రతినిధులు కల్లెడ గంగాధర్ , దాసరి చిన్న రాజన్న , లక్కడి నర్సవ్వ , నాయకులు నాచుపల్లి రాజ్ కుమార్ , గుర్రాల దశరథ్, దాసరి రాజేందర్ , జిపి సిబ్బంది నీరటి రతన్ , సేర గంగాధర్ , ఫీల్డ్ అసిస్టెంట్ హుజూర్ భాష , సంఘం అధ్యక్షులు చింతూరి భీమలింగం , నాయకులు సీమల శ్రీనివాస్ , సీమల గంగాధర్ , బంక శ్రీకాంత్ , శంకర్ , మహిళలు పాల్గొన్నారు.

# సిసోడియాకు బెయిల్ మంజూరు

ముందు హాజరుకావాలని సిసోడియాను సుప్రీం ఆదేశించింది. సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా సుప్రీం విచారించింది. విచారణ పూర్తయిన అనంతరం కొద్ది రోజుల క్రితం తీర్పును రిజర్వ్ చేసి నేడు వెలువరించింది. ఈ క్రమంలోనే 17 నెలల తర్వాత మనీష్ సిసోడియా బయటకు రానున్నారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ మద్యం విధానం కేసులో బెయిల్ లభించింది. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు సైతం బెయిల్ మంజూరు కావడంతో ఆప్ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. అవినీతి, మనీలాండరింగ్ కేసుల్లో సిసోడియాకు బెయిల్ సుప్రీం బెయిల్ ఇచ్చింది. ఏ నిందితుడిని కాలపరిమితి లేకుండా జైలులో ఉంచలేరని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేసు విచారణలో పురోగతి లేకపోతే... ఒక పరిమితి దాటిన తర్వాత జైలులో ఉంచలేరని పేర్కొంది. అలా కాదు అని... జైలులో ఉంచాలి అనుకుంటే ఆ వ్యక్తి హక్కులు హరించడమేనని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. బెయిల్‌కి అప్లికేషన్ పెట్టుకోవడం, బెయిల్ పొందడం వారి హక్కు అని ధర్మాసనం పేర్కొంది. సిసోదియాకు బెయిల్ ఇవ్వొద్దు అని దర్యాప్తు సంస్థలు చేసిన వాదనలు అన్నింటినీ ధర్మాసనం తోసిపుచ్చింది. విచారణ ఆలస్యం కావడానికి సిసోడియా కూడా కారణమన్న ట్రయల్ కోర్టు ఆదేశాలను సైతం పక్కనబెట్టింది. ఈ విషయంలో ఢిల్లీ హైకోర్టు చేసిన ప్రతికూల వ్యాఖ్యలను కూడా సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. బెయిల్ అనేది నియమమని.. జైలు మినహాయింపు అని ట్రయల్ కోర్టులు, హైకోర్టులు గ్రహించాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ట్రయల్ వేగంగా జరిగేందుకు సిసోడియా సహరించాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. సిసోడియా బెయిల్‌ను ఈడీ, సీబీఐ వ్యతిరేకించాయి. సిసోడియా విచారణకు సహకరించడం లేదని, జాప్యం చేస్తున్నారని, అనవసరపు పత్రాలను తనిఖీ చేయాలని కోరుతున్నారని సుప్రీంకోర్టుకు అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తెలిపారు. సిసోడియాకు బెయిల్ ఇస్తే సాక్ష్యాలను, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని బెయిల్ ఇవ్వొద్దని సుప్రీంకోర్టును దర్యాప్తు సంస్థలు కోరాయి. గతేడాది అక్టోబర్ నుంచి తనపై ఉన్న కేసుల్లో ఎలాంటి పురోగతి లేదని కాబట్టి తనకు బెయిల్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టును సిసోడియా కోరారు. మొత్తానికి ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

## మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యం: పొంగులేటి







రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార ,పౌర సంబంధాలు శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. శుక్రవారం స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మ, ఎస్పీ రోహిత్ రాజ్ తో కలిసి లక్ష్మీదేవి పల్లి మండలం అశోక్ నగర్ కాలనీలో సుమారు కోటి 50 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించనున్న సైడ్ కాలువ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టామని వివరించారు. అనంతరం అటవీశాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ లో పాల్గొన్నారు. చాతకొండ బీట్ లో స్వచ్ఛతనం – పచ్చదనం ముగింపులో భాగంగా జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ వన మహోత్సవ లక్ష్యాలని అందరూ సాధించాలని ఉద్బోధించారు. కొత్తగా పోడు వ్యవసాయం చేపట్టరాదని స్పష్టం చేశారు. పోడు వ్యవసాయం చేసే రైతులకు అటవీ శాఖ అధికారులు జామాయిల్ పెంపకం తదితర పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. అటవీ శాఖ అధికారులు పోడు వ్యవసాయం నిర్వహిస్తున్న గిరిజనులతో స్నేహభావంగా ఉండాలని పేర్కొన్నారు. గత సంవత్సరం గిరిజనుల దాడిలో మరణించిన శ్రీనివాస్ రేంజర్ కుటుంబ సభ్యులకు 500 గజాల ఇంటి స్థలం పట్టాని రెవెన్యూ మంత్రిగా త్వరలో అందజేస్తానని హామీ ఇచ్చారు. పాల్వంచ మండలంలో సుమారు 50 లక్షల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన సింథటిక్ టెన్నిస్ కోర్టును ప్రారంభించారు. సుమారు 70 నుంచి 80 మంది నిత్యం శిక్షణ పొందేలా రూపొందించిన సందర్భంగా మంత్రి క్రీడాకారులతో కలసి టెన్నిస్ ఆడారు. ఖేలో ఇండియా లో భాగంగా ఆర్చరీ శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. క్రీడాకారులతో మాట్లాడుతూ శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని, క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం క్రీడా ప్రాంగణంలోమొక్కను నాటారు.జిల్లా ఐ డి ఓ సి కార్యాలయ ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ( మెప్మా) ద్వారా గ్రూప్ యాక్టివిటీ కింద ఓం సాయిరాం మహిళా సంఘం, వినాయక పేద ప్రాంత సమాఖ్య, భరతమాత పట్టణ సమాఖ్య కొత్తగూడెం మున్సిపాలిటీ వారు 6,00,000 రూపాయల బ్యాంకు రుణ సహాయంతో ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంతో పాటు వారికి ఋణ సదుపాయాలు అందించి వివిద ఆదాయ మార్గాలు పెంపొందించే ప్రణాళికలను సిద్ధం చేయడం జరిగిందనీ చెప్పారు. మహిళా సాధికారతను సాధించుటకు రాబోయే 5 సంవత్సరాలలో చిరు వ్యాపారాలను ప్రోత్సహిస్తూ సంఘ సభ్యులకు పనిలో శిక్షణ, నైపుణ్యం, ప్యాకింగ్ , బ్రాండింగ్, మార్కెటింగ్ కల్పించడం ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్స్ ను నెలకొల్పడం మిని ఇండస్ట్రియల్ పార్క్, వడ్డీ రుణాలు, లోన్స్, మరియు యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేయుట ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం జరుగుతుందని వివరించారు.. గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఉద్దేశంతో వారికి కావాల్సిన ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. కొత్తగూడెం లో మొత్తం 5 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు..అందులో భాగంగా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో మొదటి క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ రకాల ఆహార పదార్థాలతో క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు,. మహిళా శక్తి క్యాంటీన్‌లలో ఆహారం అమ్మ చేతి వంటలా ఉండాలన్నారు. నాణ్యతకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డి ఆర్ డి ఓ విద్యా చందన, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మరియు పాల్వంచ మున్సిపల్ కమిషనర్లు, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి,జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు, మెప్మా డీఎంసీ రాజేష్, మహిళా సంఘ సభ్యులు, క్రీడాకారులు మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- జిల్లా అధికారులతో సమీక్ష
- జిల్లా కలెక్టరు హనుమంత్ కే.జెండగే

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ఆగస్టు 9 (జనంసాక్షి)**
వచ్చే ఆగస్టు 15 న భువనగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ లో నిర్వహించబోయే భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై శుక్రవారం నాడు ఆయన జిల్లా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు.పోలీస్ గౌరవ వందన స్వీకరణ, బందోబస్తు ఏర్పాట్లను నిర్వహించాలని, స్టేజ్, సీటింగ్, పి.ఎ.సిస్టమ్, త్రాగునీరు, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, గౌరవ ముఖ్య అతిథి ప్రసంగం రూపొందించాలని, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, ఎన్.సి.సి. క్యాడెట్ మార్చ్ ఫాస్ట్ ఏర్పాట్లు, గ్రౌండ్ లో మెడికల్ టీమ్ తో ఎమర్జెన్సీ సేవలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్తమ సేవలందించే ఉద్యోగులను గుర్తించి ఉత్తమ సేవా ప్రశంసా పత్రాల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరు గ్యారెంటీల పథకాలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తెలియచేసే శకటాల ఏర్పాట్లు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ఆస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించాలని ఆదేశించారు. జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు నిర్వహించే ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో ప్రోటోకాల్ నిబంధనలను జిల్లా అధికారులు ఖచ్చితంగా పాటించాలని ఈ సందర్భంగా ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు పి.బెన్ షాలోమ్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, కలెక్టరేటు పరిపాలన అధికారి జగన్మోహన్ ప్రసాద్, పోలీసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

## కోదాడ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి



**కోదాడ,జనంసాక్షి:**
ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు.శుక్రవారం అనంతగిరి మండల పరిధిలోని బొజ్జగూడెంతండాలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయం విగ్రహ ప్రతిష్ట,ధ్వజస్తంభ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిని ఘనంగా సన్మానించారు.దేవాలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్స్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి,కొండపల్లి వాసు,బుర్రా పుల్లారెడ్డి,దేగ కొండయ్య, ధరావత్ సైదులు,మాజీ ఎంపీపీ ధరావత్ రామా,బాబు నాయక్,ఈదుల కృష్ణయ్య,కృష్ణా నాయక్,గునుగుంట్ల స్వరూప,ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆదివాసి దినోత్సవం..

## కొమ్ము నృత్యాలలో అలరించిన గిరిజనులు

- గిరిజనుల సంక్షేమం కోసం కృషి చేస్తా
- ఎమ్మెల్యే వెంకటరావు
- గిరిజనుల అభివృద్ధి కొరకు ఐటీడీఏ కృషి చేస్తుంది
- ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్



**భద్రాచలం ఆగస్టు 9 (జనంసాక్షి):**
పట్టణంలోని ఆదివాసి దినోత్సవం ఐటిడిఎ పిఓ బి.రాహుల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకటరావు,జిల్లా కలెక్టర్ జితేష్.వి, పటేల్, ఎస్పీ, బి.రోహిత్ రాజ్, భద్రాచలం ఆర్డిఓ, ప్రభుత్వ అధికారులు, గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ సెంటర్లో ఉన్న ఆదివాసీ అమరవీరుల విగ్రహాలకు పూలమాలలు వేసినివాళులర్పించారు. అనంతరం గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కొమ్ము నృత్యాలతో, డప్పు వాయిద్యాలతో పట్టణంలోనీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరావుతో పాటు జిల్లా కలెక్టర్, ఐ టి డి పి ఓ గిరిజనులతో కలిసి కొమ్ము నృత్యాలలో పాల్గొని అలరించారు. అనంతరం ఆదివాసి గిరిజన భవనంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ. గిరిజన కుటుంబీకులందరికి ఆదివాసి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనుల అభివృద్ధి, ఉన్నత విద్యతోనే సాధ్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా గిరిజనులకు అనేక సంక్షేమాలు ఏర్పాటు చేస్తుందని అన్నారు. గిరిజన అభివృద్ధి కొరకు తాను ఎప్పటికీ కట్టుబడి ఉంటానని అన్నారు. గిరిజనుల అభివృద్ధి కొరకు కృషి చేస్తాననీ అన్నారు. జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ జితేష్.వి.పటేల్, ఐటిడిఏ పిఓ బి.రాహుల్ మాట్లాడుతూ, గిరిజనుల సంక్షేమం కొరకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గిరిజన విద్యార్థుల చదువు కొరకు ఐటిడిఏ ప్రత్యేక నిధులు కేటాయిస్తుందన్నారు. విద్యతో పాటు క్రీడారంగంలో కూడా గిరిజనులు రాణించాలని, వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు ఐ.టి.డి.ఏ చేస్తుందని అన్నారు. గిరిజనుల ఉపాధి కొరకు ఐటిడిఏ ప్రత్యేకం నిధులు మంజూరు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు పూనం కృష్ణ దొర, ముర్ల రమేష్, పాయం రవి వర్మ, గుండు శరత్, కుంజ ధర్మ, రమాదేవి, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



# శాలిగౌరారం ప్రాజెక్టుకు చామల యాదగిరిరెడ్డి పేరు పెట్టాలి

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతి..

**శాలిగౌరారం ఆగస్టు 09 జనంసాక్షి:**
జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు కు ప్రముఖ గాందేయవాది,స్వాతంత్ర్య సమరయోధులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత,స్వర్గీయ చామల యాదగిరి రెడ్డి పేరు పెట్టాలని పలువురు రైతులు, నాయకులు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.నల్గొండ జిల్లా శాలిగౌరారం నకు చెందిన చామల యాదగిరి రెడ్డి శాలిగౌరారం ప్రాజెక్టు అభివృద్ధికి ఎంతో కృషి చేశాడాని, ఈ ప్రాజెక్టు తో నేడు వేలాది భూములు సస్యశ్యామలం అవుతున్నాయని పేర్కొన్నారు. యాదగిరి రెడ్డి చివరి శ్వాస వరకు ప్రాజెక్టులోకి నీరు తీసుకరావడానికి తాపత్రయ పడిన మహనీయుడన్నారు. శాలిగౌరారం మండల అభివృద్ధి కొరకు, మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయ నిర్మాణాల కొరకు, వ్యవసాయ మార్కెట్ స్థాపన కొరకు, విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు కు అవిరాల కృషి చేశాడాని అందుకే అయన జ్ఞాపకార్థం ప్రాజెక్టు కు పేరు పెట్టాలని కోరారు. ప్రాజెక్టు కట్ట మీద యాదగిరి రెడ్డి విగ్రహాన్ని కూడా ప్రతిష్టించాలని కోరారు.ప్రెస్ అకాడమీ రాష్ట్ర ఛైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి కూడా చామల యాదగిరి రెడ్డి గురుంచి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ట్రస్ట్ కన్వీనర్ %వీఎ% గోనారెడ్డి,చామల వెంకటరమణా రెడ్డి, గూని వెంకటయ్య, పడాల రమేష్, లోడంగి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం సంబరాలు

**దమ్మపేట ఆగస్టు 9 (జనం సాక్షి):**
దమ్మపేట మండలంలో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం మండలంలోనీ అన్ని ఆదివాసి గ్రామాల నుండి మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం నిర్వహించారు.కీర్తిశేషులు కొమరం భీమ్, సోయం గంగులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి జెండా ఆవిష్కరణ చేశారు.ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా సెలవు ప్రకటించి,ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని మాజీ ఎమ్ ఎల్ఏలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమం విద్యాశాఖ అధికారి కీసర లక్ష్మి,ఆదివాసి నాయకులు తెల్లం రామారావు, కుంజా చినబాబు, సోయం ప్రసాద్,బండారు సూర్యనారాయణ,వెంకన్న బాబు, సోయం వీరభద్రం,కారం శ్రీరాములు,వాడే వీరాస్వామి,కాక రమేష్,కొమరం కృష్ణ, మెచ్చు వెంకటేశ్వర్లు,కారం రాందాసు,కొరసా సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన రైతులందరి రుణాలు మాఫీ చేస్తాం



- రైతులు ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలి
- పంట పండించే రైతుకే రైతు భరోసానిధులు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి

**కోదాడ టౌన్ ఆగస్టు 09 (జనంసాక్షి):**
రైతులు వరి పంట కంటే ఎక్కువ ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటలు పండించడానికి మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల. నాగేశ్వరరావు అన్నారు.శుక్రవారం కోదాడ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి తో కలిసి రైతులతో సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా రైతు రుణమాఫీ,రైతు భరోసా,వరి పంటకు బోనస్ ఇతర ప్రభుత్వ పథకాలకు సంబంధించి రైతుల నుండి సలహాలు,సూచనలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతు భరోసా నిధులు నిజంగా పంట పండించే రైతుకు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని గత ప్రభుత్వం చేసిన తప్పులు తమ ప్రభుత్వం చేయదన్నారు.ఇంకా నాలుగు జిల్లాల్లో రైతుల నుండి అభిప్రాయాల సేకరణ జరుగుతుందని ఆ వెంటనే రైతులందరికీ ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తామన్నారు.మూడో విడత రుణమాఫీ నిధులు ఆగస్టు 15న విడుదల చేస్తామని ఇంకా అర్హత కలిగి రుణమాఫీ కానీ రైతుల జాబితాను సేకరించి తప్పులను సరిచేసి 15 తర్వాత అందరి రుణాలు మాఫీ చేస్తామని తెలిపారు.ఈ సీజన్ నుంచే సన్న వడ్లకు 500 రూపాయలు బోనస్ ఇస్తామన్నారు. అదేవిధంగా రైతులు అధిక మోతాదులో యూరియా,పురుగు మందుల వాడకం తగ్గించాలన్నారు.పామాయిల్ తోట సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి 55వేల రూపాయలు సబ్సిడీని అందజేస్తున్నామని రైతులందరూ ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ సమావేశంలో పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి,ఎర్నేని బాబు,ఆర్డీవో సూర్యనారాయణ,వ్యవసాయ అధికారి రజిని,ఇర్ల. సీతారాం రెడ్డి,బచ్చు.అశోక్,ముస్తఫా,బాగ్దాద్, శేషు,శమి,శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు రుణమాఫీ ఒక గొప్ప కానుక

## ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

## బేతంపూడి సొసైటీలో రుణమాఫీ చెక్కులు పంపిణీ

**టేకులపల్లి, ఆగస్టు 9 (జనం సాక్షి):**
ప్రజలకు ఇచ్చిన హామీలను 6 గ్యారంటీ పథకాలతో పాటు రైతుల వ్యవసాయ రుణాలను రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీని చేయడం రైతులకు ఒక గొప్ప కానుక లాంటిదని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.టేకులపల్లి మండల కేంద్రంలోని బేతంపూడి సహకార పరపతి సంఘం కార్యాలయంలో డిసిసిబి డైరెక్టర్, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు అధ్యక్షతన శుక్రవారం రైతుల రుణమాఫీ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, ఇందిరాగాంధీ పరిపాలన నాటి నుండి నేటి సీఎం రేవంత్ రెడ్డి వరకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు రైతుకి అండగనే ఉన్నదన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఏకకాలంలో లక్ష రూపాయలు రుణమాఫీ ని చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతిగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భారతదేశంలో ఎక్కడ లేని విధంగా రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేయడం కూడా కాంగ్రెస్ ప్రభుత్వ ఘనతేనన్నారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసినప్పటికీ, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం బడ్జెట్ లావాదేవీలలో సమస్యలు ఉన్నప్పటికీ ఆరు గ్యారెంటీలతోపాటు రైతులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని 2 లక్షల వరకు రుణమాఫీ చేశారు. పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్ సహాయ సహకారాలతో బేతంపూడి సొసైటీలో రైతులకు ఎక్కువ రుణాలను ఇవ్వగలిగామన్నారు.సొసైటీ ద్వారా ఎరువులు, పురుగు మందులు మార్కెట్ చేయడం వల్ల ఆరు కోట్ల రూపాయల వ్యాపారం జరిగిందని, మండలంలో పిఎసిఎస్ కు గోడౌన్ నిర్మించడానికి 20 లక్షలు మంజూరయ్యాయని,భవన నిర్మాణానికి కావాల్సిన భూమిని సమకూర్చాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని నీరుడు అన్నపూర్ణ, పిఎసిఎస్ డైరెక్టర్లు లక్కినేని శ్యామ్, ఉల్లోజు ఉదయ్,బాలాజీ, సొసైటీ సీఈఓ ప్రేమాచారి, బ్యాంక్ మేనేజర్,పిఎసిఎస్ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# ‘ట్రాజోడోన్’ టాబ్లెట్‌కు అమెరికా ఫుడ్, డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఆమోదం

- ఇది డిప్రెసివ్ డిజార్డర్ కు ఉపయోగం

హైదరాబాద్, ఆగస్టు 2024: పెద్దవారిలో మేజర్ డిప్రెసివ్ డిజార్డర్ చికిత్స కోసం ఉపయోగించే ‘ట్రాజోడోన్’ టాబ్లెట్‌కు అమెరికా ఫుడ్, డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ ఎఫ్డీఏ) ఆమోదం లభించిందని గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి తెలిపారు. ఈ ట్రాజోడోన్ హైడ్రోక్లోరైడ్ టాబ్లెట్ యూఎస్పీ 50 ఎంజీ, ఎంజీ, ఎంజీ, 300 ఎంజీ కలవన్నారు. ఇది ప్రాగ్మా ఫార్మాస్యూటికల్స్ ఎల్ఎల్పీ రిఫరెన్స్ లిస్టెడ్ డ్రగ్ అన్నారు. దరఖాస్తు చేసిన పది నెలల్లోనే అనుమతి లభించిందన్నారు. ఇది మా బలమైన ఆర్%డ%డీ సామర్థ్యాలకు నిదర్శనమన్నారు. ఈ త్రైమాసికంలో ఉత్పత్తి ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. రాబోయే త్రైమాసికాలలో మార్కెట్ వాటా స్థిరంగా పెరుగుతుందన్నారు. గ్రాన్యూల్స్ ఇప్పుడు అమెరికా ఫుడ్, డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ ఎఫ్డీఏ) నుంచి 65 ఏఎన్డీఏ ఆమోదాలు (64 తుది ఆమోదాలు,1 తాత్కాలిక ఆమోదం) కలిగి ఉన్నామన్నారు. ఎంఏటీ జూన్ 2024, ఐక్యూవీఐఏ/ఐఎంఎస్ హెల్త్ ప్రకారం.. ట్రాజోడోన్ టాబ్లెట్‌ల కోసం ప్రస్తుత వార్షిక యూఎస్ మార్కెట్ సుమారు 128 మిలియన్ల డాలర్లు అన్నారు.



| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 397 | ₹ 47 |
| వరంగల్ | ₹ 397 | ₹47 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్
₹70,090 (24 క్యారెట్లు) | ₹64,250 (22 క్యారెట్లు)

చెన్నై
₹64,250 (22 క్యారెట్లు) | ₹70,090 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 88,000

## స్వాతంత్ర్య కాలంనాటి సంస్థలు మళ్లీ వెలుగులోకి..




హైదరాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) : 1947లో బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తి పొందిన భారత్.. క్రమంగా తనదైన శైలిలో వ్యాపారం దిశగా అడుగులు వేసింది. అప్పట్లో స్థాపించిన ఎన్నో కంపెనీలు, సంస్థలు ఇప్పటికీ ప్రజాసేవలో వెలుగులీనుతున్నాయి. అహ్మదాబాద్ మున్సిపల్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ మరియు ఉత్తర ప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థలు ప్రజా రవాణా విషయంలో ఒక అడుగు ముందుకేసి ఆలోచించాయి. అందుకే 1947లోనే బస్సు సర్వీసులను ప్రారంభించాయి. మొదట్లో రోజువారీ అద్దె ప్రాతిపదికన బస్సు తీసుకుని నడిపిన అహ్మదాబాద్.. తదనంతర కాలంలో సొంతగా కొనుగోలు చేసింది. క్రమంగా విస్తరిస్తూ ఈ రెండు సంస్థలు ఇప్పటికీ విజయవంతంగా ప్రజా సేవలో తరిస్తున్నాయి. ఇక అంబికా ఎయిర్ లైన్స్ ఆ రోజుల్లోనే ముంబై, వడోదర, అహ్మదాబాద్ మధ్య వారానికి రెండుసార్లు విమానాలు నడిపి చరిత్ర సృష్టించింది. ఈ అత్యుత్తమ ఎయిర్‌లైన్స్ కాలక్రమమంలో 1949లో తన ప్రస్థానాన్ని ముగించింది.

గుజరాత్ కార్యాలయంగా 1947లో అతుల్ కంపెనీ స్థాపించబడింది. ఇది వివిధ రకాల కెమికల్స్ మరియు రసాయన సంబంధిత ఉత్పత్తులను ఇప్పటికీ విదేశాలకు ఎగుమతి చేస్తుంది. ఈ లిస్టెడ్ సంస్థ ఆదాయం దాదాపు నాలుగున్నర వేల కోట్లుగా ఉంది. అదే ఏడాది స్థాపించబడిన బాంబే ఆయిల్ ఇండస్ట్రీస్ కూడా విజయపథంలో దూసుకుపోతోంది. పారాచూట్, సఫోలా వంటి ప్రసిద్ధ బ్రాండ్లతో దేశవ్యాప్తంగా విస్తరించి కొబ్బరి, మంచి నూనె తయారీలో అగ్రగామిగా ఉంది.

పశ్చిమ బెంగాల్ కు చెందిన బ్యాటరీ తయారీదారు ఎక్సైడ్ ఇండస్ట్రీస్ స్వాతంత్య్రం వచ్చిన ఏడాదే పురుడు పోసుకుంది. ప్రస్తుతం 16 వేల కోట్ల ఆదాయంతో కేవలం భారత్ మాత్రమే కాకుండా శ్రీలంక, బ్రిటన్, సింగపూర్ వంటి దేశాల్లోనూ విస్తరించింది. ఇప్పుడు 60 దేశాలకు బ్యాటరీలను ఎగుమతి చేస్తోంది. 1947లో హైదరాబాద్ గోల్డ్ మైన్స్ పేరిట నెలకొల్పబడిన ప్రస్తుత హట్టి గోల్డ్ మైన్స్ ఇప్పటికీ బంగారం మైనింగ్ కార్యకర్తలు నిర్వహిస్తోంది. ఇది ప్రస్తుతం కర్ణాటక ప్రభుత్వం ఆధీనంలో పనిచేస్తోంది.

భారతదేశ ఫైనాన్షియల్ మార్కెట్ల చరిత్రలో ఢిల్లీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు ప్రముఖ స్థానం ఉంది. ఇందులో దాదాపు 3 వేల కంపెనీలు లిస్ట్ అయ్యాయి. 1947 నుంచి 2017 వరకు విజయవంతంగా సేవలు అందించింది. అనంతరం ప్రాభవం కోల్పోయింది. దేశీయ ప్రముఖ వార్తా సంస్థ ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పీటీఐ) కూడా అదే ఏడాది ప్రారంభించబడింది. ది హిందూ గ్రూప్ కు చెందిన కస్తూరి శ్రీనివాసన్ ఛైర్మన్‌గా చెన్నైలో నెలకొల్పబడింది. ఇప్పటికీ భారత్లో విజయవంతమైన మీడియా సంస్థగా కొనసాగుతుంది. చెన్నైలో స్టార్ట్ చేయబడిన భరణి పిక్చర్స్ కూడా 1948 నుంచి 1987 వరకు తమిళ, తెలుగు, హిందీ భాషల్లో చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవలందించింది.

# విపణి

## ఎలెక్రామా - 2025 ప్రివ్యూను హైదరాబాద్‌లో నిర్వహించిన ఐఈఈఎంఏ




హైదరాబాద్, ఆగస్టు 09 (జనంసాక్షి) : భారతీయ ఎలక్ట్రికల్ పరికరాల తయారీ పరిశ్రమ సర్వోన్నత సంఘం, ఇండియన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ మాన్యు ఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐఈఈ ఎంఏ) హైదరా బాద్‌లో ఎలెక్రామా దక్షిణ ప్రాంత ప్రివ్యూను నిర్వహించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కొత్త కార్యక్రమాల గురించి చర్చించడానికి, సభ్యత్వం కోసం ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించడానికి ఈ ఈవెంట్ పరిశ్రమల ప్రముఖులు, వాటాదారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఒకచోట చేర్చింది. రోడ్‌షో సందర్భంగా, ఐఈఈఎంఏ పరిశ్రమ సంస్థల మధ్య సహకారం, అనుబంధాన్ని పెంపొందించే లక్ష్యంతో తన వ్యూహాత్మక కార్యక్రమాలను హైలైట్ చేసింది. వివిధ రంగాల నుండి భాగస్వామ్యాన్ని పెంచడానికి అసోసియేషన్ ప్రతిష్టాత్మకమైన సభ్యత్వ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇ-మొబిలిటీ, బ్యాటరీ స్టోరేజ్, ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరియు నూతన ఎనర్జీల వృద్ధికి భారీ అవకాశాలను ఐఈఈఎంఏ చూస్తుంది. ఇవి ఇంధన రంగంలో తదుపరి వృద్ధిని పెంచుతాయని ఆశిస్తోంది.

## రిలయన్స్‌లో కాస్ట్ కటింగ్

ముంబై, ఆగస్టు 9 (జనంసాక్షి) : దేశంలోని దిగ్గజ వ్యాపార సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా గడచిన ఏడాది కాలంలో భారీగా ఖర్చులను తగ్గించుకున్నట్లు వెల్లడైంది. ఈ క్రమంలో కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,89,000 నుంచి 3,47,000కి తగ్గినట్లు ప్రకటించింది. ఖర్చుల మదింపులో భాగంగా రిలయన్స్ రిటైల్ వర్టికల్‌లో గరిష్ఠంగా ఉద్యోగుల సంఖ్య తగ్గించబడినట్లు వెల్లడైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 2024లో ఉద్యోగుల సంఖ్యను దాదాపు 11% లేదా 42,000 తగ్గించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజా వార్షిక నివేదిక ప్రకారం కొత్త నియామకాలు మూడింట ఒక వంతు కంటే ఎక్కువగా తగ్గి 1,70,000కి చేరుకున్నాయి. కంపెనీ ఎక్కువగా ఉద్యోగులను తమ రిటైల్ వ్యాపారం నుంచి తగ్గించినట్లు డేటా వెల్లడించింది. ఈ క్రమంలో రిలయన్స్ టెలికాం వెంచర్ జియో కూడా 2024లో 90,000 మంది ఉద్యోగులను తగ్గించుకుంది. ఉద్యోగులకు అందించే సౌకర్యాలపై వ్యయం 3% పెరిగి రూ.25,699 కోట్లకు చేరుకుంది. జియో స్టూడియోస్, మీడియా అండ్ కంటెంట్ విభాగం 11 థియేట్రికల్ ఫిల్మ్‌లు, 35 డైరెక్ట్-టు-డిజిటల్ రిలీజ్‌లు, భాషలు జానర్‌లలో ఎనిమిది ఒరిజినల్ వెబ్ సిరీస్‌లు ఉన్నాయి. ఈ సంఖ్య దేశంలోని ఏ ఫిల్మ్ స్టూడియో కంటే పెద్దది. వరుసగా 8 హిట్‌లతో, జియో స్టూడియోస్ సినిమాలు బాక్స్ ఆఫీస్ వద్ద రూ.700 కోట్లను రాబట్టాయి.

# జాతీయం అంతర్జాతీయం

## సెప్టెంబర్ 10న కమలతో చర్చకు ట్రంప్ రెడీ



వాషింగ్టన్, ఆగస్టు 9 (జనంసాక్షి) : అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారపర్వం జోరుగా కొనసాగుతోంది. అధ్యక్ష అభ్యర్థులుగా ఖరారైన డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ పరస్పరం విమర్శల దాడి చేసుకుంటున్నారు. ఈ క్రమంలో అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి డెమొక్రటిక్ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌తో డిబేట్‌కు సిద్ధమని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. సెప్టెంబర్ 10న ఏబీసీ టీవీ ఛానల్‌లో చర్చకు రెడీ అని తెలిపారు.

**మూడు డిబేట్‌లకు ప్రతిపాదన**

సెప్టెంబరులో మూడు టీవీ ఛానళ్లలో డిబేట్‌కు రావాలని కమలకు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించారు. సెప్టెంబరు 4, 10, 25 తేదీల్లో చర్చకు రావాలని ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో రిసార్ట్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోరారు. అందుకు హారిస్ అంగీకరిస్తారని కూడా ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, డొనాల్డ్ ట్రంప్ కమలతో డిబేట్ సిద్ధమైనట్లు ఏబీసీ టీవీ ఛానల్ ధ్రువీకరించింది. సెప్టెంబరు 10వ తేదీన అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ డిబేట్‌లో పాల్గొంటారని ఒక ప్రకటనలో తెలిపింది.

“డిబేట్ ద్వారా వివాదాలు పెట్టుకోవడం నా ఉద్దేశం కాదు. మరోవైపు డిబేట్‌లో నిబంధనలను కమల అంగీకరించాలి. ఆమె అందుకు ఒప్పుకుంటారో లేదో నాకు తెలియదు. కమలతో డిబేట్ కోసం ఎదురు చూస్తున్నాను. ఎందుకంటే నేను డిబేట్ లో రికార్డును సెట్ చేయాలని భావిస్తున్నాను. వచ్చే నెలలో సీబీఎస్ న్యూస్ వైస్ ప్రెసిడెంట్ డిబేట్‌ను నిర్వహిస్తుంది. ఇందులో పాల్గొనేందుకు ముందుకొచ్చి నా రన్నింగ్ మేట్, ఓహియో సెనేటర్ జేడీ వాన్స్ మంచి పనిచేశారు” అని డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు.

**స్పందించిన కమల**

మరోవైపు, సెప్టెంబర్ 10న ఏబీసీ టీవీ ఛానల్?లో చర్చకు రెడీ అని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ స్పందించారు. ఏబీసీ డిబేట్‌లో పాల్గొనేందుకు ఎదురుచూస్తున్నానని తెలిపారు. ఆలాగే డొనాల్డ్ ట్రంప్ సెప్టెంబరు 10న డిబేట్‌కు అంగీకరించినందుకు సంతోషిస్తున్నానని డెట్రాయిట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యాఖ్యానించారు. మరోవైపు కమలా హారిస్ తన రన్నింగ్ మేట్, డెమొక్రటిక్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి టిమ్ వాల్ట్‌తో కలిసి పెన్సిల్వేనియా, మిచిగాన్, విస్కాన్సిన్?లో ఎన్నికల ర్యాలీలు నిర్వహించారు.

## బంగ్లాదేశ్‌కు ఇది రెండో స్వాతంత్య్రం

- ముహమ్మద్ యూనుస్



న్యూఢిల్లీ, ఆగస్టు 9 (జనంసాక్షి) : పాలనాపగ్గాలు మారిన నేపథ్యంలో బంగ్లాదేశ్‌కు మరోసారి స్వాతంత్ర్యం వచ్చినట్లయిందని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తాత్కాలిక ప్రభుత్వ సారథి, నోబెల్ పురస్కార గ్రహీత ముహమ్మద్ యూనుస్ పిలుపునిచ్చారు. పౌరుల భద్రతకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందని, వారిపై దాడుల్ని ఆపడం ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. రాజకీయ సంక్షోభం నేపథ్యంలో తాత్కాలిక ప్రభుత్వ సారథిగా గురువారం రాత్రి ఆయన చేత అధ్యక్షుడు షహబుద్దీన్ ప్రమాణం చేయించారు. ప్రధానమంత్రి హోదాకు సమానమైన ముఖ్య సలహాదారుగా యూనుస్ వ్యవహరిస్తారు. పారిస్ నుంచి మధ్యాహ్నం ఢాకా చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. తొలుత ఆయన విలేకరులతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. దాడులు, అల్లర్లకు అడ్డుకట్టవేసి దేశ పునర్నిర్మాణాన్ని చేపట్టాలని, దాని కోసం ప్రజలు తనకు సహకరించాలని కోరారు. షేక్ హసీనాను గద్దె దించేలా నిరసన ఉద్యమం నడిపారంటూ విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**మీరు మాట వినకపోతే - నేనేం చేయలేను**

‘ఈ రోజు మనకెంతో గర్వకారణం. అరాచక కార్యకలాపాలను, మైనారిటీలపై దాడుల్ని నిలువరించి, శాంతి, భద్రతల్ని పునరుద్ధరించడం మన మొదటి కర్తవ్యం. ఈ దాడులన్నీ ఓ కుట్రలో భాగం. విద్యార్థులు, యువత కోరితే పాలనా పగ్గాలు చేపట్టడానికి నేను ముందుకు వచ్చాను. ప్రజలందరికీ రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. ఎవరిపైనా, ఎక్కడా, ఎలాంటి దాడులు జరగడానికి వీల్లేదు. దీనిని మనం సాధించలేకపోతే, మీరు నా మాట వినకపోతే, ఇక్కడ నా ఉపయోగమే ఉండదు’ అని యూనుస్ నిష్కర్షగా తేల్చి చెప్పారు. బంగ్లాదేశ్ ఇప్పుడు యువత చేతిలో ఉన్నందువల్ల వారి ఆకాంక్షలు, సృజనకు తగ్గట్టుగా పునర్నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉందన్నారు. 16 మందితో సలహాదారుల మండలిని ఆయన ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో విద్యార్థి ఉద్యమ నేతలు, సామాజిక ఉద్యమకర్తలు కూడా ఉన్నారు. యూనుస్‌ను భారత ప్రధాని నరేంద్రమోదీ అభినందించారు. బంగ్లాదేశ్‌లో త్వరలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని, హిందువులు, ఇతర మైనారిటీలకు భద్రత లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## టెల్ అవీవ్‌కు విమానాలను ఎయిర్ ఇండియా నిలిపివేత

హైదరాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) : పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల మధ్య ఈ నెల 8 వరకు ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు ఎయిర్ ఇండియా విమానాలను నిలిపివేసిన విషయం తెలిసింది. ప్రస్తుతం కొనసాగుతున్న పరిస్థితుల నేపథ్యంలో తుదిపరి ఉత్తర్వులు వెలువడే వరకు విమాన కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు శుక్రవారం వెల్లడించింది. ఎయిర్ ఇండియా టెల్ అవీవ్‌కు విమానాలను బుక్ చేసుకున్న ప్రయాణీకులకు టికెట్ డబ్బులను వాపస్ చేస్తున్నట్లు ఎయిర్ ఇండియా ఓ పోస్ట్‌లో పేర్కొంది. మిడిల్ ఈస్ట్‌లోని కొన్ని ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా టెల్ అవీవ్ నుంచి విమానాల షెడ్యూల్డ్ కార్యకలాపాలు తదుపరి నోటీసు వచ్చే వరకు తక్షణమే నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది. మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతల కారణంగా ఆగస్టు 8 వరకు టెల్ అవీవ్‌కు బయలుదేరే అన్ని విమానాలను నిలిపివేస్తున్నట్లు ఎయిర్ ఇండియా ఆగస్టు 2న ప్రకటించింది.

## ఇక బ్యాంకు అకౌంట్‌కు నలుగురు నామినీలు!

- లోక్‌సభలో కేంద్రం కొత్త బిల్లు



న్యూఢిల్లీ, ఆగస్టు 9 (జనంసాక్షి) : బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు - 2024ను కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరీ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ చట్టంలో బ్యాంకు ఖాతాలతో ముడిపడిన ఓ కీలక ప్రతిపాదన ఉంది. అదేమిటంటే ప్రస్తుతం ఒక బ్యాంకు అకౌంటుకు గరిష్ఠంగా ఒక నామినీని మాత్రమే అపాయింట్ చేసే అవకాశం ఖాతాదారుడికి ఉంది. ఇకపై ప్రతీ బ్యాంకు ఖాతాపై గరిష్ఠంగా నలుగురు నామినీలను అపాయింట్ చేసే వెసులుబాటును ఖాతాదారుడికి కల్పించాలని ఈ బిల్లులో ప్రతిపాదించారు. కంపెనీ లేదా ఏదైనా సంస్థలో డైరెక్టర్ హోదాలో ఉండేవారికి సబ్‌స్టాన్షియల్ ఇంట్రెస్ట్ (కనీస యాజమాన్య వాటా పరిమితి) గత 60 ఏళ్లుగా రూ.5 లక్షలు మాత్రమే ఉంది. దీన్ని రూ.2 కోట్లకు పెంచాలని బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు - 2024లో ప్రపోజ్ చేశారు. సహకార బ్యాంకులకు సంబంధించి కూడా కీలక మార్పులను ఈ బిల్లులో ప్రతిపాదించారు. చట్టబద్ధ ఆడిటర్లకు చెల్లించాల్సిన పరిహారాన్ని నిర్ణయించుకునే స్వేచ్ఛను బ్యాంకులకే ఇవ్వాలని యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రతినెలా రెండో, నాలుగో శుక్రవారాల్లో బ్యాంకులు ఫైనాన్షియల్ రిపోర్టింగ్ చేస్తున్నాయి. ఆ తేదీలను ప్రతినెలా 15, చివరి తేదీలకు మార్చాలని ఈ బిల్లులో ప్రతిపాదించారు.

**రాష్ట్రాల అధికారాన్ని లాక్కునే ప్రయత్నం : మనీశ్ తివారీ**

సహకార సంఘాలకు సంబంధించిన అంశాలపై చట్టాలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని, దాన్ని కేంద్రం లాక్కునే ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ పేర్కొన్నారు. దీనికి కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. “బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్‌కు, కోఆపరేటివ్ బ్యాంకులకు సంబంధం ఉంది. అందుకే సహకార సంఘాలకు సంబంధించిన ప్రతిపాదనను మేం చేయాల్సి వచ్చింది” అని తెలిపారు. “కోఆపరేటివ్ బ్యాంకులను మేం చిన్నచూపు చూడటం లేదు. ఆ బ్యాంకులు అందిస్తున్న సేవలను ఎవరూ కాదనలేరు. బ్యాంకులైనా,కోఆపరేటివ్ బ్యాంకులైనా ఒక బ్యాంకింగ్ లైసెన్సుతో పనిచేస్తాయి. అందుకే వాటిని కూడా ఈ సంస్కరణల పరిధిలో చేర్చాల్సి వచ్చింది” అని నిర్మల వివరించారు. బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు - 2024కు కేంద్ర క్యాబినెట్ గత శుక్రవారమే ఆమోదం తెలిపింది. కేంద్ర బడ్జెట్ ప్రసంగంలోనే ఈ బిల్లుకు సంబంధించిన విషయాన్ని కేంద్ర మంత్రి నిర్మల ప్రకటించారు. బ్యాంకుల నిర్వహణను మెరుగుపర్చేందుకు, ఇన్వెస్టర్ల భద్రతకు భరోసా కల్పించేందుకు బ్యాంకింగ్ చట్టాల సవరణ అవసరమని ఆమె బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.

## వక్ఫ్ చట్టంలో మార్పునకు ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, ఆగస్టు 9 (జనంసాక్షి) : వక్ఫ్ చట్టంలో మార్పులు చేసేందుకు కేంద్రం తీసుకొచ్చిన ప్రతిపాదిత సవరణ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల నుంచి తీవ్రమైన వ్యతిరేకత రావడంతో ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపించనున్నట్లు కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజుజు గురువారం తెలిపారు. ఈ బిల్లులో ప్రతిపాదించిన సవరణలతో ధాతృత్వం అనే భావనను నిర్వీర్యం చేసి ఆక్రమణదారులను ఆస్తులకు యజమానులుగా మార్చే ప్రయత్నం జరుగుతోందన్న విమర్శలు వచ్చాయి. వక్ఫ్ చట్టాన్ని ‘ఇంటిగ్రేటెడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్’గా పేర్కొన్నారు. అయితే, ప్రతిపాదిత సవరణలకు, ఆ పేరుకు పొంతన లేదని నిపుణులు భావిస్తున్నారు. కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు నేతృత్వంలోని మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన ఈ సవరణ బిల్లు ప్రతులను పార్లమెంట్ సభ్యులందరికీ పంపిణీ చేశారు. వక్ఫ్ చట్టంలోని లోపాలను సరిచేసి, వక్ఫ్ అడ్మినిస్ట్రేషన్, వక్ఫ్ ఆస్తుల నిర్వహణను మెరుగుపరిచేందుకు ఈ సవరణలు అవసరమని ప్రభుత్వం చెబుతోంది. వక్ఫ్ బోర్డు పరిధిలో ఆస్తులు భారీగా ఉన్నాయి. దాదాపు 9.4 లక్షల ఎకరాల్లో వక్ఫ్ ఆస్తులు విస్తరించి ఉన్నాయి. దేశంలో రక్షణ శాఖ, రైల్వే శాఖ తర్వాత వక్ఫ్ వద్దనే భారీగా ఆస్తులున్నాయి. దేశంలో ఈ మూడింటికే అత్యధిక భూ యాజమాన్య హక్కులు ఉన్నాయి.

**వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు**

గత రెండేళ్లలో, దేశంలోని వివిధ హైకోర్టుల్లో వక్ఫ్‌కు సంబంధించి దాదాపు 120 పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ తర్వాత ఈ చట్టానికి సవరణ ప్రతిపాదనలు వచ్చాయి.జైనులు, సిక్కులు వంటి ఇతర మైనారిటీలతో సహా.. ఇతర మతాల వారికి ఇలాంటి చట్టాలు వర్తించనప్పుడు, వక్ఫ్ చట్టం ఎలా చెల్లుబాటవుతుందంటూ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్లలో వారు సవాల్ చేశారు.



## తల్లిదండ్రులు కోల్పోయి అనాధలు గా మారిన చిన్నారులకు అండగా ఉంటా..

### ఎమ్మెల్యే విజయ రమణారావు

**సుల్తానాబాద్,ఆగస్టు 09(జనంసాక్షి) :**
కాల్వ శ్రీరాంపుర్ మండలం ఆశన్నపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యాలతో మంద ఐలయ్య- భాగ్యమ్మ మృతి చెందగా వారి కుమారుడు కూతురు అభిలాష్, మనిషా లను శుక్రవారం పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పరామర్శించి వారికి అండగా నిలిచారు.పూరి గుడిసెలో ఉంటున్న చిన్నారులకు ప్రభుత్వం ద్వారా డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేసి ఇల్లు నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చి ఇల్లు కట్టిస్తానని ఎమ్మెల్యే విజయ రమణారావుహామీ ఇచ్చారు.అభిలాష్, మనీషా పై చదువులకు బీసీ హాస్టల్ లో వసతి కల్పించి పై చదువులకు తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు.లక్కమారు రాష్ట్ర సంఘం నాయకులు అనాధలైన చిన్నారులకు రూ. 75,000/- ఆర్థిక సహాయం చేయగా ఎమ్మెల్యే విజయరమణ రావు చేతుల మీదుగా చిన్నారులకు అందజేశారు.అనాధలైన చిన్నారులకు తమ వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే విజయ రమణారావు భరోసాఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్. లంక సదయ్య ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లక్కమారు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 40 వేల ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే విజయ రమణారావు



**సుల్తానాబాద్,ఆగస్టు 09(జనంసాక్షి) :**
ఓదెల మండలం రూపు నారాయణపేట గ్రామానికి చెందిన వనపర్తి రమణయ్య ఎడ్లు వ్యవసాయ పొలంలో విద్యుత్ షాక్ కు గురై మరణించగా శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలో విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన 40 వేల ఆర్థిక సహాయాన్ని రమణయ్యకు ఎమ్మెల్యే విజయ రమణారావు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు దుగ్యాల సంతోష్ రావు,ప్రకాష్ రావు ,ప్రేమ్ సాగర్ రెడ్డి ,రాజలింగం సతీష్, శ్రీనివాస్ ,మహేందర్ ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం




**సుల్తానాబాద్,ఆగస్టు 09(జనంసాక్షి) :**
ప్రభుత్వ జూనియర్ కళాశాల, సుల్తానాబాద్ లో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా ఇంటర్ విద్యాదికారి డి .కల్పన పాల్గోని ర్యాలిని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే అవగాహన కల్పించుకొని బావితరాలకు ఉపయోగపడే విదంగా మొక్కలు నాటి సంరక్షిస్తూ కాలుష్య రహిత సమాజాభివృద్ధికి తోడ్పడాలని చెప్పారు.ప్రిన్సిపాల్ యన్.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పర్యవరణ పరిరక్షణకు వన సంపదను వృద్ధి చేయుటలో యువత క్రుషి చేయాలని చెప్పారు.కార్యక్రమములో ఎన్ఎస్ఎస్,కార్యక్రమాధికారి సి హెచ్ ప్రభాకర్,ఉపన్యాసకులు,సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పెద్దపూర్ గురుకుల పాఠశాలలో బొప్పాపూర్ విద్యార్థి మృతి..

**ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 09, (జనంసాక్షి) :**
ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్న 6వ తరగతి చదువుతున్న విద్యార్థి అనిరూద్ శు క్రవారం మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో చదువుతూ అస్వస్థతకు గురై మృతిచెందాడు. కృష్ణారెడ్డి - ప్రీయ దంపతులు చందుర్తి మండలంలోని మర్రిగడ్డ గ్రామానికి చెందినవారు.



ప్రీయ పుట్టినిల్లు బొప్పాపూర్ గ్రామము అవ్వడంతో కొద్ది సంవత్సరాల నుండి బొప్పాపూర్‌లో నివాసం ఉంటున్నారు. భార్య, కొడుకును పోషించుకోవడానికి కృష్ణారెడ్డి గల్ఫ్‌కు వెళ్లాడు. ప్రీయా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉద్యోగం చేస్తూ పోషించుకుంటుంది. ఈ సంవత్సరం 6వ తరగతిలో గురుకుల పాఠశాలలో సీటు రావడంతో తల్లి, తండ్రి అనందంతో ఒక్కగానొక కొడుకును బాగ చదివించుకోవాలని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో చేర్పించారు. పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు అస్వస్థతకు గురికాగా ఆసుపత్రికి ఉపాధ్యాయులు తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా అనిరూద్ మృతిచెందాడు. చిన్నారి మృతితో బొప్పాపూర్ గ్రామంలో విషాదం నెలకొంది.

# ప్రజాసమస్యల పరిస్కారమే ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**లక్ష్మీదేవిపల్లి ఆగస్టు 09(జనంసాక్షి) :**
సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిస్కారమే ప్రభుత్వలక్ష్యం అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం అశోక్ నగర్-ప్రగతి నగరులో ముర్రేడు వాగును కలుపుతూ రూ. 1.50కోట్ల పంచాయతీ రాజ్ ద్వారా ఏంఆర్ఆర్, ఎఫ్డిఆర్ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేనిసాంబశివరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, బస్తీల్లో పక్క రహదారులు, డ్రైనేజి నిర్మాణాలపై ప్రత్యేక ద్రుష్టి సారించినట్లు తెలిపారు. వివిధ పథకాలు, గ్రాంట్ల ద్వారా ఇప్పటికే అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, మరికొన్ని పనులకు సంబంధించి నిధుల మంజూరికోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు. ప్రగతినగర్, అశోక్ నగర్లో నిర్మించనున్న డ్రైనేజి నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలకు శాశ్వత పరిస్కారం



లభిస్తుందని, గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా ప్రతియేటా వర్షాకాలంలో కాలనీ ముంపుకుగురై ప్రజలు ఇబ్బందులు పరిస్థితి ఉండేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మాజీ జడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, ఆళ్ల మురళి, తూము చౌదరి,వివిధ శాఖల అధికారులు, స్థాని కులు జర్పుల మురళి, పి. సత్యనారాయణాచారి, నర్సింహా, పిల్లలమర్రి మురళి, సాదిక్, చెలమల సత్యం, రంగనాధ్ తదితరులు పాల్గొన్నారు.

# కొమరం భీమ్ విగ్రహావిష్కరణ చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

### తుడుం దెబ్బ ఆధ్వర్యంలో బోడులో భారీ ర్యాలీ

**టేకులపల్లి, ఆగస్టు 9 (జనం సాక్షి):**
ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా బోడు గ్రామంలో తుడుందెబ్బ జాతీయ కో కన్వీనర్ కల్తీ సత్యనారాయణ అధ్యక్షతన కొమరం బీమ్ విగ్రహాన్ని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆవిష్కరించారు. అనంతరం ఆదివాసి గిరిజనులు బోడు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మూత్తి సత్యం ఆదివాసి ఆల్ ఇండియా కన్వీనర్, తుడుందెబ్బా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి,సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అవునూరి మధు మాట్లాడుతూ అడవి సంపదను,ఖనిజ సంపదను దోచుకోవడం కోసమే అడవికి మూలవారసులైన ఆదివాసీలను దాడులు చేస్తున్నారని, అటవీ సంరక్షణ నియమాల పేరుతో నూతన చట్టాలను తీసుకువచ్చారని,ఎన్నో ఏళ్లుగా అడవిని నమ్ముకుని పోడుకొట్టుకొని సాగు చేసుకుని జీవనం కొనసాగి స్తున్న ఆదివాసీలను వెల్లగొట్టడం కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని అన్నారు. ఇప్పటికే ఆదివాసీల సంస్కృతి,సాంప్రదాయాలను అణిచివేయడం కోసం సామ్రాజ్యవాద విష సంస్కృతిని ప్రవేశపెట్టారనివారన్నారు. ఆదివాసీలు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా సాంస్కృతికంగా వెనకబడిన వారని ఆయన తెలియజేశారు. ఖనిజ సంపద కోసం ఈశాన్య మధ్య భారతంలో సామ్రాజ్యవాద రూపంలో ఉన్న పాలకులు ఆదివాసీలపై యుద్ధం ప్రకటించారని మూలవాసు లైన ఆదివాసులను అంతమొందించే



చర్యలను మన ముందు జరుగుతున్న చరిత్ర నుండి తెలుసుకోవచ్చని ఆయన చెప్పారు జల్ జంగిల్ జమీన్ నినాదంతో పోరాడిన బిర్సం ముండా, గుండాధర్ ,ఖాన్ సింధు,కొమరం భీమ్,రాంజీ గోండు ,కోటన్న,బాటన్న,లింగన్నలు అనేకమంది ఈ పోరాటంలో భాగస్వామ్యులైనారని వారు తెలియజేశారు. కేంద్రం తన సైన్య బలగాలను దింపి ఆదివాసులపై అమానుష దాడులు చేపిస్తూ అకృత్యాలను సృష్టిస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ దొర కుంజ సాంబయ్య, పటేల్ మాడె లాలయ్య, ఎట్టి నరసింహారావు, మేడే ప్రదీప్, కుంజ శివ, ముడిగ నరసింహారావు, పూనెం స్వామి, ఎట్టి ప్రశాంత్, ఈసాల రవి, గుమ్మడి సమ్మయ్య టీచర్ యూనియన్, జోగా రాంబ్రహ్మం టీచర్ యూనియన్ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఒక్క ఎకరం పంట ఎండిన ప్రభుత్వానిదే బాధ్యత

- జీవో 33తో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం
- హామీలు నెరవేర్చలేక సబ్ కమిటీల పేరుతో కాలయాపన
- మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన ప్రారంభం కాలేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రితో సహా ఏ ఒక్క మంత్రికి రాష్ట్రం పట్ల చిత్తశుద్ధి , బాధ్యత లేదన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవర్చలేక సబ్ కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.తెలంగాణకి జీవధార ఎప్పటికైనా కాళేశ్వరమే అని,అందుకే మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం కట్టారని అన్నారు.రాష్ట్రంలో ఒక్క ఎకరం పంట ఎండిన కూడా ప్రభుత్వానిదే బాధ్యత అని అన్నారు.ప్రభుత్వానికి రైతుల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న కాళేశ్వరం పంపులను వెంటనే ప్రారంభించాలన్నారు.సుంకిశాల నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్ అని,ఉప ముఖ్యమంత్రి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. సుంకిశాల విషయంలో నిర్మాణ సంస్థ బాధ్యత తీసుకుంటుందన్నారు. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేసే జిఓ నెంబర్ 33ని రద్దు



చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో జీవో 33ని తీసుకు వచ్చిందన్నారు.నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం గురించి ఆలోచన చేసిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వారి సంక్షోభం కోరుకుంటుందన్నారు.జీవో 33 వల్ల విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం జీవో 33ని ఉపసంహరించుకోవాలని,లేదంటే విద్యార్థులు, వారి పేరెంట్స్ కు మద్దతుగా న్యాయపోరాటం చేస్తామని అన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరి ఇంటి పై జాతీయ జండా ఎగరాలి : కామారెడ్డి ఎమ్మెల్యే

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 9 (జనంసాక్షి):**
స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రతి ఒక్కరూ జండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని.జాతీయ భావం పెంచేందుకే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని, కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకటరమణా రెడ్డి అన్నారు.హర్ ఘర్ తీరంగా కార్యక్రమంలో భాగంగా 11 తేది నుండి 14 తేది వరకు బీజేపీ ఆద్వర్యంలో కార్యక్రమాలు ఉంటాయని,ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం బిజెపి జిల్లా అధ్యక్షురాలు అరుణతార గౌరవ భారత ప్రధాని నరేంద్ర మోదీ సూచన మేరకు బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమ సన్నాహక సమావేశం బీజేపీ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణరెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరి ఇంటి పై జాతీయ జండా ఉండాలనీ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రతి ఒక్కరూ జండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలనీ సూచించారు. బిజెపి కార్యకర్తలు



ఇంటింటికీ జండా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. జాతీయ భావం పెంచేందుకే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు.బిజెపి జిల్లా అధ్యక్షురాలు అరుణ తార మాట్లాడుతూ హర్ ఘర్ తీరంగా కార్యక్రమంలో భాగంగా 11 తేది నుండి 14 తేది వరకు బీజేపీ ఆద్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలి నిర్వహించి, మండల, గ్రామ, బూత్ స్థాయిలో కార్యకర్తలు ప్రజలను పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొనేల చూసి విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు.

# దివ్యాంగుల ఉపకరణాల పంపిణికి పేర్లు నమోదు...

**ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 09, (జనంసాక్షి) :**
ఎల్లారెడ్డిపేట మండలంలోని అన్ని గ్రామాల అర్హులైన దివ్యాంగులకు ఉప కరణాల పంపిణి కోసం మండల కేంద్రం లోని శ్రీలక్ష్మి మల్లారెడ్డి పంక్షన్ హాల్‌లో శు క్రవారం అధికారులు శిభిరం నిర్వహించి పేర్లు నమోదు చేస్తుకున్నారు. జిల్లా వెల్ఫేర్ అధికారి లక్ష్మీరాజం ఆధ్వర్యంలో శిభిరం నిర్వహించారు. వింకలాంగత్వా



నికి సంబంధించిన వివరాలు, వారందరి పేర్లను నమోదు చేసుకున్నారు. అనంతరం వనమహోత్సవం ప్రోగ్రామ్ నిర్వహించి మొక్కలు నాటారు. వికలాంగుల సంక్షేమ శిభిరంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పాల్గొని మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంద న్నారు. నెల రోజుల వ్యవధిలో జిల్లా కలెక్టర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజవర్గ ఇంచార్జీ కేకే మహేంద ర్‌రెడ్డిలు వినికిడి, ఊత కర్ర, ట్రైసైకిల్ ఇలాంటి పరికరాలను అందజేయడం జరుగు తుందన్నారు. సమాజంలో వికాలంగులపై చిన్నచూపు చూడడం మంచిది కాదన్నారు. వికలాంగులు కూడా సమాజంలో ఒక భాగంగా పరిగణించాలన్నారు. వికలాంగులు కూడా అన్ని రంగాలలో ఉద్యోగాలు చేస్తున్నారని వారిని ప్రోత్సహించడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వి. భాస్కర్, మండల అభివృద్ధి అధికారి సత్తయ్య, ఎల్లారెడ్డిపేట గ్రామ కార్యదర్శి ప్రవీణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, కొమిరిశెట్టి తిరుపతి, నాయకులు గుండాటి రాంరెడ్డి, చెన్ని బాబు, అధికారులు, సిడిపివోలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

## 78వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- ఏరియా జనరల్ మేనేజర్ ఎల్.వి. సూర్యనారాయణ
- ఏరియా అధికారులతో జీఎం సమావేశము




**యైటింక్లయిన్ కాలని ఆగస్టు 09 (జనంసాక్షి) :**
సింగరేణిలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణ డివిజన్ అధికారులకు సూచించారు. శు క్రవారం ఆర్జీ-2 జీఎం కార్యాలయంలోని కన్ఫరెన్స్ హాల్ నందు స్వాతంత్ర దినోత్సవ వేడుకలపై ఏరియా ముఖ్య అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆగష్టు 15న నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకలను సిఇఆర్ క్లబ్, 8 ఇంక్లైన్ కాలనీ నందు ఘనంగా నిర్వహించనునట్లు తెలిపారు. మొదట జాతీయ జండా ఆవిష్కరణ, సెక్యూరిటీ సిబ్బందిచే గౌరవ వందనం, ముఖ్య అతిధి స్వతంత్ర దినోత్సవ సందేశం, అనంతరం ఏరియా నుండి ఎంపికైన ఉత్తమ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమము, ఆనంతరం పాఠశాలల విధార్థిని విద్యార్థులచే సాంస్కృతిక నిర్వహించడం జరుగుతుం దని తెలిపారు. ఈ వేడుకలకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కార్యక్రమము విజయవంత మయ్యేలా చూడాలని ఏరియా అధికారులకు తెలిపారు. ఈసమావేశంలో అఫిషియేటింగ్ ఎస్ఓటు జీఎం, ఏఎస్ఓ ఎస్.సంతోష్ కుమార్, డిజిఎం (పర్సనల్) జి.రాజేంద్ర ప్రసాద్, డిజిఎం (వర్క్‌షాప్) ఎర్రన్న, డిజిఎం (సివిల్) ధనుంజయ, పర్యావరణ అధికారి కొత్తుర్ సురేష్ బాబు, ఏరియా సెక్యూరిటి అధికారి షరీఫ్ మహమ్మద్, మెడికల్ సూపరింటెండెంట్ డా॥ మహిపాల్, డివై పిఎం నల్లివెల్లి వేణుగోపాల్, జేఇ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక సమస్యలపై విద్యార్థులకు అవగాహన..



**ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 09, (జనంసాక్షి) :**
ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక వైద్యుడు డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మానసిక సమస్యలు, మత్తు పదార్థాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిత్యజీవితంలో మానసిక ఒత్తిడి ద్వారా వచ్చే సమస్యలను గుర్తించి వాటికి తగిన చికిత్సలు, కౌన్సిలింగ్ తీసుకోవడం గురించి, అలాగే మత్తు పదర్థాల వలన వచ్చే దుష్పరిణామాలు వాటి నుండి బయట పడే మార్గాల గురించి విద్యార్థులకు డాక్టర్ ప్రవీణ్ కుమార్ వివరించారు. నిత్య జీవితంలో మానసిక ఒత్తిడి నుండి బయట పడేందుకు తగిన సమయం, నిద్రపోవడం, ఆటలు ఆడటం, మెడిటేషన్ అలవాటు చేసుకోవడం వంటి మరెన్నో విషయాల గురించి విద్యార్థులకు సూచించారు. మానసికంగా ఎవరైన సమస్యలతో బాధపడేవారు ఉన్నట్లయితే చరవాణి ద్వారా తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబరు 14416కు కాల్ చేసి పరిష్కరించుకోవచ్చన్నారు. టోల్ ఫ్రీ నెంబర్‌లో 24 గంటలు మానసిక వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ మండల వైద్యాధికారి డాక్టర్ చిరంజీవి, ఏఎన్ఎం భూలక్ష్మి, ఆశావర్కర్లు లత, కవిత, రజిత, స్రవంతిలు పాల్గొన్నారు.

## కుక్క కాటు బాధితులను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 09, (జనంసాక్షి) :**
ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం కుక్క కాటు వలన ఆరుగురు చిన్న పిల్లలు గాయాలకు గురికాగా వారిని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ వీధి కుక్కల వలన చిన్నారులకు ప్రాణాపాయం ఉందని దీనిని గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది పట్టించుకొని నివారించాలన్నారు. చిన్నారులు పేద కుటుంబా లకు చెందిన వారని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కుక్క కాటుకు గురైన వారిలో మద్దుల వర్షిత్ (5), మాస్కూరి బ్రితీష (6), తాటిపల్లి సహస్ర (5), ఏర్పుల వరుణ్ తేజ్ (6), రాగుల రుతిక (7) , గుండం హనీష్‌రెడ్డి (4)ల కుటుంబాలను పరామర్శించి వారికి బ్రెడ్ ప్యాకెట్లను అందించారు. భవిష్యత్తులో ఈ చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చిక్సిత అందిస్తామని అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు కుక్క కాటు భారీన పడి చిన్నారుల గురించి వివరాలను అందించడం జరిగిందన్నారు. పరామర్శించిన వారిలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు షేక్ గౌస్, నాయకులు గుండాటి రాంరెడ్డి, చెన్ని బాబు, కొత్తపల్లి దేవయ్య, బీపేట రాజు, అంతేర్పుల గోపాల్, యాసరవేని దేవయ్యలు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో హీరో మహేష్ బాబు జన్మదిన వేడుకలు

**భద్రాచలం, ఆగస్టు 9 (జనంసాక్షి)**
సూపర్ స్టార్ మహేష్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు జి. సాయిజీ ఆధ్వర్యంలో శుక్రవారం మహేష్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజ వృదా ధ్రశమంలో అతిథిగా హాజరైన సంఘ సేవకులు బిర్రు సుధాకర్ కేక్ కటింగ్ చేసారు. అనంతరం వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్తికేయ, రాజు, మణికంఠ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# హాకీకి..పతక హారతి



హాకీ అంటే ఆట మాత్రమే కాదు.. అదో భావోద్వేగం. అందుకే గతంలో ఏకంగా ఎనిమిదిసార్లు భారత్‌కు ఒలింపిక్ పసిడి పతకాలు అందించిన హాకీ దిగ్గజాలను మనమంతా ఎప్పటికీ గుర్తుంచుకుంటాం. వాళ్ల జ్ఞాపకాలను మదిలో దాచుకున్నాం. ఆ తర్వాత నాలుగు దశాబ్దాలుగా ఒలింపిక్స్‌లో ఒక్క పతకమూ రాకపోవడంతో ఎం తో ఆవేదనకు గురయ్యాం. ఇంకెన్నాళ్లీ మనోవ్యథ అనుకుంటున్న తరుణంలో.. మూడేళ్ల క్రితం టోక్యోలో మన్‌ప్రీత్‌సింగ్ సారథ్యంలోని జట్టు కాంస్య పతకంతో చరిత్ర సృష్టించి చిద్విలాసం చేసింది.. హాకీ అభిమానులకు అంతులేని ఆనందాన్ని అందించింది. ఇదిలో మళ్లీ వెంటనే పారిసలోనూ ఆ తరహా ప్రదర్శనను పునరావృతం చేసి ఆ సంతోషాన్ని రెట్టింపు చేసింది. హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలో జట్టు అద్భుతంగా ఆడి వరుసగా రెండోసారి ఒలింపిక్ పతకంతో పూర్వవైభవానికి గట్టి పునాదులు వేసింది. ఒకప్పుడు గొప్పగా వెలిగి ఆపై మసకబారిన టీమిండియాకు ఇకనుంచి అన్నీ మంచి శకునములే!

ఒలింపిక్స్‌లో వరుసగా రెండోసారి పతకంతో చరిత్ర సృష్టించిన భారత పురుషుల హాకీ జట్టు ఈసారి సమష్టిగా పోరాడి ఫలితాన్ని రాబట్టింది. అనుభవజ్ఞులు, యువకులతో సమతూకమైన జట్టుగా బరిలోకి దిగిన భారత్ టోర్నమెంట్ ఆద్యంతం పోరాటతత్వాన్ని ప్రదర్శిస్తూ ముందుకెళ్లింది. కఠినమైన ప్రత్యర్థులు ఎదురైనా ఏమాత్రం వెరవని హర్మన్‌సేన.. ప్రతి మ్యాచ్‌లోనూ చావోరేవో అన్నట్టుగా పోరాడింది. ఆరంభ పోరులో న్యూజిలాండ్‌ను ఓడించి పారిస్ క్రీడలను ఘనంగా ప్రారంభించిన టీమిండియా..



**ఒలింపిక్స్ హాకీలో భారత్**

1928 – స్వర్ణం
1932 – స్వర్ణం
1936 – స్వర్ణం
1948 – స్వర్ణం
1952 – స్వర్ణం
1956 – స్వర్ణం
1960 – రజతం
1964 – స్వర్ణం
1968 – కాంస్యం
1972 – కాంస్యం
1980 – స్వర్ణం
2020 – కాంస్యం
2024 కాంస్యం

రెండోమ్యాచ్‌ను అర్జెంటీనాతో డ్రాగా ముగించింది. ఆ తర్వాత ఐర్లాండ్‌పై గెలిచి, డిఫెండింగ్ చాంపియన్ బెల్జియంతో ఓడినా.. ప్రీ క్వార్టర్స్‌లో టోక్యో ఒలింపిక్స్ రన్నరప్ ఆస్ట్రేలియాను చిత్తుచేసిన తీరు అమోఘం. విశ్వక్రీడల్లో 52 ఏళ్ల తర్వాత కంగారూలపై తొలి విజయాన్ని నమోదుచేసిన భారత్.. అదే జోరులో క్వార్టర్స్‌లో గ్రేట్ బ్రిటన్‌పై మరపురాని ప్రదర్శనతో అభిమానులను అలరించింది. స్కోర్లు సమమైనా, పెనాల్టీ షూటౌట్‌లో ఫలితాన్ని రాబట్టిన తీరును మరచిపోగలమా! సెమీఫైనల్లో జర్మనీ చేతిలో పరాజయం ఎదురైనా, కాంస్య పోరులో స్పెయిన్‌పై విజృంభించి పతకం దక్కించుకుంది. ప్రధానంగా సారథి హర్మనప్రీత్, గోల్‌కీపర్ శ్రీజేష్ జట్టును ముందుండి నడిపించిన తీరు సర్వదా ప్రశంసనీయం. సహచరుల్లో స్ఫూర్తి నింపుతూ, పోరాటమే ఆయుధంగా ముందుకు సాగుతూ, జట్టు ను విజయాల బాట నడిపించాడు హర్మన్‌ప్రీత్. టోక్యోలో పతకం సాధించడం లోనూ కీలకపాత్ర పోషించిన 28 ఏళ్ల హర్మన్.. పారిస్‌లో అంతకుమించిన ఆటతీరుతో చెలరేగాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ డ్రాగ్‌ఫ్లికర్లలో ఒకడిగా పేరుగాంచిన హర్మన్.. జట్టు ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ గోల్ చేశాడు. ఓవరాల్‌గా టోర్నీలో పది గోల్స్‌తో విజృంభించి జట్టు పతకం దక్కించుకోవడంలో కీలక భాగస్వామ య్యాడు. ఇక, గోల్‌కీపర్ శ్రీజేష్ గతేడాది ప్రపంచకప్ క్వార్టర్స్‌లో న్యూజిలాండ్ చేతిలో పెనాల్టీ షూటౌట్‌లో ఓడిన టీమిండియా.. ఆ తర్వాత కొత్త కోచ్ క్రెగ్ ఫుల్టన్ శిక్షణలో క్రమంగా మెరుగపడింది. ఆసియా క్రీడల ఫైనల్లో జపాన్‌పై ఆరంభంలో ప్రశాంతంగా ఆడి ఆపై దూకుడు పెంచి పైచేయి సాధించింది. ఇటీవలికాలంలో ఆటలో డిఫెన్స్ పరంగానూ మెరుగుపడింది. పారిసలో ఒత్తిడిని దాటుకొని వరుసగా రెండో పతకాన్ని ముద్దాడింది.

# అనర్హతపై వినేశ్ ఫొగాట్ సవాల్

## అప్పటిలోగా తుది నిర్ణయం వెల్లడిస్తామన్న కాస్



పారిస్ ఒలింపిక్ గేమ్స్‌లో భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అనర్హతకు గురైన విషయం తెలిసిందే. 50 కేజీల విభాగంలో 100 గ్రాముల అధిక బరువు కారణంగా ఫొగాట్‌పై అనర్హత వేటు పడింది. ఈ నేపథ్యంలో తనపై అనర్హతను వినేశ్ ఫొగాట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్‌లో సవాల్ చేసింది. వినేశ్ అభ్యర్థనను కాస్ తాజాగా విచారణకు స్వీకరించింది. ఒలింపిక్ గేమ్స్ ముగిసేలోగా నిర్ణయం వెల్లడిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు కాస్ అధికారిక ప్రకటన చేసింది. కాగా, అదనపు బరువు కారణంగా అనర్హతకు గురైన వినేశ్ ఫొగాట్ తనకు రజత పతకం ఇవ్వాలని అప్పీలులో కోరింది. అయితే, ఒలింపిక్స్‌లో నిబంధనలను మార్చే అవకాశం లేదని యునైటెడ్ ప్రపంచ రెజ్లింగ్ స్పష్టం చేసింది. ఒకవేళ ఆర్బిట్రేషన్ అనుమతి ఇస్తే వినేశ్‌కు సిల్వర్ మెడల్?దక్కే ఛాన్స్ ఉంది. దీంతో కాస్ ఏ తీర్పు ఇస్తుందా అని భారత అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు అనర్హత నేపథ్యంలో రెజ్లింగ్‌కు వినేశ్ రిటైర్‌మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించవద్దు:హైకోర్టు



**హైదరాబాద్, ఆగస్టు8 (జనంసాక్షి):**
క్రికెట్ లీగ్ నిర్వహణకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అపెక్స్ కౌన్సిల్ రాసిన లేఖను ప్రామాణికంగా తీసుకుని ఏవిధమైన మ్యాచ్‌లను నిర్వహించరాదని హెచ్‌సీఏకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆటగాళ్ల ఎంపిక నిమిత్తం లీగ్ మ్యాచ్‌లను నిర్వహించేందుకు హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ రాసిన లేఖను సవాలు చేస్తూ హైదరాబాద్ చార్మినార్ క్రికెట్ క్లబ్ పిటీషన్ వేసింది. దీనిని గురువారం జస్టిస్ నగేష్ భీమపాక విచారణ జరిపి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక ఆధారాల ప్రకారం అపెక్స్ కౌన్సిల్ రాసిన లేఖ అంబుడ్స్‌మన్ ఆదేశాలకు, బైలాస్‌కు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. అందుకే లీగ్ మ్యాచ్‌లను నిర్వహించరాదని హెచ్‌సీఏకు మధ్యంతర ఆదేశాలు చేస్తున్నట్లు వివరించారు. హెచ్‌సీఏ కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసి విచారణను వాయిదా వేశారు. పిటీషనర్ తరఫు న్యాయవాది వాదనలను వినిపిస్తూ, క్రికెట్ ఆటగాళ్ల ఎంపిక నిమిత్తం లీగ్ మ్యాచ్ లు నిర్వహించాలంటూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ జూలై 2న రాసిన లేఖ అంబుడ్స్‌మన్ జూన్ 14న ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకమన్నారు. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు విచారణను వచ్చే నెల 5కి వాయిదా వేసింది.



## ముగింపు వేడుకల్లో పతాకధారులుగా మనూ భాకర్, పీఆర్ శ్రీజేష్

**పారిస్ ఆగస్టు 09 (జనం సాక్షి)**
పారిస్ ఒలింపిక్స్‌లో పతాకధారులుగా ఇద్దరు క్రీడాకారుల పేర్లను భారత ఒలింపిక్ సంఘం ప్రకటించింది. తాజా మెగా క్రీడల్లో రెండు కాంస్య పతకాలు గెలిచిన షూటర్ మనూ భాకర్ పేరును ఇప్పటికే ప్రకటించారు. అయితే ముగింపు వేడుకల్లో భారత జాతీయ జెండాను ఆవిష్కరించే అవకాశాన్ని హాకీ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్‌కు కూడా కల్పించారు. పతాకధారులుగా పీఆర్ శ్రీజేష్, మనూ భాకర్ ఉండనున్నట్లు ఐఓఏ ఇవాళ ప్రకటించింది. శ్రీజేష్ అంశంలో ఐఓఏ సభ్యులు భావోద్వేగపూరిత నిర్ణయాన్ని తీసుకున్నట్లు ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష తెలిపారు. హాకీలో ఇండియా బ్రాంజ్ మెడల్ గెలిచింది. అయితే చివరి మ్యాచ్ తర్వాత శ్రీజేష్.. హాకీకి రిటైర్మెంట్ ప్రకటించారు.

# ఒలింపిక్స్‌లో సత్తా చాటడం గర్వకారణం

## నీరజ్ చోప్రాకు హర్భజన్ సింగ్ అభినందనలు




ఒలింపిక్స్‌లో పాల్గొని పతకాలు సాధించడం గొప్ప విషయమని భారత మాజీ క్రికెటర్, ఆప్ ఎంపీ హర్భజన్ సింగ్ అన్నారు. దేశానికి ప్రాతినిధ్యం వహించే అద్భుత అవకాశం కేవలం కొద్దిమంది అథ్లెట్లకే లభిస్తుందని చెప్పారు. ఒలింపిక్స్‌లో దేశం తరపున పాల్గొన్న క్రీడాకారులందరికీ తాను శిరస్సు వంచి సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ఒలింపిక్స్‌లో పాల్గొని సత్తా చాటడం ఏమంత సులభం కాదని, దీనికి చిత్తశుద్ధి, కఠోర శ్రమ అవసరమని పేర్కొన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన నీరజ్ చోప్రాను తాను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. నీరజ్ చాలా బాగా ఆడాడని, ఆయన తమ బంగారం అని హర్భజన్ అన్నారు. భారత రెజ్లర్ వినేశ్ పోఘాట్‌పై అనర్హత వేటు పడిన విషయం ప్రస్తావిస్తూ ఈ సంక్లిష్ట సమయంలో తాను ఆమె వెన్నంటి నిలుస్తానని, ఆమె బాధను కేవలం ఓ అథ్లెట్ మాత్రమే అర్థం చేసుకోగలరని చెప్పారు. వినేష్ పోఘాట్ రజత పతకానికి అర్హురాలని హర్భజన్ సింగ్ తేల్చి చెప్పారు. కాగా, పారిస్ ఒలింపిక్స్‌లో జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా సత్తా చాటాడు. భారత్‌కు స్వర్ణం అందిస్తాడనే అంచనాలను అధిగమించలేకపోయినా రజతం దక్కించుకు న్నాడు. రజత పతకాన్ని గెలుచుకున్న నీరజ్ చోప్రాను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. నీరజ్ చోప్రాతో మాట్లాడిన ప్రధాని అతడి గాయం గురించి ఆరా తీసి సత్వరమే కోలుకోవాలని ఆకాంక్షించారు.నీరజ్ చోప్రా రజత పతకం సాధించడంపై చోప్రా తల్లి స్పందించిన తీరునూ ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించారు. ఆమె క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారని ప్రశంసిం చారు. కాగా, నాలుగేండ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో ఎలాంటి అంచనాలూ లేకుండా బరిలోకి దిగి బరిసెతో భారత్‌కు అథ్లెటిక్స్‌లో తొలి స్వర్ణం అందించిన 'గోల్డెన్ బాయ్' నీరజ్ చోప్రా పారిస్‌లోనూ రజతంతో మెరిశాడు.

# వాంబే గృహాలకు మౌలిక వసతులు కల్పించాలి



**మల్కాజిగిరి,ఆగస్టు9 (జనంసాక్షి)**
నెరెడ్ మెట్, కౌకూర్ లోని వాంబే గృహాలకు మౌలిక వసతులు కల్పించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వాంబే, రాజీవ్ గృహ కల్ప గృహాలలో మౌలిక వసతులు కల్పించాలని అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. నెరెడ్ మెట్ డివిజన్ పరిధిలోని సిబిఎన్ కాలనీలో మొత్తం నాలుగు వందల ఎనభై వాంబే ఇండ్లు 2005లో మంజూరయినప్పటికి, కేవలం 270 ఇండ్లను అధికారిక విచారణ చేసి లబ్ధిదారులకు అందజేయడం జరిగింది, కానీ ఇప్పటివరకు వాటికి కరెంట్ మీటర్లు ఇవ్వకపోవడం పై ఎమ్మెల్యే అధికారులను వివరణ అడగడంతో, సరైన పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే లబ్ధిదారులకు వెంటనే కరెంట్ మీటర్లు ఇచ్చేందుకు అధికారులు ఒప్పుకున్నారు.అదే విధంగా మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహ కల్ప, కౌకూరులోని భరత్ నగర్ వాంబే పథకం క్రింద నిర్మించిన ఇండ్లకు కూడా వాటర్ కనెక్షన్లు, కరెంట్ మీటర్లు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జియం అశోక్, ముత్తయ్య,ఎడిఈ శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్, అల్వాల్ ఎమ్మార్వో రాములు,డిప్యూటీ ఎమ్మార్వో అనంత లక్ష్మి, బిఆర్ఎస్ నాయకులు రావుల అంజయ్య, బద్దం పరశురామ్ రెడ్డి, దోలి రమేష్, ఉపేందర్ రెడ్డి, డిల్లీ పరమేశ్, వెంకటేష్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి ప్రసాద్, సాయి గౌడ్, సందీప్ రెడ్డి, సతీష్ తదితరులున్నారు.



## రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే

**నాగలిగిద్ద ఆగస్టు 09 (జనం సాక్షి)**
తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్ గిరిధర్ రెడ్డి పదవీ బాధ్యతల కార్యక్రమానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి శుక్రవారం హైద్రాబాద్‌లో సెట్విన్ చైర్మన్‌గా గిరిదర్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని శాలువాకప్పి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు.

# అమీన్పూర్‌లో కబ్జాలపై ఉక్కు పాదం

**అమీన్పూర్ ఆగస్ట్ 09, (జనంసాక్షి)**
అమీన్పూర్ మున్సిపాలిటీ సర్వే నంబర్ 993లో గత కొంతకాలంగా జరుగుతున్న కబ్జాలపై నిరంతరంగా సమిష్టిగా పోరాడుతున్న అమీన్పూర్ గ్రామస్తుల పోరాటం సఫలం అయింది. అమీన్పూర్ ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 993లో కొందరు కబ్జాదారులు రాజకీయ పలుకుబడితో సుమారు 5000 గజాలకు స్కెచ్ వేసి దోచుకునే ప్లాన్ వేసి పక్కనున్న పట్టానంబర్‌తో ప్రభుత్వ భూములో చొరబడి దౌర్జన్యంగా ప్రహరీ నిర్మించుకుని కబ్జాకు పాల్పడ్డారు. అట్టి విషయం తెలుసుకున్న అమీన్పూర్ బీజేపీ సీనియర్ నాయకులు ,అమీన్పూర్ పెద్దమనుషులు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ గారి ఆదేశాలతో సదరు ప్రభుత్వ భూమిను సర్వే చేసి కబ్జాకు గురైన విషయం గ్రహించి స్థానిక మండల రెవిన్యూ అధికారి రఘునాథరెడ్డి కు కూల్చివేతకు ఆదేశాలు ఇవ్వడంతో శుక్రవారం రెవిన్యూ సిబ్బందితో పాటు జేసీబీ లతో ప్రహరీ గోడలను తొలిగించారు. ఇట్టి చేర్యాలు అమీన్పూర్ గ్రామస్తులు, బీజేపీ నాయకులు హర్షంవ్యక్తం చేశారు. అమీన్పూర్‌లో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై సమిష్టిగా కృషి చేస్తే ఫలితాలు ఉంటాయని బీజేపీ సీనియర్ నాయకులు అదెల్లి రవీందర్ జనంసాక్షితో తెలియజేశారు.





## పార్టీ పటిష్టతకు కృషి చేస్తా

### పాలమూరు పట్టణ బీజేవైఎం అధ్యక్షునిగా ఎం శివకృష్ణ

**మహబూబ్ నగర్ ఆగస్టు 9 (జనం సాక్షి)**
పార్టీ పష్టతకు అహర్నిశలు కష్టపడి పని చేస్తానని నూతనంగా పాలమూరు పట్టణ బీజేవైఎం అధ్యక్షులుగా ఎన్నికైన ఎం. శివకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా శు క్రవారం ఆయన 'జనం సాక్షి'తో మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని బొమ్మ చేయకుండా పార్టీ పట్టిసీత కోసం కష్టపడి అహర్నిశలు పనిచేస్తానని అన్నారు. గతంలో తాను బీజేవైఎం ప్రధాన కార్యదర్శిగా, బిజెపి పట్టణ కార్యదర్శిగా పనిచేశానని అన్నారు. క్రమశిక్షణ గల బిజెపి పార్టీలో, నరేంద్ర మోడీ నాయకత్వంలో తాను పనిచేయడం తమ అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్రంలో భవిష్యత్తులో బిజెపి అధికారంలోకి రాబోతుందని అన్నారు. తమకు ఈ పదవి దక్కడానికి సహకరించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పల్లె తిరుపతి లతో పాటు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి



## మేకపోతుల నరేందర్ గౌడ్

**ఖైరతాబాద్,ఆగష్టు 09(జనంసాక్షి)**
రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా కులగణన జరిపి, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42%రిజర్వేషన్లు అమలుచెయ్యాలి అని వక్తలందరు ఏకగ్రీవంగా ముక్త కంఠంతో నినదించారు. లేని పక్షంలో బీసీలనుంచి బంగ పాటు తప్పదు అని హెచ్చరించారు. రాహుల్ గాంధీ దేశంలో కులగణన బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్ బీజేపీతో కొట్లాడుతుంటే ఆయన స్పూర్తితో పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో మాత్రం బీసీ రిజర్వేషన్లు కల్పించే విషయంలో స్పష్టత లేకపోవడం శోచనీయం అని వక్తలు మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్ పూర్తి స్థాయిలో అమలుకోరకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ మేధావులు, ఉద్యమకారులతో సమావేశంఏర్పాటు చేసి సలహాలు సూచనలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42%రిజర్వేషన్లు అమలు చేయాలి. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా ప్రొఫెసర్ ఇంకొండ తిరుమలి, బత్తుల సిద్దేశ్వర్లు హిందు బీసీ మహాసభ అధ్యక్షులు,ప్రో ప్రబంజన్ యాదవ్, పాలడుగు శ్రీనివాస్ ఓయూ జాక్ కన్వీనర్, దేశగాని సాంబ శివ గౌడ్ బీసీ బీసీ ఉద్యమ వేదిక అధ్యక్షులు,కట్టెకొల శ్రీహరి ముదిరాజ్, సురేష్ ముదిరాజ్ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు, వాసు.కె యాదవ్ బహుజన సేన అధ్యక్షులు, బొంగు ప్రసాద్ గౌడ్ బ్లూ ఇండియా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు దేశం మహేష్ గౌడ్ ఓబీసీ ఆజాది ఆందోళన్ అధ్యక్షులు, అశోక్ పోషం రేపటి తెలంగాణ అధ్యక్షులు, బెల్లం మాధవి సావిత్రి భాయ్ ఫుల్ మహిళ సంఘం అధ్యక్షురాలు, మట్టా జయంతి గౌడ్, బీసీ మహిళ జేఏసీ చైర్మన్, నగిరి ప్రవీణ్ కుమార్ హిందు బీసీ విద్యార్థి మహా సభ వ్యస్థాపక అధ్యక్షులు,బెక్కం వెంకట్ ఎంబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు,పొన్నం భిక్షపతి గౌడ్ బీసీ ఉద్యమ వేదిక కార్యదర్శి, బొల్లం లింగ మూర్తి వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, సరికొండ రామ కృష్ణంరాజు వర్కింగ్ ప్రెసిడెంట్ బీసీ సంక్షేమ సంఘం, గిరగని భిక్షపతి గౌడ్ బీసీ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు,మట్టా రాజు యాదవ్ తెలంగాణ బీసీ యువజన సంఘం అధ్యక్షులు, ఎర్ర శ్రీహరి గౌడ్ వైస్ ప్రెసిడెంట్ బీసీ సంక్షేమ సంఘం,కే గిరగని క్రాంతికుమార్ గౌడ్ బీసీ సంక్షేమ సంఘం జిహెచ్ఎంసి అధ్యక్షులు బీసీ సంక్షేమ సంఘం, జక్కే విరస్వామి గౌడ్ బహుజన నాయకులు, విశ్వపతి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు, అబ్బాగోని అశోక్ గౌడ్ ఉమ్మడి నిజామాబాద్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, కొంగర నరహరి, దాసరి మూర్తి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, జక్కని సంజయ్ కుమార్ ఐటీబీసీఫ్ అధ్యక్షులు, తవతం సత్యం బీసీ సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శి, కాల్వ మధు బాబు,మట్టిపల్లి మల్లేష్ యాదవ్ సూర్య పేట జిల్లా అధ్యక్షులు, సాయికిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



- విద్యార్థులకు ఇచ్చే అన్ని బెనిఫిట్‌లు ఇవ్వాలి
- తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ ఆదేశం

**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 9 (జనం సాక్షి):**
వికారాబాద్ నియోజకవర్గ వసతిగృహ సలహా సంఘం సమావేశము నేడు వికారాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ మరియు బిసి సంక్షేమ శాఖల వసతి గృహముల యొక్క నూతన విద్యార్థుల ప్రవేశముల కొరకు సమావేశము నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు మరియు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ అయినటువంటి గౌరవనీయులు శ్రీ ప్రసాద్ కుమార్ గారు హాజరు అయినారు వీరితోపాటు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి. మల్లేశం , వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఉపేందర్ షెడ్యూల్ తెగల అభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి మరియు నియోజకవర్గంలోని వివిధ మండలాల ఎంపీడీవోలు తహసీల్దారులు ఎంఈఓ లు మరియు నియోజకవర్గంలోని వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొనడం జరిగింది. నియోజకవర్గంలోని ఎస్సీ ఎస్టీ మరియు బిసి వసతి గృహంలోని విద్యార్థుల యొక్క ఖాళీలను పూర్తి చేయడానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో స్పీకర్ కొన్ని సూచనలు చేయడం జరిగింది అవి వసతి గృహంలోని మౌలిక వసతులు సక్రమంగా ఉండేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు అందించే అన్ని రకముల సదుపాయములు వసతులు సకాలంలో అందించేటట్లు చర్యలు తీసుకోవాలి జిల్లా స్థాయి డివిజన్ స్థాయి అధికారులు వసతి గృహములను సక్రమంగా పర్యవేక్షణ చేయాలి. వసతి గృహం విద్యార్థులు అందరూ చదువు విషయంలో కూడా వసతి గృహ సంక్షేమ అధికారులు వ్యక్తిగత శ్రద్ధ వహించాలి.

# హైద్రాబాదుకు విచ్చేసిన బాక్సర్ నికత్ జరిన్‌కు సన్మానం

**రాజేంద్రనగర్, ఆగస్టు9(జనం సాక్షి)**
బాక్సింగ్ ఫెడరేషన్ అఫ్ ఇండియా తరపున పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొని హైదరాబాద్ విచ్చేసిన బాక్సర్ నికత్ జరిన్‌కు ఘనంగా సన్మానం. శుక్రవారం తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ సెక్రటరీ పి. రవీందర్, ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, ఆర్గనైజర్ సెక్రెటరీ లక్ష్మణ్, నికాత్ జరీన్ తండ్రి జమీల్ అహ్మద్, ప్రైవేట్ బాక్సింగ్ క్లబ్ కోచ్‌లు పి. వినేష్ బాబు, బి. శివకుమార్, అడ్వైసర్ పి. అవినాష్, సన్నీ పాల్గొని సన్మానించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్1 డీఎస్పీ పోస్ట్ ఉద్యోగం ప్రకటించినందుకు శుభాకాంక్షలు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
10 ఆగస్ట్ 2024

# రెవెన్యూ అధికారి ఇంట్లో నోట్ల కట్టలు

- అక్రమ ఆస్తులు రూ.6.07 కోట్లు
- నగదు రూపంలో 2.93 రూపాయల కోట్లు
- బ్యాంకులో బ్యాలేన్స్ రూ.1.10 కోట్లు
- స్థిరాస్తుల విలువ రూ.1.98 కోట్లు



**నిజామాబాద్ ,ఆగస్టు 09 (జనంసాక్షి) :** నిజామాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ఇంచార్జ్ రెవెన్యూ ఆఫీసర్ దాసరి నరేంధర్ ఇంటిలో దోరికన ఆస్తులు చిట్టా, నోట్ల కట్టలను చూసి ఎసిబి అధికారుల కళ్లు అవాక్కయ్యాయి. నెల రోజుల క్రితం అవినితి నిరోధక శాఖకు అందిన విశ్వసనీయ సమచారం మేరకు శుక్రవారం తెల్లవారు జామున నిజామాబాద్ ఎసిబి అధికారులు నిజామాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ సూపరింటేండేంట్ దాసరి నరేంధర్ ఇంటిపై తెల్లవారు జామున దాడి చేశారు. అక్రమాస్తులు కుడ బేట్టారని వచ్చిన పిర్యాదు మేరకు నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్‌లోని ఆశోక టవర్‌లోని నరేందర్ ఇంటిలో, కోటగల్లిలోని మరో ఇంటిలో, నిర్మల్ లోని బంధువుల ఇళ్లలో ఎకకాలంలో సోదాలు నిర్వహించారు. సోదాలలో మొత్తం లభించిన ఆస్థులు, నగధు, బంగారం విలువ రూ.రూ.6.07 కోట్లు గా గుర్తించారు. ఇంట్లో నోట్ల కట్టల విలువనే రూ.2.93 కోట్లు గా తెలింది. రూ.500 నోట్ల కట్టలను లెక్కించాడానికి ఎసిబి అధికారులకు మని కౌంటింగ్ మేషన్ లను ఉపయోగించారు. నోట్లను లెక్కించాడానికి సుమారు ఆరు గంటలకు పైగా సమయం పట్టింది. దాసరి నరేంధర్, అతని భార్య,తల్లి పేర్ల మీద వివిధ బ్యాంకు లలోని 7 అకౌంట్లలో రూ.1.10 కోట్లు నగధు ఉన్నట్లు అదారాలు లభించాయి. అతని ఇంటిలో 51 తులాల బంగారు అభరణాలను గుర్తించారు. నిజామాబాద్ జిల్లాలో ఇతర ప్రాంతాలలో 17 వివిధ ప్రాంతలాలోని స్థిరాస్థుల విలువ రూ..1.98 కోట్లు గా ఉన్నట్లు గుర్తించారు. నిజామాబాద్ జిల్లాలో తోలిసారి ఒక ఉద్యోగి వద్ద ఆదాయానికి మించి అస్థులు కుడ బెట్టిన ఘటనలో అతి పెద్ధ కేసుగా ఎసిబి అధికారులు తెలుపుతున్నారు. మార్కేట్( రిజిస్ట్రేషన్) విలువ ప్రకారమే ఆస్థుల విలువ రూ.6.07 కోట్లు అని తెలింది . కాని బహిరంగ మార్కేట్ లో దాని విలువ నాలుగింతలు ఉంటుందని సమాచారం. నరేంధర్ కు తెలంగాణతో పాటు మహారాష్ట్రలోని బంధువుల పేరుమీదా బినామి ఆస్తులు కోట్ల లో కుడా బెట్టారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు ఎసిబి అధికారులు కేసు నమోదు చేసి నరేందర్ ను రిమాండ్ కు తరలిస్తున్నట్లు ఎసిబి డిఎస్పీ తెలిపారు.

## పాతబస్తీలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి

# ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఉత్తమ్

### సెట్విన్ చైర్మన్‌గా గిరిధర్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న మంత్రులు

### స్కిల్ డెవలప్‌మెంట్‌ను పెంచడానికి ప్రభుత్వ కృషి



**హైదరాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని పాతబస్తీ అభివృద్ధికి ఒక ముఖ్యమైన చర్యగా, ఉపాధి ప్రమోషన్, సొసైటీని పునరుద్ధరించడం ద్వారా ఈ ప్రాంతంలో నిరుద్యోగ నిర్మూలనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పౌర సరఫరాలు మరియు నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. జంట నగరాలు (సెట్విన్) మరియు ఇతర సంస్థలలో శిక్షణ సెట్విన్ చైర్మన్‌గా ఎన్ గిరిధర్ రెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహతో పాటు ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ పాతబస్తీని అభివృద్ధి చెందిన ప్రాంతంగా మారుస్తామన్న హామీని నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పాతబస్తీలో మౌలిక సదుపాయాలను పెంపొందించేందుకు కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (క్యూక్యూఎస్ యుడిఏ)ని మార్చడంతోపాటు, సెట్విన్ మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణను పునరుద్ధరించడం, గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మైనారిటీ డిక్లరేషన్‌లో చేసిన ప్రధాన హామీలలో ఒకటి. " అని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని పాతబస్తీలో నిరుద్యోగిత రేటు 21% వద్ద ఉందని, 20 నుండి 24 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారిలో 45శాతానికి పెరిగిందని ఆయన సూచించారు.



## కరీంనగర్ తీగల వంతెనపై రోడ్డు

# పదేపదే ధ్వంసం

- వన్ వేతో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు
- స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల ద్వంద్వ వైఖరి
- గతంలో తక్షణమే మరమ్మత్తులు, ప్రస్తుతం గప్ చుప్
- మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు అఖిల్ పాషా డిమాండ్

**కరీంనగర్ (జనంసాక్షి) :** కరీంనగర్ పట్టణంలో బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన తీగల వంతెనపై రోడ్డు ఎన్నిసార్లు వేసినా పెచ్చులా లేచి రోడ్డు ధ్వంసమౌతుందని, అయినా మరమ్మతులు చేసి వదిలేస్తున్నారే గానీ శాశ్వత పరిష్కారం చూడట్లేదని, ప్రస్తుతం ధ్వంసమైన తారు రోడ్డు తొలగించడంతో అంధవికారంగా మారిందని తీన్మార్ మల్లన్న టీం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అఖిల్ పాషా మండిపడ్డారు. శుక్రవారం తీగల వంతెనపై ఇరువైపులా రోడ్డును పరిశీలించి వారు మాట్లాడుతూ.. తీగల వంతెనపై తారు రోడ్డు ధ్వంసమైతే స్థానిక(బీఆర్ఎస్) ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తక్షణమే మరమ్మతులు చేయించేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కనీసం అటువైపు తొంగి చూడట్లేదన్నారు. బహుశా, అటుగా వెళ్తున్న ప్రయాణికులు వంతెనపై రోడ్డును చూసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించాలని నిర్లక్ష్యం వహిస్తున్నారా? అని మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే మీరే అయినప్పుడు ద్వంద్వ వైఖరి ఎందుకని, మిమ్మల్ని నమ్మి కరీంనగర్ నియోజకవర్గ ప్రజలు మళ్ళీ అవకాశం ఇస్తే ఇంత నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ఈ బ్రిడ్జి 224 కోట్లు నిధులతో 680 మీటర్ల పొడవుతో నిర్మాణం చేసి కరీంనగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు సందర్శన స్థలంగా తీర్చిదిద్దుతామని, ఆఖరికి సందిగ్ధంలో ముంచేశారు. రోడ్డు చెడిపోవడంతో మలుమార్లు మరమ్మత్తులు చేస్తుంటే ఎంతో మంది ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని, గతంలో ప్రమాదాలు కూడా జరిగాయని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. నీ ప్రభుత్వం కూలిపోయేసరికి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా తప్పించుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే విధంగా వ్యవరించడం సరికాదని ఒకవేళ పని చేయడం చేతగాకుంటే రాజీనామా చేయాలన్నారు.

## గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల నిర్మాణం కోసం పరిపాలన అనుమతులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఆర్ఎస్ పీ-ఐఎఫ్ఎఫ్సి ప్యాకేజీ నెం.7 బ్యాలెన్స్ పనుల కోసం సవరించిన అంచనాకు రూ. 431.30 కోట్లు విడుదల చేసింది. గౌరవెల్లి ప్రాజెక్ట్ ద్వారా హుస్నాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ స్టేషన్‌లోని కరువు ప్రాంతాల్లో 1,06,000 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు, గౌరవెల్లి రిజర్వాయర్ నుండి నీటిని వినియోగించుకునేందుకు, భూసేకరణ దశతో సంబంధం లేకుండా తాజాగా టెండర్లు పిలవడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది.

# జీవో నంబర్ 46 అభ్యర్థులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలి

### లేదంటే ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని కేటీఆర్ హెచ్చరిక



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విధంగా జీవో నంబర్ 46 అభ్యర్థులకు న్యాయం చేయాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు. ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం పై ఒత్తిడి పెంచాలని కోరుతూ జీవో నంబర్ 46 అభ్యర్థులు కేటీఆర్ ను నందినగర్ లోని నివాసంలో కలిశారు. బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, రాకేష్ రెడ్డి తో కలిసి అభ్యర్థులు కేటీఆర్ ను కలిసి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వివరించారు. ఎన్నికలకు ముందు జీవో నంబర్ 46 ను రద్దు చేస్తామని నమ్మబలికితే కాంగ్రెస్ పార్టీ గెలిచేందుకు సహకరించామని కానీ గెలిచిన తర్వాత పట్టించుకోవటం లేదని అభ్యర్థులు కేటీఆర్ ముందు వాపోయారు. ఐతే ఈ సమస్యకు సంబంధించి గతంలో సీఎస్ తో మాట్లాడిన అంశాన్ని కేటీఆర్ వారికి గుర్తు చేశారు. అదే విధంగా ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీ ప్రకారం వారి సమస్యను పరిష్కరించాలని కోరారు. అందుకు బీఆర్ఎస్ నుంచి ఇవ్వాల్సిన సహకారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. కోర్టు కేసులను తప్పించుకుంటూ అభ్యర్థులకు అన్యాయం చేసే ప్రయత్నం మంచిది కాదన్నారు. ఈ విషయంలో తమ పార్టీ నాయకులు గత కొన్ని రోజులుగా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొస్తున్న విషయాన్ని కూడా కేటీఆర్ గుర్తు చేశారు. జీవో నంబర్ 46 విషయంలో పోరాటం చేస్తున్న అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. తమ సమస్య తీరే వరకు అండగా ఉంటామని ధైర్యమిచ్చిన కేటీఆర్ కు అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.



## ప్రజల భాగస్వామ్యంతో

# పచ్చదనం

### స్పెషల్ ఆఫీసర్ నీరజ

**శామీర్‌పేట్ (జనంసాక్షి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛధనం పచ్చదనంలో ప్రజలు బాగస్వాములు కావాలని ఎంసి పల్లి మండల స్పెషల్ ఆఫిసర్ నీరజ అన్నారు. శుక్రవారం ఎంసి పల్లి మండలంలోని కేశవరం గ్రామంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా పర్యవరణ పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, మొక్కలు నాటుట, కుక్కకాటుకు నియంత్రణ అంశా లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాదులపై తీసు కోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వత్సలదేవి ఎంపీఓ మంగతయారు, అటవీ శాఖ అధికారులు,ఆశాలు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో సీఎంఆర్ షాపింగ్ మాల్ ఘనంగా ప్రారంభం

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 09 (జనం సాక్షి) :**

తెలుగు రాష్ట్రాలలో అతి పెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సి.ఎం.ఆర్. గ్రూప్ తమ 32వ షాపింగ్ మాల్ ను మార్కెట్ రోడ్, కరీంనగర్లో ఆగష్టు 9న డా.భూంరెడ్డి ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. ముఖ్యఅతిథులుగా చలిమెడ లక్ష్మీ నరసింహరావు చైర్మన్, చలిమెడ ఆనందరావు ఇన్స్టిట్యూట్ అఫ్ మెడికల్ సైన్సెస్, డా.వి. సూర్యనారాయణ రెడ్డి, డా.వి.రమాదేవి లు పాల్గొన్నారు. కరీంనగర్ ఆర్యవైశ్య సేవా కేంద్రం ప్రెసిడెంట్ చిదుర సురేష్ మొదటి కొనుగోలుదారులు గా పాల్గొన్నారు. సి.ఎం.ఆర్. ఫౌండర్ , చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ... తమ సంస్థను గత 40 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ ప్రజలు ఆదరిస్తున్నారని తెలుపుతూ మా 32వ షోరూం ను కరీంనగర్లో ప్రారంభించటం చాలా సంతోషంగా ఉందని సి.ఎం.ఆర్. లో షాపింగ్ అంటే ప్రపంచ స్థాయి అనుభూతి కలిగేలా ఉంటుందన్నారు. ప్రజలు తమకు కావాల్సిన అన్నిరకాల వేడుకలకు సి.ఎం.ఆర్. తగు విధంగా అన్ని మోడల్స్ కుటుంబమంతటికీ నచ్చే విధంగా వస్త్రాలు అన్ని వర్గాల ప్రజలకు అతి తక్కువ ధరలకే అందించటం సి.ఎం.ఆర్. ప్రత్యేకత అని తమ సొంత మగ్గాలపై నేయించిన వస్త్రాలను మార్కెట్లో మరెవ్వరూ ఇవ్వని ధరలకు సి.ఎం.ఆర్. అందిస్తుంద న్నారు. సి.ఎం.ఆర్. మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ... తన 32వ షోరూం ను కరీంనగర్లో ప్రారంభించటం చాలా ఆనందంగా ఉందన్నారు. సి.ఎం.ఆర్. అంటే ది వన్ స్టాప్ షాప్ అంటే ఫ్యామిలీ అందరికీ నచ్చే విధంగా అన్ని రకాల వెరైటీలు, డిజైన్స్ లభిస్తాయని తమ వద్ద అందరికీ అందుబాటు ధరలలో లక్షలలో, డిజైన్లు వేలల్లో వెరైటీలు లభిస్తాయన్నారు. ప్రముఖ సినీతారలు కుమారి పాయల్ రాజ్పుత్ , కుమారి సంయుక్త మీనన్ జ్యోతిప్రజ్వలన చేసి అన్ని సెక్షన్లు తిరుగుతూ షోరూములో ఉన్న అన్నిరకాల డిజైన్లు పరిశీలించారు. సి.ఎం.ఆర్. గత 40 సంవత్సరాలుగా వస్త్ర వ్యాపార రంగంలో క్వాలిటీకి, డిజైన్‌కు ప్రత్యేకతనిస్తూ తెలుగు రాష్ట్రాలలో అగ్రగామిగా నిలిచిందని సిఎంఆర్ అంటే కుటుంబమంతటికీ మెచ్చే కంప్లీట్ ఫ్యామిలీ షాపింగ్ మాల్ అని కొనియాడారు. తమ ఫ్యాన్స్ ను ఆటపాటలతో డ్యాన్సులతో ఉర్రూతలూగించారు.





సిఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన డా.భూంరెడ్డి


# దివాలా తీసిన అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల సంస్థ

**రైతు ఉత్పత్తుల కొనుగోలుకు బ్రేక్**

- రైతులకు లక్షల రూపాయలు బకాయిపడ్డ కంపెనీ
- రైతుల డబ్బు కంపెనీ నుంచి వసూలు కోసం అధికారుల కసరత్తు

**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 9 (జనంసాక్షి):** మహిళ రైతుల సాధికారత కోసం అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల సంస్థను అధికారులు ఏర్పాటు చేశారు. అది ఇప్పుడు పూర్తిగా దివాలా తీసింది. మహిళ సాధికారత సాధించకుండానే మూత పడింది. మహిళా రైతుల లక్ష్యం నెరవేరకుండా పోయింది. పైగా ఒక కంపెనీ రైతుల ఉత్పత్తులు కొనుగోలు చేసి బకాయపడింది. వారికి ఇప్పటివరకు సొమ్ము చెల్లించలేదు .వివరాల్లోకి వెళితే... వికారాబాద్ జిల్లా మోమిన్ పెట్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఇవాళ మూతపడింది. గత రెండేళ్లుగా రైతు ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా నిలిపివేసింది. మోమిన్ పేట మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏరువాక రైతు సేవా కేంద్రం పేరుతో రైతులు ఉత్పత్తి చేసిన వివిధ రకాల పంటలను కూరగాయలను కొనుగోలు చేస్తుంది. 2019 సంవత్సరంలో సీఐఎన్ యువో 1400 టి జి 2019 పి టి సి 13 73 90 నంబర్ తో ఈ సంస్థ రిజిస్ట్రేషన్ అయ్యింది. అప్పట్లో ఈ సంస్థ అభివృద్ధి కోసం సెల్ఫ్ సంస్థ కోటి యాభై లక్షల రూపాయల బడ్జెట్ మంజూరు చేసింది. రైతుల అవసరాల కోసం సంస్థ 16 రకాల వ్యవసాయ పనిముట్లు రెండు ట్రాక్టర్లు ఇతర సామగ్రి కొనుగోలు చేయగా బొలోరో వాహనాన్ని మోమిన్ పేట యూనియన్ బ్యాంక్ ద్వారా అప్పు కింద కొనుగోలు చేశారు. మిగతా నిధులతో రైతుల నుంచి ఉత్పత్తులను కొనుగోలు చేసి విక్రయించారు. రోజువారీగా రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి బే నిషాన్ కంపెనీతో అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఒప్పందం కుదిరించుకుంది. దీంతో ఈ సంస్థ లావాదేవీలు సాగించారు. ఈ సంస్థ ద్వారా లావాదేవీలు సవ్యంగా జరిగిన గత కొన్ని సంవత్సరాలుగా లావాదేవీలు జరుపకుండా దివాలా తీసింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటలకు కంపెనీ సకాలంలో డబ్బులు చెల్లించలేకపోయింది. దాదాపు 12 లక్షల రూపాయల వరకు బకాయపడింది. దీంతో రైతులు గగ్గోలు పెట్టడంతో సెల్ఫ్ సంస్థ మంజూరు చేసిన నిధులనుంచి అధికారులు ఆరు లక్షల రూపాయల వరకు రైతులకు చెల్లించారు. మరో మూడు లక్షలు రైతులకు చెల్లించవలసి ఉంది. రైతులకు రావలసిన బకాయాలను కంపెనీ నుంచి వసూలు చేయడానికి సెర్ఫ్ సంస్థ నానా తంటలు పడుతుంది. అతి కష్టం మీద మూడు లక్షల రూపాయల వరకు కంపెనీ నుంచి వసూలు చేసింది. ఈ సంస్థలో దాదాపు 1300 మంది మహిళా రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. సభ్యత్వ రుసుము కింద దాదాపు 8 లక్షల రూపాయల వరకు సెల్ఫ్ సంస్థకు చెల్లించారు. ఈ సంస్థలో సభ్యత్వం ఉంటేనే మహిళ రైతులు అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల సంస్థ లో వారు పండించిన పంటలను విక్రయించడానికి అవకాశం ఉంటుంది. ఇందులో సభ్యత్వం లేని రైతు పంటను సంస్థ కొనుగోలు చేయదు. తాండూర్ మోమిన్ పేట కుల్కచర్ల మండలాలలో ఈ సంస్థలను సర్ఫ్ సంస్థ మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తుంది. ఇప్పటికైనా అధికారులు తిరిగి సంస్థ రైతు ఉత్పత్తులను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.






# మంథన్ స్కూల్లో గ్లోబల్ యూనివర్శిటీ ఫెస్టివల్

### వందకుపైగా విశ్వవిద్యాలయాలు రాక



**హైదరాబాద్ (జనంసాక్షి) :** విద్యార్థుల భవిష్యత్తు ఆకాంక్షలకు మార్గనిర్దేశం చేయడమే లక్ష్యంగా మంథన్ స్కూల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని స్కూల్ ఆవరణలో గ్లోబల్ యూనివర్శిటీ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ ఫెస్టివల్‌కు ప్రపంచంలో ఉన్న వందకు పైగా యూనివర్సిటీలు హాజరయ్యాయి. భారతదేశం, యూఎస్, యూకే, కెనడా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా నుంచి విశ్వవిద్యాలయాలు పాల్గొన్నాయి. ఈ ఫెస్టివల్ ఉన్నత పాఠశాల తల్లిదండ్రులు, విద్యార్థులను విశేషంగా ఆకర్షించింది. తల్లిదండ్రులు టేబుల్ ఫెయిర్‌లో విశ్వవిద్యాలయ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ ఫెస్టివల్ నా ఉన్నత విద్య కోసం ఏ స్ట్రీమ్‌ను ఎంచుకోవాలి?, ఏ కళాశాలలు సరిపోతాయన్న విషయంలో చాలా స్పష్టమైన విజన్ ఏర్పడిందని మంథన్ విద్యార్థి తెలిపారు. 12వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని తల్లిదండ్రులు పాఠశాల ఈ ప్రయత్నాన్ని అభినందించారు. నా బిడ్డను చేర్చుకోవాలని ఆశిస్తున్న అనేక విశ్వవిద్యాలయాల నుంచి ప్రతినిధులను కలిసే అవకాశం నాకు లభించింది. ఇప్పుడు మరింత సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోగలనన్నారు. మంథన్ కాలేజ్, కెరీర్ కౌన్సెలర్ ఫైరీనా సిద్ధిఖీ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రముఖ విశ్వవిద్యాలయాల మధ్య ఇంటరాక్షన్ జరిగిందన్నారు. ఇది విద్యార్థులకు, తల్లిదండ్రులకు తమ పిల్లల ఉన్నత విద్య విషయంపై తగిన నిర్ణయం తీసుకునేందుకు అవకాశం ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా మంథన్ స్కూల్ ప్రిన్సిపాల్ సుర్జీత్ సింగ్ మాట్లాడుతూ యూనివర్శిటీ ఫెస్టివల్‌కు హాజరైన విశ్వవిద్యాలయ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. మా పాఠశాలలో ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల ప్రతినిధులు ఉండటం గౌరవంగా ఉందన్నారు. చాలా మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ ఈవెంట్‌కు హాజరు కావడం సంతోషంగా ఉందని తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370